C

రాష్ట్రీయం అభివృద్ధి చరిత్ర

లవణం

C.P

A

నాస్తికత్వం

అభివృద్ధి, చరిత్ర

లక్షణం

నాస్తిక కేంద్రం
పటమట, విజయవాడ-520006.

B

NASTIKATVAM
ABHIVRUDDHI, CHARITRA

by **LAVANAM**

NO. 969
Acc.
15084

Copyright :

Nastika Kendram,
Vijayawada.

First Published :

June 1978


Price Rs. **4-00**

Published by

Nastika Kendram,
Vijayawada-520 006.


Printed at

Insaan Printers, Vijayawada-6.



నాస్తికోద్యమ నిర్మాత గోరా

కృషికి స్మృతికి చిన్న కానుక



ముందు మాట

మతానికి, నాస్తికత్వానికి మధ్య; బానిసప్రవృత్తికి, బాధ్యతాయుత స్వేచ్ఛా ప్రవృత్తికి పుణ్య సంధికాలంలో మనం ఉన్నాం. మతవ్యవస్థపై, దైవభావంపై నమ్మకం సడలిపోయింది. కాని నాస్తికత్వం జీవిత విధానంగా అన్ని రంగాలలోనూ ప్రతిబింబిస్తూ ఇంకా వ్యాప్తిచెందలేదు. అలాగే బానిస ప్రవృత్తిపై అసహ్యత ఏర్పడింది. కాని ఆచరణకి, ఆలోచనకి, అనుభవాలకు, అవగాహనకు మానవుడు కేంద్రమని, బాధ్యత తోను, స్వేచ్ఛతోను, కృషితోను జీవిత రంగాలలో కావలసిన మార్పులను, ఆలోచనల్లో రావాల్సిన చేర్పులను మానవుడే రూపొందించుకోవాలని ఇంకా పూర్తిగా భావించడంలేదు.

ఇటువంటి సమయంలో మానవుడిని కేంద్రం చేస్తూ నాస్తిక అవగాహన, నాస్తిక ఆచరణ మేళవించి నాస్తికత్వాన్ని ఒక పాజిటివ్ జీవిత విధానంగా గోరా ప్రతిపాదించారు.

వీనిని అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. అందుచేతనే గోరా అనంతరం నాస్తిక అధ్యయన తరగతులను నాస్తికకేంద్రం నిర్వహిస్తోంది. ఇలాంటి మొదటి అధ్యయన తరగతులు 1976 మే లో జరిగాయి. ఆ తరగతులకు నిర్వాహకుడిగా ఉండి ఎక్కువ విషయాల బోధనా బాధ్యతలను నేను తీసుకున్నాను. ఆ మొదటి తరగతులకు వచ్చిన వారిలో "స్వామి సమత్వానంద"గా ప్రసిద్ధి చెందిన శ్రీ ఆరుమళ్ల సుబ్బారెడ్డిగారొకరు. శ్రీ సుబ్బారెడ్డిగారు స్వాతంత్ర్య సమర

యోధులు. అస్పృశ్యతకు, కులతత్వానికి, మతమౌఢ్యానికి వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి. సంతానమున్న విధవను కోడలుగా స్వీకరించి తన కుమారుడు ఆనంద్ వివాహం ఆ రోజుల్లోనే జరిపించారు. హిందూ మత గ్రంథాలను లోతుగా అధ్యయనం చేశారు. ఇలాంటి సుబ్బారెడ్డిగారిని 1976 నాస్తిక అధ్యయన తరగతులు ఆకర్షించాయి. తరగతులకు వచ్చే వారు కొద్దిమందే ఉంటారు. కాని తరగతుల్లో చెప్పే విషయాలు పుస్తక రూపంలో ఉంటే ఎక్కువ మంది చదువుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. నాస్తిక అధ్యయన తరగతుల్లో చెప్పబడిన విషయాలు నచ్చిన సుబ్బారెడ్డిగారు వీటిని ప్రచురించాలనే సూచనచేసి ముద్రణకు సహాయంగా రు. 1000/- విరాళం ఇచ్చారు. నేటి సమాజంలో నాస్తికత్వ అధ్యయన ఆవశ్యకత గుర్తించి, ఈ సహకారాన్ని అందించిన శ్రీ సుబ్బారెడ్డిగారికి నా కృతజ్ఞతలు.

ఈ పుస్తకం గత డిశంబరు నాటికే వెలువడి ఉండవలసింది. 40 పేజీలు అచ్చు అయిన తర్వాత మిగిలిన ప్రాతప్రతి, నేను తయారు చేసుకున్న నోట్సు 1977 నవంబరు తుఫానులో, నాస్తికకేంద్రం దెబ్బ తిన్నప్పుడు కొట్టుకొని పోయాయి. అవన్నీ మళ్లీ తిరిగి వ్రాయవలసి వచ్చింది. అందుచేత ఆలస్యమైంది.

నాస్తికత్వమంటే కేవలం దేవుడు లేదనటమో, మూఢనమ్మకాలను వ్యతిరేకించటమో, కుటుంబవ్యవస్థను కాచనటమోకాదు. మన చుట్టూఉండే పరిసరాలలో మానవుని ఆస్తిత్వమును గుర్తించి దైవభావానికిగాని, విధి ప్రాతకుగాని, కర్మ-జన్మ పరంపరకుగాని మానవుడు లోబడిలేడని, అలాగే పరిస్థితుల ప్రవాహంలోగాని, విశ్వ నియమాల అల్లికలోగాని మానవుడు భాగం కావనిన్నీ, పరిసరాలను అర్థంచేసుకోవడంలో మానవుడు వీటిని సాధనాలుగా ప్రతిపాదించుకొంటున్నాడని, అందుచేత ఎప్పటి కప్పుడు క్రొత్తగా సంతరించుకునే జ్ఞానము, అనుభవము, సాధనాలవల్ల క్రొత్త క్రొత్త ప్రతిపాదనలను మానవుడు ఏర్పరచుకోగలడని నాస్తికత్వం గుర్తిస్తుంది. ఇటువంటి గుర్తింపుపై ఏర్పడిన జీవిత విధానంలో అసమానతలకు, అసత్యాలకు, దోపిడీకి స్థానం ఉండదు. అప్పుడు మానవ జీవితపు సాంఘిక, ఆర్థిక, రాజకీయ, నైతిక, వైజ్ఞానిక రంగాలలో

సమాన గౌరవం, సమాన అవకాశం, సమాన అధికారం, సమాన సంతృప్తి ఏర్పడి మనిషిని మనిషి దోపిడీ చేసుకొనుటకు ఆస్కారం ఉండదు.

ఇంతవరకూ నాస్తికత్వాన్ని కేవలం నిరీశ్వరవాదంగానే తీసుకోవడంచేత పాజిటివ్ నాస్తికత్వాన్ని అర్థం చేసుకుని స్వీకరించుటకు కొంత సమయం పట్టవచ్చు. అలా అర్థం చేసుకొనుటలో ఈ పుస్తకం కొంత వరకైనా తోడ్పడగలదని ఆశిస్తున్నాను.

ఇవన్నీ అధ్యయన తరగతుల్లో ఇచ్చిన ఉపన్యాసాల సారాంశాలు గనుక వివిధ విషయాలు విహంగమ దృష్టితో చూడబడ్డాయి. ప్రతీ విషయం మీద ఇంకా లోతుగా ఇంకా విశాలంగా చర్చిస్తూ మరిన్ని పుస్తకాలు తీసుకురావలసిన అవసరం ఉంది. అయితే ఈ ఉపన్యాసాల సారాంశాలు స్థూలంగా విషయాన్ని అందించగలవు.

మానవుడు-విశ్వము అనే విషయంపై వివరంగా వేరే పుస్తకం వ్రాస్తున్నందున దానిని ఇందులో చేర్చలేదు.

నాస్తికత్వం గురించి తెలుసుకోగోరేవారికి ప్రస్తావనగా ఈ పుస్తకం ఉపకరించగలదని భావిస్తున్నాను. ఈ పుస్తకం చదివి పాఠకులు సూచనలు చేస్తే రెండవ ముద్రణలో పరిశీలించగలను.

ఈ పుస్తకం వ్రాతప్రతిని తయారు చేయడంలో ఓపికతో సహకరించిన మిత్రుడు భానుకి, పట్టువలతో స్వల్పకాలంలో ముద్రించి ఇచ్చిన ఇన్‌సాన్ ప్రింటర్స్ కార్యకర్తలకు నా కృతజ్ఞతలు.

నాస్తిక కేంద్రం
విజయవాడ
28-5-1978

లవణం

విషయ సూచిక

మానవుడు - దైవభావము	....	9
మతము - రాజకీయము	....	24
మహిమలు - మూఢనమ్మకాలు	....	37
కొన్ని మూఢనమ్మకాల పరిశీలన	....	49
ప్రాచీన భారతదేశంలో నాస్తికభావాలు	....	64
పాశ్చాత్య దేశాల్లో నాస్తిక భావాలు	....	78
ఆధునిక కాలంలో నాస్తిక భావాలు	....	85
నాస్తికత్వం జీవిత విధానం	....	93



గోరా ఆధ్వర్యంలో 19-5-63 న ఆరుమళ్ల సుబ్బారెడ్డిగారి కుమారుడు ఆనంద్ వివాహం అరుణతో జరిగినప్పటి చిత్రం. ఎడమనుంచి కుడికి: మానికొండ సూర్యావతి, ఆరుమళ్ల సుబ్బారెడ్డి, గుంటక నారాయణరెడ్డి, గుంటక వెంకాయమ్మ, గోరా, గ్రేగ్రేకుమార్ (అరుణ కొడుకు), ఎ. బి. ఆనంద్, అరుణ.

1

మానవుడు - దైవభావము

సాధారణంగా ఈ చరాచర ప్రకృతి, మనం చూసేది, అర్థం చేసుకునేది అంతా కూడా దైవసృష్టి అని అనుకుంటారు. సృష్టిని సృష్టించుటకు దైవం ఉండాలనుకుంటే ఆ దైవాన్ని సృష్టించుటకు కూడా మరొకరు ఉండాలిగదా. దైవాన్ని మనమే సృష్టించాము. దైవాన్ని సృష్టించింది మానవుడు. దైవం మానవుని ఊహాలోకపు సృష్టి. అది ఒక భావము మాత్రమే. యదార్థానికి దైవమంటూ ఏమీలేదు. అందుకే దైవాన్ని ఎవరూ నిరూపించ లేకపోతున్నారు. దైవం యదార్థం కాదుకనుకనే ఊహించే మానవుడు దైవం అర్థాన్నికూడా మార్చుకుంటూ ఊహించుకుంటున్నాడు.

"దేవుడు కనుక లేకపోతే నేనుదేవుని సృష్టిస్తాను" అని అన్నాడు ఒక తత్వవేత్త. దీని అర్థం దేవుని ఉనికి యదార్థమని కాదు. దైవభావం అవసరం తనకు ఉన్నప్పుడు ఒక అబద్ధాన్ని, ఒక ఊహాను మానవుడు సృష్టించుకో గలడు. ఈ విధంగా దైవభావానికి మానవుడే కర్త.

"ఒక ఎద్దు కనుక దేవుని గురించి ఆలోచిస్తే ఆ దేవునికి రెండు కొమ్ములు ఉంటాయి" అని మరొక తత్వవేత్త అన్నారు. అంటే మానవుడు దేవుని ఊహించబట్టి తన రూపంలో ఊహించాడు. తన గుణాలు, తన అవసరాలు, తన ఉద్రేకాలు, తన వ్యవస్థ ఇవన్నీ దేవునికి ఆపాదించాడు. ఒక ఎద్దు కనుక దేవుని ఊహిస్తే ఆ ఎద్దు తననుబట్టి దేవుని ఊహించుకుంటుంది.

ఇలా దైవం మానవుని ఊహ మాత్రమేనని మనం అర్థం చేసుకొన్నప్పుడు దైవభావం పుట్టుక, పరిణామము, చరిత్రకూడా మనం అర్థం చేసుకోవచ్చు. దైవభావం మానవుని అజ్ఞానము, భయంనుంచి జనించిందనడం సమంజసంగా ఉంటుంది.

ఆదిమ మానవుని భయం

ఆదిమ మానవుడు తనచుట్టూ ఉండే పరిసరాలను ఎలా అర్థం చేసుకోవాలో తెలుసుకోలేకపోయాడు. ఆ రోజుల్లో పనిముట్లుకూడా లేవు. చరిత్రకు పూర్వపు యుగమది. మానవ జ్ఞానానికి అంధకార యుగమది. చెట్లక్రింద, గుహల్లోనూ జంతువుల వలె సంచరిస్తూ ఉండేవాడు. ఆకులు, పండ్లు, కాయలు, దుంపలు తిని జీవిస్తూండేవాడు. లేళ్ళమందవలె, ఏనుగుల గుంపువలె, చీమల బారులవలె సమూహాలుగా ఉన్నప్పటికీ ప్రకృతిని జయించలేక దానికి లోబడిపోయేవాడు. వర్షానికి తడిసి, ఎండకు ఎండి, ఇతర జంతువులకు ఆహారమై క్షీణిస్తూ ఉండేవాడు. మెరుపు మెరిస్తే భయం. ఉరుము ఉరిమితే భయం. పిడుగుశబ్దం వినపడితే భయం. గాలి తీవ్రంగావీస్తే భయం. వర్షంజోరుగా కురిస్తే భయం. కొండలమీదనుంచి ఉరకలు వేస్తూ, పరుగులుతీస్తూ ప్రవహిస్తూవచ్చే నీటినిచూస్తే భయం. గాలి తాకిడికి ఫెళఫెళా విరిగిపోతూ నేలకూలే చెట్లనుచూస్తే భయం. కలరా, మశూచివంటి జబ్బు ఏదైనావచ్చి టపటపా జనం రాలిపోతూవుంటే భయం. కలల్లో ఏవో ఊహలు మానవుని మేధస్సులో విహరిస్తే అవి సంతృప్తికరమైనవైతే ఆనందించినా, భీకరమైనవైతే ఏదో తెలియని భయం.

రెండు జంతువులు పోట్లాడుకొంటున్నాయి. బలశాలి గెలుస్తుంది. బలహీనమైనది పారిపోతుంది. ఒక జంతువు తన ఆహారంకొరకు మరొక జంతువుమీద దాడి చేస్తూంది. చిన్న జంతువు పెద్ద జంతువు దెబ్బకు తట్టుకోలేక గిలగిలా తన్నుకొని పడిపోతూంది. పడిపోయిన చిన్నజంతువును పెద్ద జంతువు తింటుంది.

ప్రశ్నవేసుకోవడం మానవుని ప్రత్యేకత

ఆలాగే మానవులు జంతువులుగా వ్యవహరిస్తున్నారు. కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యాలగు సహజ ఉద్రేకాలకు లోబడి జీవిస్తున్నారు. అయినా ఇతర జంతువులకు లేని "ఊహ" అనేది మానవునిలో ఉంది. మానవుడు ఊహించడం మొదలుపెట్టాడు. భయంవదలి అర్థం చేసుకోవడానికి ప్రయత్నం ప్రారంభించాడు. ప్రశ్న వేసు కోవడం ప్రారంభించాడు. నిస్సహాయుడిగా బలియైపోవడం మాని, తనకు వ్యతిరేకంగా ఉండే స్థితిని ఎదిరించి ఎలా నిలద్రొక్కు కోవడం అని ఆలోచన సాగించాడు. ఇదే మానవుని ప్రత్యేకత. మానవుడు తననుతాను మానవునిగా గుర్తించిన క్షణమది. "నేను తెలుసు కోవాలి. అర్థం చేసుకోవాలి. ప్రకృతిని నాకు అనుకూలంగా మలుచు కోవాలి" అని అనుకున్నాడు. ఇదే నాగరికతకు ప్రారంభం. విజ్ఞానానికి ఆరంభం.

ఈ గాలి ఏమిటి? ఈ వాన ఏమిటి? ఈ సూర్యుడేమిటి? ఈ చంద్రు డేమిటి? ఈ రోగాలు ఏమిటి? మెరుపు ఏమిటి? సముద్ర మేమిటి? నది ఏమిటి? ఈ చెట్లు ఏమిటి? పుట్ట ఏమిటి? అగ్ని ఏమిటి? ఆకాశం ఏమిటి? జంతుపులు ఏమిటి? ఇలా ప్రశ్నించుకోవడం ప్రారంభిం చాడు. బలహీనునిపై బలవంతుని ఆధిపత్యం తన కళ్ళముందు చూస్తూన్న మానవుడు తాను బలహీనుడనుకొన్నాడు. ఇవన్నీ బలవంతమైన వనుకున్నాడు. తన లాంటి వారే ఈప్రతి ఒక్క దానిలో తనకు కనపడ కుండా అదృశ్యంగా ఉండి వాటిని నడిపిస్తున్నా రనుకున్నాడు. ఇవన్నీ శక్తులు; తన కంటే బలమైన శక్తులు. తాను ఈ శక్తుల క్రింద నలిగిపో తున్నాడు. ఇదీ మానవునికి మొట్టమొదట అర్థమైంది. ప్రతి ఒక్కటీ ఒక శక్తి. అప్పుడు ఒక దేవుడనే భావం లేదు. ప్రతిదీ దేవుడే. ప్రతిదీ దేవతే. ప్రతిదీ శక్తే. గాలి, నీరు, నిప్పు, ఉసుము, మెరుపు, చెట్టు, పుట్ట, పాము, సింహం ప్రతిదీ ఒక దేవత. ఇలా అర్థం చేసుకున్నాడు పరిసరాలను.

కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యాలతోపాటు మానవునిలో క్షమాగుణం కూడా ఉంది. తాను కొట్టబోయినప్పుడు తోటి మానవుడు దీనంగా చేతులు జోడించి ప్రార్థిస్తే వదలివేస్తున్నాడు. బలహీనమైన మానవునికి బలమైన మానవుడు శత్రువు అవడమేగాకుండా అభయంకూడా ఇస్తున్నాడు. క్షమిస్తున్నాడు. రక్షిస్తున్నాడు. ప్రతీ వస్తువులో ఉండే శక్తి తనవంటి శక్తేకనుక, తనకంటే బలహీనునికి తాను అభయమిచ్చి రక్షణ కల్పించినట్లే, ఆ బలమైన శక్తులను తాను ప్రార్థించుకుంటే తనకు మాత్రం ఎందుకు రక్షణ ఇవ్వవు? అని అనుకున్నాడు. తనకంటే బలహీనులచేత కాయలూ, పండ్లూ కోయించి, జంతువులను చంపించి ఆహారాన్ని తెప్పించుకొంటున్నాడు. తనకు ఆహారాన్ని తెచ్చియిచ్చేవారిని తాను క్షమించి అభయమిచ్చి రక్షిస్తున్నాడు. అలాగే తనకంటే బలమైనశక్తులనుంచి తనకు రక్షణ కావాలంటే వాటికి తానూ ఆహారమివ్వాలి అని అనుకున్నాడు. కాయలు, పండ్లు, మాంసం, నైవేద్యం మొదలుపెట్టాడు. ప్రత్యేకంగా ఆయా శక్తుల కొరకు జంతువులను చంపి బలి ఇవ్వడం మొదలు పెట్టాడు.

మానవశరీరం నాగరికతకు మూలం

ఇతర జంతువులకంటే అధికంగా మానవునికి ఊహ, ఆలోచన వున్నట్లే భౌతికంగా అతని శరీరనిర్మాణంలో కూడా ఒక పెద్ద మార్పు ఉంది. రెండుకాళ్ళమీద నిలబడిన తర్వాత రెండు చేతులతోను స్వేచ్ఛగా ఏపనైనా చేయగల్గుతాడు. అంతేగాక చేతివ్రేళ్ళలో నాలుగువ్రేళ్లు ఒకవేపు వంగితే బొటనవ్రేలు ఈ నాలుగువ్రేళ్ళకు వ్యతిరేకంగా ఎదురువంగుతుంది. దీనివల్ల చేతులతో ఏదైనా పట్టుకోగల్గుతున్నాడు. ఎటువంటి సున్నితమైన పని అయినా చేయగల్గుతున్నాడు. రెండు రాళ్ళు కొట్టి తాను నిప్పు తయారు చేయగలిగాడు. చేతులతో క్రర పుచ్చుకొని చెట్లనుంచి కాయలు కోయగలిగాడు. జంతువులను కొట్టగలిగాడు. రాయి, క్రర మానవుని తొలి సాధనాలు. ఊహకు, ఆలోచనకు మేధస్సు సాధనమైతే భౌతికంగా పనిముట్లు తయారుచేసుకొనుటకు, వాటిని ఉపయోగించుకొనుటకు ఎటు

వంటి సున్నితమైన పని అయినా చేయగల్గుటకు ఎదురువంగే బొటన ప్రేలుతో కూడిన చెయ్యి మానవునికి గొప్ప సాధనమైంది. మానవుని ఊహ నిరంతరం ముందుకు సాగింది. అది జిజ్ఞాసకు, తాత్వికాన్వేషణకు సాధనమైంది. మానవుని చేయికూడా నిరంతరం ముందుకు సాగింది. అది అతని భౌతిక విజయాలకు సాధనమైంది. ఇల్లు కట్టుకున్నాడు. వేట, వ్యవసాయం ప్రారంభించాడు. బట్టలు తయారు చేశాడు. బల్లెము, కత్తి, పలుగు, పార, నాగలి తొలిపనిముట్లుగా రూపొందించబడ్డాయి. ఇవన్నీ అతని చేతుల సృజనాత్మకత. ఆలోచనలను యదార్థంలోనికి మార్చిన మానవకృషి.

వర్షంలో నిలబడి వర్షాన్ని ఆగమని దీనంగా ప్రార్థించిన మానవుడు ఇల్లు కట్టుకున్నాడు. వర్షాన్ని వ్యతిరేకించాడు. ఎండలో పెట్టి మాంసాన్ని ఎండేట్లు చేయమని ప్రార్థించిన మానవుడు నిప్పు చేసుకున్నాడు. మాంసాన్ని కాల్చుకొని తిన్నాడు. తర్వాత తర్వాత రుచికరమైన వంట కాలు చేసుకున్నాడు. చెట్లక్రింద నిలబడి కాయలకోసం ప్రార్థించిన మానవుడు పొలం దున్ని, పంటలు పండించి తనకు కావలసిన ఆహారం సంతరించుకున్నాడు. ఒక ప్రక్కన ఈ విధంగా అభివృద్ధి జరుగుతూ వుండే మరొకప్రక్కన పదిమందితోకలిసి కుటుంబవ్యవస్థ, సంఘ వ్యవస్థ రూపొందించుకుంటూ సంఘటితకృషితో ముందుకుసాగాడు. ప్రకృతికిలొంగాయి జంతువులు. అలాగే ప్రకృతికి లొంగిన మానవుడిలో భయంవుండేది. నిస్సహాయత ఉండేది. ప్రతీ శక్తినీ వేడుకోవడం ఉండేది. ప్రకృతిని ఎదిరించిన మానవునిలో జిజ్ఞాస, అవగాహన పెరిగాయి. కృషి, కర్తృత్వం ప్రాధాన్యత వహించాయి.

దైవభావం మానవుని ఊహ

ఇలాగ మొదట్లో ప్రతీదీ ఒక దేవత, ప్రతీదీ ఒకశక్తి అని మానవుడు ప్రకృతినీ, పరిసరాలనూ అర్థంచేసుకున్నాడు. మానవ సమాజ నిర్మాణం పెరుగుతున్న కొద్దీ వారిలో కుటుంబపెద్దలు ఏర్పడినట్లే ఈ

దేవుళ్ళకు, దేవతలకు, శక్తులకు కూడా ఒక పెద్ద ఉండాలనీ ఆ పెద్దే "దేవుడు" అనే భావం ఊహించాడు. తాను పనిముట్లు చేసుకుంటున్నాడు, పంటలు పండించుకుంటున్నాడు. నిప్పు చేసుకుంటున్నాడు. వంట వండుకుంటున్నాడు. ఇవన్నీ తాను సృష్టిస్తున్నాడు. అలాగే ప్రకృతినంతటినీ కూడా ఎవరైనా సృష్టించి ఉండాలి అని అనుకున్నాడు. ఈ దేవుళ్ళకు, దేవతలకు, శక్తులకు పెద్ద అయిన దేవుడు ఇవన్నీ సృష్టించాడు అనుకున్నాడు. సృష్టికర్త దేవుడు అనే భావం ఊహించాడు. ఈ విధంగా ఏదైనాసరే ఎలా వచ్చింది అనే ప్రశ్నవేసుకోగానే దైవసృష్టి అని సమాధానం చెప్పుకున్నాడు. దైవభావాన్ని ఊహించగానే తాను అన్ని విషయాలూ తెలుసుకున్నాను అనే సంతృప్తిని మానవుడు పొందాడు. తనకు తెలియని ప్రతీదీ దైవసృష్టి అని సమాధానం చెప్పుకున్నాడు. అందుచేత తనకు తెలియనిది అంటూ ఏమీలేదు. ప్రతీదీ తనకు తెలుసు. తనకు తెలిసింది "అది దైవసృష్టి" అని. కాని మానవుని ప్రశ్న అక్కడ ఆగిపోలేదు. జిజ్ఞాస కుంటుపడలేదు.

దేవుడు ఎవరు? దేవుడు ఏమిటి? అని ప్రశ్నలు వేసుకున్నారు. ప్రతీదీ దేవుడే సృష్టించివుంటే దేవుడు అంతటా వ్యాపించి ఉండాలి. ఇలాగ దేవుడు సర్వాంతర్యామి అని అనుకున్నాడు. ప్రతీ పనీ దేవుడే చేయిస్తూంటే దేవుడు సర్వ శక్తివంతుడు అని అనుకున్నాడు. అంతటా వ్యాపించిన శక్తివంతమైనదేవుడు చెయ్యలేనిది అంటూ ఏదీ ఉండకూడదు గదా. కనుక ప్రార్థిస్తే దేవుడు వరాలు ప్రసాదించగలడని, కోరినవి చేసిపెట్టగలడనే భావం ఏర్పడింది. మానవుడు దేవుని ఊహించాడు కనుక దేవునికికూడా భార్యనీ, పిల్లలను, పెళ్ళిళ్ళను ఊహించాడు. దేవునికి కూడా ఆయుధాలు, వాహనాలు ఉంటాయని భావించాడు. కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యాలను దేవునికి కూడా ఆపాదించాడు. దేవునిలో తన రూపమే చూసుకున్నాడు. ఈవిధంగా దైవభావం మానవుని ఊహ కాగా మానవుని ఆలోచనలకు, ఆశయాలకూ, కోర్కెలకు ప్రతిబింబమైంది.

ప్రకృతిని అర్థంచేసుకున్నట్లే మానవుడు తన జీవితాన్నికూడా అర్థం చేసుకోవడం ప్రారంభించాడు. చావు ఏమిటి? పుట్టుక ఏమిటి? కలలు ఏమిటి? చనిపోయిన తర్వాత వ్యక్తి ఏమౌతాడు? ఇలాంటి ప్రశ్నలు వచ్చాయి. తాను పడుకున్నప్పుడు తన శరీరంలోని ఒక భాగం బయటకి వెళ్ళి విహరిస్తుంచని, అదే జీవాత్మ అని అనుకున్నాడు. శరీరంలోంచి బయటకువెళ్ళిన జీవాత్మ తిరిగివస్తే 'కల' అని, తిరిగి రాకపోతే 'మరణం' అని భావించాడు. తిరిగి రానప్పుడు జీవాత్మఏమౌతుంది? దీనికి సమాధానంగా పరలోకం ఊహించాడు. అక్కడ స్వర్గనరకాలను ఊహించాడు. ఇలాగ మానవుడు పరిసరాలను, ప్రకృతిని, తన జీవితాన్ని అర్థం చేసుకొనుటలో సాగించిన ఊహాగానం ఎంత దూరమైతే పోగలదో అంతదూరమూ పోయింది.

మానవునికి కొంత సంతృప్తి, కొంత స్థిరత్వము ఈ ఊహలవల్ల కలిగింది. కొంత భయం తగ్గింది, అప్పుడు మళ్లా ప్రశ్న ప్రారంభించాడు. దైవం గురించి తాను ఊహించుకున్న ఊహల యదార్థాన్ని పరీక్షించ సాగాడు.

దైవభావం ఉపయోగాలు

ఈ లోగా దైవభావం కేవలం పరిసరాలను అర్థం చేసుకోవడానికే సాధనంగా పరిమితం కాకుండా అది మొత్తం జీవితాన్నే పెనవేసుకుంది. సమాజనిర్మాణం దైవంతో ముడిపెట్టారు. కులపెద్ద, కుటుంబపెద్ద, గణ పెద్ద దైవాంశ సంభూతులు మానవునికీ దైవానికి మధ్య సంబంధాలు నిర్మించే పౌరోహిత్య వ్యవస్థ వీరిద్వారా ఏర్పడింది. దైవభావం యొక్క ఉపయోగాలు ఇంకా పెరిగాయి. ఇప్పుడు ప్రధానంగా దైవాభావాన్ని 1. పరిసరాలను అర్థం చేసుకొనుటకు, 2. కష్టకాలంలో సాంత్వన పొందుటకు, 3. సమాజంలో నీతిని నిలుపుటకు, 4. మానవునిలోని కళాభివృద్ధి ముందుకు కొనసాగుటకు ఉపయోగపడింది.

దైవసృష్టి అని ప్రతిదానికీ అర్థం చెప్పుకున్నట్లే తనకు ఏ కష్టం వచ్చినా దైవ నిర్ణయం అని సమాధానపడ్డాడు. విధిఘాత ఎవరు తప్పించ

గలరు అని ఊరట చెందాడు. తానొకటి తలచిన దైవమొకటి తలచును అని తన అపజయాలను, అశక్తతను అంగీకరించాడు. ఈ విధంగా జీవితంలో వచ్చే కష్టాలను, నిరాశలను ముఖ్యంగా అకాలమరణాన్ని ఎదుర్కోవడానికి దైవభావం ఉపయోగపడింది.

సంఘ సంబంధాలలో మంచిని పెంచడం, చెడును తగ్గించడం అవసరం. మానవుడు నీతిగా ఎందుకు ఉండాలి? మంచిగా ఎందుకు ఉండాలి? అనే ప్రశ్న వచ్చింది. అప్పటికే దైవభావం బాగా వ్యాపించి ఉండటంచేత దైవాన్ని సర్వశక్తివంతుడుగాను, సర్వవ్యాప్తమైనదిగాను అంగీకరించి ఉండడంచేత ప్రతీ వ్యక్తిచేసే ప్రతి పనినీ దేవుడు పైనుంచి చూస్తున్నాడని, మంచిచేసినవారికి, నీతిగా ఉన్నవారికి స్వర్గం ఇస్తాడని, చెడుచేసినవారికి, అవినీతి పరులకు నరకం ఇస్తాడని, స్వర్గంలో సుఖాలుంటాయని, నరకంలో కష్టాలు, బాధలూ ఉంటాయని ఊహించి ప్రచారంచేశారు. దైవ భీతితో నీతిని నిలుపుటకు ప్రయత్నించారు.

మానవులలో ప్రాథమిక అవసరాలు తీర్చుకోవడమేగాక, సంఘ దృష్టికాక, కళాభిరుచి కూడా ఉంది. దీనివల్లనే సంగీతం, సాహిత్యం, నృత్యం, చిత్రలేఖనం, స్థాపత్యకళ మొదలైన లలితకళలు అభివృద్ధి చెందుతున్నాయి. ఈ లలితకళలకు వాటిలో వాటికి రూపముగాని ఉనికిగాని లేదు. ఏదైనా ఒక భావాన్ని ఆధారం చేసుకుని ఇవి ప్రకటితంకావాలి. లలితకళల అభివృద్ధికికూడా దైవభావం ఉపయోగపడింది. ఊహమాత్రమైన భావానికి రూపకల్పన చేయడంలో ఎవరి అభిరుచినిబట్టి వారు తమతమ సృజనాత్మకతను వివిధరీతుల్లో వ్యక్తీకరించుటకు అవకాశం ఏర్పడినది.

ఈ విధంగా దైవభావం మానవ సమాజానికి ముఖ్యమైన అవసరాలగు జిజ్ఞాస, సాంత్వన, నీతి, సృజనాత్మక భావ వ్యక్తీకరణలకు ఆదిలో ఉపయోగపడింది. దీనితో వ్యక్తి జీవితంలోనూ, సమాజ జీవనంలోను స్థిరత్వము, శాంతి ఏర్పడ్డాయి. దేవుణ్ణి యదార్థంగా ఎవరూ చూడలేదు. కనుక దేవునిగాని, దైవభావంపై ఆధారపడిన సాంఘిక వ్యవస్థనుగాని

కావంటే ఏమౌతుందోననే భయం సమాజం అంతటా వ్యాపించి ఉండేది.

కాని రానురాను ఆలోచిస్తున్న కొద్దీ, జిజ్ఞాస పెరుగుతున్నకొద్దీ భయాన్ని ప్రక్కకుపెట్టి, విషయాలను పరిశీలించి, పరీక్షించాలనే అన్వేషణావృష్టి పెరిగింది. దానితో మళ్ళా ప్రశ్నలు వేసుకోవడం ప్రారంభించారు.

దేవుడు అశక్తుడా? నిర్దయుడా?

మానవుని వంటి మానవాతీతమైన వ్యక్తిగా, సర్వబల సంపన్నమైన వ్యక్తిగా దేవుణ్ణి రూపొందించుకొన్నారు. కొలుపులు కొలిచారు. ప్రార్థనలు చేశారు. వరాలు అడిగారు. దైవమూర్తులు చేశారు. దేవాలయాలు కట్టారు. కాని దేవుణ్ణి ఎవరూ చూడలేదు. దైవరూపం గురించి పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలు బయలు దేరాయి. ఎవరి ఊహను బట్టి వారు దేవునికి రూపమిచ్చారు. పరస్పర కొట్లాటలు ప్రారంభమైనాయి. నా ఊహ సరైనదంటే, నా ఊహే సరైనదని; నువ్వు తప్పు అంటే, నువ్వు తప్పు అని పరస్పరం ఆరోపణలు, సంఘర్షణలు అధికమైనాయి.

ఒకే స్థలంలో ప్రక్క ప్రక్కనే ఉన్న రైతులు వేరు వేరుగా వేసిన పంటలకు ఒకరికి వర్షం కావాలి, మరొకరికి వర్షం అక్కర లేదు. ఒకరికి వర్షం కావాలని ప్రార్థిస్తారు. ఒకరు అక్కర లేదని ప్రార్థిస్తారు. వర్షం కురిస్తే అక్కర లేని రైతుకి నష్టం. కురవక పోతే కావలసిన రైతుకి నష్టం. మరి వారి ప్రార్థనలు ఏమైనట్లు? ఇలాంటి ప్రశ్నలు చాలా రావడం మొదలు పెట్టాయి. అదేవిధంగా సర్వశక్తివంతుడు, సర్వవ్యాప్తమయిన దేవునికి దయామయుడు అనే గుణం కూడ ఆపాదించారు. దేవుడు నిజంగా శక్తివంతుడు అయితే, అతనిలో దయఉంటే, ప్రపంచంలో ఇన్ని కష్టాలు ఎందుకు ఉండాలి? యదార్థంగా కష్టాలను మనం అనుభవిస్తున్నాం. కనుక దేవునికి ఆపాదించిన గుణాలను నిత్య జీవితంతో

పోల్చి చూచుకున్నప్పుడు దేవుడుకనుక దయగలవాడు, సర్వశక్తివంతుడు అయివుంటే నిత్యజీవితంలో అంతటా సుఖము, సంతోషమే ఉండాలి. కాని యదార్థంలో కష్టాలు, బాధలు కనిపిస్తున్నాయి. కనుక దేవుని గుణాల్లో ఏదో ఒకటి యదార్థం కాకుండా పోవాలి. దేవుడు దయామయుడు అనుకుంటే సర్వశక్తి సంపన్నుడు కాడు. నయ ఉండీ ప్రజల కష్టాలు చూచి కరిగి పోతున్నాడు. కాని వాటిని తీర్చ లేక పోతున్నాడు. బహుశః అశక్తుడు. కనుక దయామయుడు అయితే దేవుడు అశక్తుడు, బలహీనుడు.

పోనీ సర్వశక్తి సంపన్నుడు అనుకుందాం. అన్ని శక్తులువుండి మానవుని కష్టాలు తీర్చ లేక పోతున్నాడు. అంటే ఆ దేవుడు దయలేని క్రూరుడై ఉంటాడు. తనకి చేయగల శక్తి ఉంది. కాని చేయడు. అంటే దాని అర్థం మానవులు కష్టాలుపడుతూ ఉంటే వారి కష్టాలు చూచి తాను ఆనందిస్తున్నాడన్న మాట. ఈ విధంగా శక్తిఉండీ కూడా ఊరికినే వుంటే దేవుడు దయామయుడు ఎలా అవుతాడు? నిర్దయుడు, క్రూరుడు అవుతాడు. దయామయుడు అయితే బలహీనుడు, శక్తిలేని వాడు. సర్వశక్తివంతుడు అయితే దయలేని వాడు. క్రూరుడు. ఇలా ఆలోచించి నప్పుడు దైవభావానికి ఆపాదించిన గుణాలలోని లోపం బయటపడ సాగింది. బలహీనుడైన దేవుడు వల్ల పనిలేదు, క్రూరుడు అయిన దేవుడు వల్ల లాభం లేదు. కనుక దైవం యొక్క అవసరము ఏమిటి అన్న ప్రశ్న వచ్చింది.

ఇలాగే మరొక ప్రశ్న కూడా వచ్చింది. దైవం కనుక సర్వాంతర్యామి అయితే, సర్వస్వము అయితే చెడుకూడా దైవమేనా? అవినీతి కూడా దైవమేనా? అజ్ఞానముకూడా దైవమేనా? కాని దైవాన్ని మంచి లక్షణాల పొందికగా పేర్కొంటున్నారు. దైవమంటే ప్రేమ, దయ, సత్యము, జ్ఞానము అని చెప్పినప్పుడు ద్వేషము, అసహనము, అసత్యము, అజ్ఞానము, అవినీతి ఎక్కడనుంచి వచ్చాయి? ఇవి మానవ నిర్మితం అంటున్నారు. అయితే వీటిమీద దైవానికి అజమాయిషీ లేదా? వీటిని సరిదిద్దగల శక్తి దైవానికిలేదా? అలాంటప్పుడు దైవం సర్వాంతర్యామి, సర్వశక్తివంతుడు ఎలా అవుతాడు? జ్ఞానము, అజ్ఞానము రెండూ దైవమే అయితే, సత్యము,

అసత్యము రెండూ దైవమే అయితే, ప్రేమ, ద్వేషము రెండూ దైవ గుణాలే అయితే,ఇక దైవత్వముకానిదేది? అప్పుడు అవినీతిని, అసత్యాన్ని ద్వేషాన్ని, క్రూరత్వాన్ని నిందించవలసిన పని ఏమి? ఇలాగ ప్రశ్నలు పరంపరగా రావడం మొదలుపెట్టాయి.

ఈ ప్రశ్నలకు ఆస్తికులు తట్టుకోలేకపోయారు. మొట్టమొదట్లో దేవుడు రూపరహితుడు అన్నారు. దేవుని చూపలేకపోయారు కనుక, దేవుడు కనపడడంలేదు కనుక రూపరహితుడు అనడంద్వారా ఆ ప్రశ్నను తట్టుకోగలిగారు. ఆ తర్వాత గుణరహితుడు అని కూడా అనవలసి వచ్చింది. అంటే దేవునికి మంచిని ఆపాదించడం అనవసరమౌతుంది. రూపరహితుడు అనగానే విగ్రహారాధన అనవసరమైంది. గుణరహితుడు అనగానే ధ్యాననిష్ఠలుకూడా అనవసరమౌతున్నాయి. దేవునికి గుణమే లేనప్పుడు అది ప్రేమకాదు, సత్యముకాదు, అది కరుణకాదు—అలాంటప్పుడు ఏ గుణంద్వారా దైవాన్ని పొందగలుగుతారు? రూపాన్ని సమర్థించలేనట్లే గుణాన్ని కూడా సమర్థించలేకపోయారు. దైవశక్తినికూడా సమర్థించలేకపోయారు.

మరి దేవుని ఎలా అర్థంచేసుకోవాలి? దానికి రూపంలేదు, గుణంలేదు. దీనితో విశ్వాసపరులు ఆలోచించడం ప్రారంభించారు. దైవభావాన్నినిలుపగలగడం, అందులో అందరికీ నమ్మకం ఉండేట్లు చేయగలగడం చాలా కష్టమైపోతుంది. దైవం యదార్థంకాదు కనుక దానిని ప్రత్యక్షంగా నిరూపించడానికి వీలులేకుండా ఉంది. దైవంలో నమ్మేవారే అవినీతిపరులౌతున్నారు. దైవం పేరుమీదనే హింసాకాండ, యుద్ధాలూ కొనసాగుతున్నాయి. ప్రతీ మతమతమ ఊహలతో దైవాన్ని రూపొందించుకున్నాయి. హిందూదేవునికి, మహమ్మదీయ దేవునికీ పోట్లాట. యూదుల దేవునికి క్రైస్తవుల దేవునికీ పోట్లాట. క్రైస్తవులకు అరబ్బులకూ, అలాగే యూదులకు అరబ్బులకు పోట్లాట. ఎల్లో ఒకే మతంలో రకరకాల తేడాలు. హిందువులలో శివభక్తులకు, విష్ణుభక్తులకు పోట్లాటలు. క్రైస్తవు

లలో కాథలిక్‌లకు, ప్రొటెస్టాంట్లకు పోట్లాటలు. ఊహామాత్రమైన దైవం పేరుమీద యదార్థమైన మానవులు కొట్టుకుంటున్నారు.

"అవాఙ్మానసగోచరుడు"!

ఈ స్థితిలో మానవుల్లో దైవభావం పోతే నీతి పోతుందేమోనని భయం ఏర్పడింది. ఏదోఒక రూపంలో దైవభావాన్ని నిలిపివుంచాలి. రాను రాను నీతి సంఘావసరంగా గుర్తింపబడినప్పుడు నైతికప్రవర్తనకు దైవ విశ్వాసము అవసరంలేదని అంగీకరించక తప్పటంలేదు. అప్పుడు దైవం పోతే దైవభావంచుట్టూ అల్లుకుపోయిన వ్యవస్థలో ఆధిక్యతలనుభవిస్తున్న స్వార్థపరులు బయటపడిపోతారు. వాళ్ల స్వార్థాలు కొనసాగవు. దైవంపేర జరిగే దోపిడీకి ఆస్కారం ఉండదు. దైవభావంపోతే మానవులు తిరగబడతారు. దైవం నన్నిలా పుట్టించాడని సంతృప్తిపడి అణగి ఉండరు. అందుచేత దైవము అబద్ధము అని అంగీకరించడం ఇష్టంలేక ఎప్పటికప్పుడు దైవానికి క్రొత్త క్రొత్త నిర్వచనాలు ఇస్తూ, క్రొత్త క్రొత్త అర్థాలు చెప్పసాగారు. అన్ని ప్రశ్నలూ తట్టుకోగల్గడానికి దేవుడు "అవాఙ్మానసగోచరుడు" అన్నారు. అంటే వాక్కుకు అందనివాడు, ఊహకు అందనివాడు అని అర్థం. నీ ఊహకే అందకపోతే, నువ్వు వాక్కుద్వారా చెప్పలేకపోతే ఇక దాని ఉనికి ఏది? రూపగుణ రహితుడు అని అన్నతర్వాత అవాఙ్మానస గోచరుడు అనడం ఒక అబద్ధాన్ని కప్పిపుచ్చుకొనుటకు మరిన్ని అబద్ధాలు ఆడినట్లయింది.

మానవుని ఊహకు అతీతమైన ఏదో ఒక అనిర్వచనీయశక్తిగా దేవుని వర్ణించసాగారు. కొందరు ప్రకృతినే దేవుడు అన్నారు. కొందరు సౌందర్యాన్నే దేవుడన్నారు. కొందరు సత్యాన్ని దేవుడన్నారు. కొందరు ఆనందాన్ని దేవుడన్నారు. చివరగా దేవుడనేది ఒక అనుభూతి; అది నమ్మితే ఉంది, లేకపోతే లేదు అన్నారు.

దైవాతీతమైన మానవుడు

యే ప్రశ్న అయితే యే జిజ్ఞాస అయితే దైవాన్నిఊహించిందో అదే ప్రశ్న అదే జిజ్ఞాస దైవభావానికి సమాధి కట్టింది. మానవుని ఊహ, మానవుని జిజ్ఞాస దైవాన్ని దాటి సాగుతుంది. అందుకనే దైవం మానవాతీతము కాదు. మానవుడే దైవాతీతము. దైవాన్ని ఊహించిన మానవుడు దైవానికి అతీతంగాకూడా ఊహించగలడు. తన ఉపయోగంకోసం దైవాన్ని సృష్టించుకున్న మానవుడు ఆ ఉపయోగం తీరగానే దైవాన్ని వదిలి మరిదేనినైనాకూడా సృష్టించుకోగలిగినప్పుని పురోగమన పథంలో దైవమనే ఊహ అతనికి కొంత తోడ్పడింది. అయితే అది యదార్థం కాకపోవడంచేత కేవలం ఊహగానే నమ్మికగానే మిగిలి పోయింది. కేవలం ఊహకు దాసోహమన్న మానవుడు తన చుట్టూ బానిస బంధనాలు సృష్టించుకున్నాడు. దైవం యదార్థంకాదు అని తేలిపోగానే ఈబంధనాలన్నీ పటాపంచలై పోయాయి. నన్ను దేవుడు సృష్టించలేదు. నేనే దేవుణ్ణి సృష్టించాను. దేవభావంచుట్టూ ఒక ఊహా లోకపు వ్యవస్థను సృష్టించాను. దాని అవసరం లేనప్పుడు, దానివల్ల నష్టం ఎక్కువైనప్పుడు నేను దానిని వదిలివేయడానికి సిద్ధంగా వుండాలి "అని మానవుడనుకున్నరోజున ఒక నూతన చైతన్యం, ఒక నూతన జీవితం ప్రారంభమౌతాయి. ఇంతవరకూ దైవం కేంద్రమైన జీవితం, దైవం కేంద్రమైన చైతన్యం కొనసాగి వచ్చాయి. దైవభావం యదార్థంకాదు అని తేలినతర్వాత మానవుడు కేంద్రమైన జీవితం చైతన్యం అభివృద్ధి చెందుతాయి. దైవభావం వికసించినప్పుడు మానవుడు అణగిపోయాడు. మానవత్వం వికసించినప్పుడు దైవభావం మానవుని ఒక ఊహగానే మిగిలిపోతుంది.

చిన్నప్పుడు మనము పిల్లలను 'బూచి' అని భయపెడతాం. ఆబూచి అనే భయంచుట్టూ,భావంచుట్టూ పిల్లలజీవితాలకు సంబంధించి ఒకవ్యవస్థను ఏర్పాటు చేస్తాము. పిల్లలు పెద్దవారైన తర్వాత బూచి అనేది యదార్థం

కాదని, అది కేవలం ఊహాజనితమైనదని తెలుసుకున్నప్పుడు టూచిని వదిలి వేస్తారు. టూచిచుట్టూ ఏర్పడిన వ్యవస్థనీ వదిలివేస్తారు.

అలాగే దైవం ఒక ఊహ మాత్రమేనని తెలుసుకున్న మానవుడు దైవవిశ్వాసాన్ని వదిలివేయాలి, దైవ విశ్వాసంపై ఆధారపడిన వ్యవస్థనీ వదిలివేయాలి.

దైవభావం అవసరంలేదు

దైవభావము ఏ నాల్గు ఉపయోగాలవల్లనైతే ఇంతవరకూ కొన సాగుతూ వచ్చిందో ఆ నాలుగింటికీ ఇప్పుడు దైవం అవసరంలేదు. అంతేకాక వాటి అభివృద్ధికి దైవభావం అడ్డుగాకూడా ఉంది.

నేడు మనం ప్రకృతిని, పరిసరాలను అర్థంచేసుకొనుటలో ఇది దైవ సృష్టి అని ఊరుకుంటే క్రొత్తవి తెలుసుకోడానికి, విజ్ఞానాన్ని పెంపొందించడానికి అవకాశమే ఉండదు. దైవసృష్టి అనే మూతతీసివేసి మానవకృషితో అవతల ఏముందో తెలుసుకుంటేనే విజ్ఞానం అభివృద్ధి చెందుతుంది. విజ్ఞానాభివృద్ధికి దైవవిశ్వాసం అటంకం.

సాంత్వనకు కూడా దైవ విశ్వాసం అవసరంలేదు. పేదరికంలో పడిఉన్నవాడు, బానిసత్వంలో పడిఉన్నవాడు దైవభావంపేరిట సాంత్వన పొందటంకంటే హేయమైనది మరొకటుండదు. అలాగే ఆయాచితాలు ఆశాభంగాలు దైవభావం పేరిట స్వీకరించి ఊరుకుంటే మానవకృషి కుంటుపడుతుంది,కర్తృత్వశక్తి సన్నగిల్లుతుంది. మానవజీవితంలో ఆశా భంగాలు దైవవిశ్వాసం వల్లా, ఇంతకాలంగా కొనసాగుతూ వచ్చిన అస మానతలవల్లా, మానవకృషిని ఆపుచేయడంవల్లా ఏర్పడినలోపాలు. అడుసుత్రొక్కనేల, కాలుకడుగనేల అన్నట్లు దైవంలో మూఢంగా నమ్మి అసమానతలను, కర్తృత్వ హీనతను పెంచుకోవడమెందుకు? వాటి వల్లవచ్చే ఆశాభంగాలకు మళ్ళీ దైవాన్ని అడ్డం పెట్టుకొని సాంత్వన పొందడమెందుకు? ఇది దైవ విశ్వాసంపై ఏర్పడిన అవకతవక వ్యవస్థ. దైవవిశ్వాసాన్ని తీసివేస్తేనేగాని ఆశాభంగాలు తగ్గవు, ఆశాభంగాలను

అధిగమించే కృషి పెరుగదు. వాస్తవజ్ఞానాన్ని పెంచుకున్నప్పుడు మనం అనుకున్నది జరుగనంత మాత్రాన ఆశాభంగం చెందవలసినపనిలేదు. ఆశాభంగాలకు కారణమౌతున్న పరిస్థితుల్ని మార్చగల్గేశక్తిని మానవుడు పెంచుకోవాలి.

నీతిగా ఉండుటకు కూడా దైవ విశ్వాసము అవసరంలేదు. నీతి సంఘావసరం. పరస్పరం సుఖంగానూ, సౌకర్యంగానూ, సహకారంతోనూ, పరస్పర విశ్వాసంతోనూ జీవించడమే నీతి. ఇందుకు కావలసింది పరస్పర అవగాహన, పరస్పర విశ్వాసము, ఒకరికొరకు మరొకరు త్యాగముచేయుట,చెప్పింది చేయుట చేసిందిచెప్పుట. దీనికి దైవవిశ్వాసంతో పనిలేదు. అందుచేత నీతిగా వుండుటకుకూడా దైవవిశ్వాసం అవసరంలేదు.

లలిత కళల అభివృద్ధికి కూడా దైవవిశ్వాసం అవసరంలేదు. దైవాన్ని మానవుడు ఊహించినట్లే ఎన్ని ఊహలనైనా ఊహించగలడు. ఆఊహలను లలితకళలలోనూ వ్యక్తీకరించగలడు. కళల్లో చెప్పబడిన ఊహలు యదార్థమని భ్రమిస్తే చాలా ప్రమాదం ఉంది. కనుక కళలు యదార్థానికి దూరంగా ఉంటాయని, యదార్థాన్ని ఆధారం చేసుకున్నప్పటికీ సృజనాత్మక ఊహాచింతనకు స్థానం ఎక్కువ ఉంటుందని అర్థంచేసుకుంటున్నప్పుడు కళలు ప్రధానంగా మానవునికి వినోదసాధనంగానూ, తీరికసమయాన్ని సరదాగా సంతృప్తిగాగడుపుకొనుటకూ సాధనాలవుతాయి. ఈ విధంగా ఎప్పుడో దైవవిశ్వాసం అవసరమైందని ఇప్పుడుకూడా దైవ విశ్వాసాన్ని పట్టుకుకూర్చుంటే రాతియుగపు మానవుడు రాళ్ళుకొట్టి నిప్పు చేసుకున్నాడు కనుక ఇప్పుడుకూడా రాళ్ళుకొట్టుకునే నిప్పుచేసుకుంటాను అన్నట్లుంటుంది.

దైవం మానవుని భయానికి, అజ్ఞానానికి చిహ్నం. అజ్ఞానాన్ని, భయాన్ని అధిగమిస్తున్నకొద్దీ దైవభావంయొక్క అవసరం, ప్రాధాన్యత తగ్గిపోతాయి. మానవుని ఊహాప్రపంచంలో పరాధీనతకూ, పిరికితనానికి ప్రాతినిధ్యంవహించే అత్యద్భుతమైన ఊహ దైవభావం.



2

మతము - రాజకీయము

దైవభావాన్ని ఆధారం చేసుకొని ఒక జీవిత విధానం ఏర్పడింది. అదే మతము. ఆదిమ సమాజంలో మతము, మత నియమాలు, మతం విధించే విధి నిషేధాలు - ఇవే పరిపాలనా వ్యవస్థగా ఉండేవి. ఒక గుంపుగాని ఒక గణముగాని తమ పెద్దను ఎన్నుకుంటే అతనే పురో హితుడు, అతడే పాలకుడు.

ఆదిమ సామాజిక వ్యవస్థలో ప్రతీ పని దైవవిశ్వాసంతో ముడి పడి ఉండడంచేత, అందరూ దేవుని నమ్మడంచేత మతాధికారి అనండి, పూజారి అనండి, ఏ పేరుతో మనం పిలిచినా ఆ గుంపు లేదా ఆ గణం మంచిచెడ్డలన్నీ దేవునిప్రతినిధిగా అతను చూస్తూవుండేవాడు.పూజారి లేక మతపెద్ద దైవాంశసంభూతుడనీ,అతని నిర్ణయం తుదినిర్ణయమనీ, పూజారిని వ్యతిరేకించడమంటే దైవాన్ని వ్యతిరేకించడమనీ అనుకొనేవారు. కనుక ఆయాగణాలలోని వ్యక్తుల జీవితాలన్నీ అచటి మతపెద్దల ఆదేశాల మీద ఆధారపడి వుండేవి. మతపెద్ద గణములోని సభ్యులందరూ ఎవ రెవరు ఏ పని చెయ్యాలో నిర్ణయించేవాడు. క్రొత్త శిశువు జన్మించినా, ఎవరైనా చనిపోయినా, పెళ్ళి చేసుకున్నా, గ్రామానికి అతిథి వచ్చినా, ఎవరైనా ప్రక్క ఊరికి వెళ్ళాలన్నా ప్రతీ పని మతపెద్ద నిర్ణయంద్వారా జరుగవలసిందే. ప్రతీ పనికి ఆ పనిని జయప్రదం చేయమని మతపెద్ద దేవుని ప్రార్థించేవాడు. మతపెద్ద మాటకు విరుద్ధంగా ఎవరైనా చేస్తే దేవునికి ఎక్కడ కోపం వస్తుందో, తమ గణం యేమైపోతుందో, తమ

జీవితాలకు ఏమి కీడుమూడుతుందో అని ప్రతివారూ భయపడేవారు. దైవ సంబంధమైన పని, ఇహలోక సంబంధమైనపని ఈ రెండుకూడా మత పెద్దే చేసేవాడు. కాని రానురాను మతపెద్దకు పని ఎక్కువవడంతో ఇహ లోకానికి సంబంధించిన పనులు చూచుటకు వేరే సహాయకులు కావలసి వచ్చారు. మొదట్లో మతం, రాజకీయం ఒకే వ్యక్తిలో కలిసి వుండేవి. ప్రజల ఇహలోకపు అవసరాలు, మతపరమైన కర్మకాండ రెండూ అతనే చూసేవాడు. కాని రానురాను పని విభజన అవసరం కావడంతో ప్రతీ గణంలోను పరిపాలనా పెద్ద మతపెద్దకు తోడుగా తయారయ్యాడు. అయితే మతపెద్దకు లోబడే పరిపాలనాపెద్ద పని చేయాల్సి వచ్చేది. పరిపాలనా పెద్దపై పూర్తి అధికారం, అజమాయిషీ మతపెద్దకు ఉండేవి. మతపెద్దమాటే చివరిమాటగా చలామణీ అయ్యేది.

పరిపాలనాపెద్ద గ్రామంలో ఎవరు ఏ పనిచేయాలో చూసేవాడు. క్రూరమృగాలనుండి, ఇతర గణాలనుండి తమ గణం సభ్యులను రక్షించు టకు కావలసిన ఏర్పాట్లు చేసేవాడు. తమ గ్రామంలో ఎవరైనా తగాదాలు పడితే వాటిని తీర్చేవాడు. మతపెద్ద ప్రతీపనికీ ముందు బలులు, క్రతు వులు మొదలగు కర్మకాండ జరిపేవాడు. పూజలు నైవేద్యాలు చేసేవాడు. ప్రతీ దేవతకు ఏమేమి చెయ్యాలో ప్రజలకు చెప్పేవాడు.

రాజుగా మారిన పరిపాలనా పెద్ద

ఆ రోజుల్లో ఎక్కడికక్కడ స్థానికంగా జనసమూహాలు గణాలూ వుండేవి. రాకపోకలుగానీ, వర్తక వ్యాపారాలుగానీ పరస్పర సంబంధాలు గానీ అంతగా ఉండేవికావు. ప్రతీ గణానికి వాళ్ళ మతపెద్ద, ఇష్టదేవత, పరిపాలనాపెద్ద వీరితోనే సంబంధాలుండేవి. కాని రానురాను పరిసర గణాలతో సంబంధాలు, రాకపోకలు, వర్తక వ్యాపారాలు ఎక్కువైనాయి. దీనితో మతపెద్దకంటే పరిపాలనాపెద్ద బాధ్యతలు ఎక్కువవుతూ వచ్చాయి. మతపెద్దా, పరిపాలనాపెద్ద కలిసి సంయుక్తంగా పనులన్నీ చేసేవారు. యదార్థంగా చూసినపుడు మత విషయాలలో ముందుగా

నమ్మకం పోయింది ఈ ఇద్దరు పెద్దలకే. మొదట్లో పరిపాలనా పెద్ద పూర్తిగా మతపెద్ద ఆధీనంలోనే వుండేవాడు. కాని, రానురాను మత విషయాలలో వీరిద్దరికీ నమ్మకం సడలడంతో ఇద్దరూ స్వార్థపరులై పోయారు. కాని, అసలు విషయాలు బైటపెడితే ప్రజలలో తమ పలుకు బడి, ప్రజలపై తమ ఆధిపత్యం ఎక్కడ పోతుందోనని ఇద్దరూ సర్దుకుని పోయేవారు. మతసంబంధమైన ఆంక్షలు, కట్టుబాట్లు, క్రతువులు, కర్మ కాండతోపాటు రాజదండన, రాజుకు కప్పం కట్టడం, రాజ శాసనాలు, రాజ సైన్యము ఇవన్నీ ప్రముఖం కాసాగాయి, పరిపాలనా పెద్ద రాజుగా మారి పోయాడు. మత పెద్ద రాజపురోహితుడైనాడు.

మతానికీ అభివృద్ధికీ ఘర్షణ

రాజుకీ మతానికీ మధ్య తరుచు సంఘర్షణలు జరిగేవి. కాని సర్దుకుపోతూవచ్చేవారు. మతపెద్ద దైవాంశసంభూతుడైనట్లే రాజుకూడా దైవాంశసంభూతుడుగా పరిగణింపబడ్డాడు. రాజద్రోహం దైవద్రోహంగా ఎంచబడింది.

ఏది యేమైనా మతపరంగావచ్చే శిక్ష పరలోకంలో మరణానంతరం అనుభవించవలసినది. కాని రాజు విధించే శిక్ష ఇప్పుడే, ఇక్కడే అనుభ వించవలసినది. మతసంబంధమైన విషయాలు అప్రత్యక్షాలు. రాజసంబంధ మైన విషయాలు ప్రత్యక్షాలు. అప్రత్యక్ష విషయాలపై అభిప్రాయబేధాలు పెరుగుతున్నా రాజదండన ప్రత్యక్షం కనుక మతగురువు, రాజు కలిసి చేసేపరిపాలనలో మతద్రోహులను రాజు దండించేవాడు. రాజద్రోహులను దైవద్రోహులుగా మతాధికారులు ప్రకటించేవారు.

మతానికీ, రాజకీయానికి మధ్య ఏర్పడిన ఈ సంబంధమే మానవ నాగరికతాభివృద్ధికి, విజ్ఞానాభివృద్ధికి చాలా అవరోధమైంది. అన్వేషణతో పాటు ఎప్పటికప్పుడు అభివృద్ధిచెందుతున్న విజ్ఞానమూ – ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వున్నట్లున్న జడతుల్యమైన మతనమ్మకమూ రాజీపడ డానికి వీలు లేకపోయింది.

బౌద్ధులను, జైనులను హిందూమతాధికారులు, హిందూ రాజులు నానా హింసలు పెట్టారు. మహ్మద్‌ను, ఇస్లాం అనుయాయులను అరేబియాలోని ప్రాచీన మతస్తులు అప్పటి కబీలాల అధిపతులు నానా హింసలకు గురిచేశారు. జీసస్‌ను నాటి యూదు పరిపాలకులు, యూదు మతస్తులు మత విరోధిగా శిలువ వేశారు. శాస్త్రవేత్త అయిన గెలీలియోను మతాధిపతుల ప్రేరణపై అప్పటి రాజులు కారాగారంతో బంధించారు. శాస్త్రవేత్తయైన బ్రూనోను నాటి మతనమ్మికలకు విరుద్ధమైన విషయాలు ప్రచారం చేస్తున్నాడనే నెపంతో కాల్చి చంపివేశారు. మతానికి, సమకాలీన సమాజానికీ వచ్చిన ఘర్షణలో రాజులు ఎప్పుడూ మతానికి అండగా నిలిచారు. మతాధికారులు ప్రజలలో ఉన్న దైవ విశ్వాసాన్ని ఆధారం చేసుకుని రాజును కాపాడారు.

మతం గుప్పిటలో యూరప్ స్థితి

16వ శతాబ్దంలోని యూరప్ చరిత్ర రాజకీయాలపై మతానికున్న ప్రాధాన్యతను తెల్పుతుంది. రోంనగరంలోని పోపు ప్రతినిధులు యూరప్ అంతటా మతాధికారులుగా రాజుల పరిపాలనలో సహాయం చేసేవారు. దూరదూరానఉన్న దేశాల ప్రజలు స్థానికమైనరాజుకు పన్ను చెల్లించడమే గాక క్రైస్తవమతాధిపతియగు పోపుకు కూడా మతాధికార్ల ద్వారా పన్ను చెల్లించేవారు. ఈ విధంగా రాజుపన్ను, దేవుని పన్ను రెండుపన్నులూ చెల్లించవలసివచ్చేది.మతాధికారులైన పోపు ప్రతినిధులకు ప్రతిదేశంలోనూ రాజులు లోబడి ఉండవలసివచ్చేది. పోపు ప్రతినిధులైన మతాధిపతులు సాధారణంగా రోమన్ దేశస్తులై ఉండేవారు. వీరు తరచు రోమన్ సామ్రాజ్య స్వార్థాలను పెంపొందించి పరిరక్షించేవారు. అంతేకాక, ఇహలోకంలో చేసిన పాపాలను పరలోకంలో ఉన్న దేవుడు క్షమించుట కొరకు అర్జీలుగా పెట్టుకునే పాపపరిహార పత్రాలను మతాధికారులు యూరాప్ అంతటా విరివిగా అమ్మేవారు. మతాధికార్లు అడిగినంతధనం ఈ పత్రాలకు ప్రతిఫలంగా ఇవ్వకపోతే వారిని దైవద్రోహులుగా ప్రకటించి నానాహింసలూ పెట్టేవారు. ఈ విధంగా మతం రాజకీయాలను తమగుప్పిట్లో పెట్టుకున్న

సమయంలో జర్మనీ దేశంలో మార్టిన్ లూథర్ అనే జర్మన్ మతగురువు పాపపరిహార పత్రాల అమ్మకాలను చాలా గట్టిగా వ్యతిరేకించాడు. అంతే కాక యూరప్ అంతటా రోమన్ సామ్రాజ్య ప్రాబల్యం మతంద్వారా విస్తరించడాన్నికూడా ఆయన వ్యతిరేకించారు. ఒక విధంగా పోప్ అధిపత్యంపై ఆయన తిరుగుబాటు లేవదీశాడు.

ఆరోజుల్లో పోప్ ప్రతినిధులగు మతగురువులు ప్రజలలో ఉన్న మతవిశ్వాసాలను ఆధారం చేసుకొని తమకు ఇష్టంలేని రాజులను మార్చి వేస్తూఉండేవారు. ఇట్టి స్థితిలో జర్మన్ దేశస్తుడైన మార్టిన్ లూథర్ చేసిన తిరుగుబాటు రోమన్ మతాధికార్లద్వారా అవమానింప బడుతున్న రాజులకు పెద్ద జాతీయతా ప్రబోధంగా కన్పించింది. జర్మన్ సామ్రాజ్యంలోని కొందరు రాజులు మార్టిన్ లూథర్‌ను సమర్థించారు. అప్పటికే మతాధికార్లనుద్దేశించి 95 ప్రశ్నలతో "వీటికి సమాధానం చెప్పండి" అంటూ మార్టిన్‌లూథర్ ప్రొటెస్టు జరపడంచేత లూథర్ అనుయాయులు కాల క్రమంలో ప్రొటెస్టెంట్లుగా గుర్తింపబడ్డారు.

ఆ రోజుల్లో రాజు మతం మారితే ప్రజలస్థితి ఏమికావాలి అనే ప్రశ్న వచ్చింది. దీనిమీద చాలా యుద్ధాలు జరిగాయి. రాజు యేమతానికి చెందితే ప్రజలందరూ ఆ మతాన్ని అంగీకరించాలని, అలా అంగీకరించని పక్షంలో జనాభాల మార్పిడిజరిగి వలసపోవాలని నిర్ణయం జరిగింది. చివరకు మతాలమధ్య ద్వేషభావాన్ని తగ్గించుటకు మతసహనం కూడా ప్రబోధించబడింది. ఇవంతా మతానికీ, రాజకీయానికీ జరిగిన సంఘర్షణ.

ఈ సంఘర్షణకు ఒకరూపమిచ్చి మతాలపై రాజకీయానికి ప్రాముఖ్యత వచ్చుటకు తోడ్పడిన వ్యక్తి మార్టిన్ లూథర్. రాజు ప్రొటెస్టెంటు అయి, ప్రజలు కాథలిక్‌లైనా, ప్రజలు ప్రొటెస్టెంట్లు అయి రాజు కాథలిక్ అయినా చాలా అల్లకల్లోలాలు జరిగాయి. 400 సంవత్సరాల అనంతరం నేటికికూడా ఐర్లండ్‌లో ఈ స్థితిని చూస్తున్నాం. ఐర్లండ్‌లో అధిక సంఖ్యాకులు కేథలిక్కులు. వారికి ఆనాటి బ్రిటిష్ పాలకులు ప్రొటెస్టెంట్లు. ఐర్లండ్ స్వాతంత్ర్యం సంపాదించుకున్నా ఐర్లండ్

ఉత్తరభాగంలోని బెల్‌ఫాస్ట్ ఇప్పటికీ బ్రిటిషు పాలనలో ఉండి ఎక్కువ మంది ప్రజలు ప్రొటెస్టెంట్లు కావడంచేత నేటికీ అక్కడ మతంపేర మారణహోమం జరుగుతూనేవుంది.

లూథర్ తీసుకొచ్చిన ప్రొటెస్టాంటిజం రోమన్ పాలకుల అధికార మతమైన కెథాలసిజంతో ఘర్షణ పడడంద్వారా క్రొత్త మతం, క్రొత్త రాజులు వచ్చి మానవుల స్వేచ్ఛను పెంచారు. మానవకృషిని పెంచారు. ఈ మార్పునే యూరప్‌లో రిఫర్మేషన్ అని అంటారు. జర్మన్ దేశం తొలిగా లూథర్ కారణంగా ప్రొటెస్టాంటిజం స్వీకరించడంవల్ల జర్మనీలో పరిశ్రమలు పెరిగాయి. అంతకుముందు రోమన్ కెథాలిసిజంవల్ల సాంకేతిక విజ్ఞానంగాని, పారిశ్రామిక వాతావరణంగాని పెరగలేదు. సాంప్రదాయకంగా వచ్చే వ్యవసాయాన్ని దాటి ఏపనీ చెయ్యనివ్వలేదు వారు. ప్రొటెస్టాంటిజం వ్యాప్తివల్ల మతబంధనాల బిగువుతగ్గి రాజకీయశక్తికి ప్రజలశక్తికి విలువ పెరగడంతో పరిశ్రమలు పెరిగాయి. వర్తక వ్యాపారాలు పెరిగాయి. ఇప్పటికీ కేథలిక్ దేశాలైన ఇటలీ, స్పెయిన్, పోర్చుగల్ మొదలైనవి ఇంకా వ్యవసాయిక దేశాలుగానే ఉండిపోయినాయి. ప్రొటెస్టాంటిజం స్వీకరించిన జర్మనీ, అమెరికా, ఇంగ్లండ్ మొదలైన దేశాలు పారిశ్రామికంగా చాలా అభివృద్ధి చెందాయి.

రాజకీయాలపై మతం ప్రభావం

రాజుల మత అసహనానికి మరొక నిదర్శనం ఒక అరేబియా సుల్తాను ఈజిప్టుపై దండయాత్ర జరిపినప్పుడు అలెగ్జాండ్రియాలోని పెద్ద లైబ్రరీని తగులబెట్టించాడు. ఆయన వాదం ఒక్కటే. ఖురాన్‌లోచెప్పిన విషయాలే ఈ గ్రంథాలలోవుంటే ఇవి అనవసరం. ఖురాన్ ఒక్కటి చదువుకుంటే చాలు. ఖురాన్‌లో లేనివిషయాలు ఈ గ్రంథాలలో చెప్పివుంటే అవి మతద్రోహం ప్రేరేపిస్తున్నాయి కనుక వాటిని తగులబెట్టవలసిందే. ఈ రకమైన మత అసహనం నాటిరాజులు ఎక్కువగా ప్రదర్శించుటచేతనే ఎంతో అభివృద్ధి ఆగిపోయింది. ఎంతోమంది శాస్త్రవేత్తలు జైళ్ళలో పెట్టబడ్డారు, హింసింపబడ్డారు, చంపబడ్డారు.

రాజకీయాలపై మతంయొక్క ప్రభావం భారతదేశంలో కూడా ఏమీ తక్కువకాదు. పూర్వకాలంలో శైవ, వైష్ణవ తగాదాలు, ద్రావిడ వైదిక మతతగాదాలు, ఆ తర్వాత హిందూ ముస్లిం తగాదాలు, చివరకు భారతదేశం మత ప్రాతిపదికపై విభజింపబడడం ఇనంతా రాజకీయాలపై మతం ప్రాబల్యాన్ని చూపుతుంది.

ఔరంగజేబు హిందువులపై జిజియాపన్ను విధించాడు. ముస్లిం రాజులు ఇస్లాం స్వీకరించిన ఖైదీలను విడుచల చేసేవారు. రాజు ముస్లిం అయితే హిందువులను కొన్ని కొన్ని చోట్ల గుర్రాలమీద స్వారీ చెయ్య నివ్వలేదు. ముస్లింమతం స్వీకరించిన నిరుద్యోగులకు కొన్నిచోట్ల దిన భత్యంకూడా ఇచ్చాడు. ఇప్పటికీ ప్రభుత్వాలు పుణ్యక్షేత్రాలలో పిల్గ్రిమ్ టాక్స్ విధిస్తున్నాయి. మత సంస్థలు బాగా ఆస్తులను కూడబెట్టుకొని నేడు ప్రపంచాన్నే సవాలుచేసే స్థితికి వస్తున్నాయి. మతసంస్థల ఆస్తులపై ప్రభుత్వాలు పన్నులు విధించకూడదు అనే నియమంవల్ల ఆర్థిక రాజకీయ విషయాలపై మతం పైచేయి పొందుతుంది. మతసంస్థల దగ్గరున్న ఆస్తులూ, సంపదా దినదిన ప్రవర్ధమానమవుతూ అవసరమైతే ఎంతమంది వ్యక్తులనైనా చివరకు ప్రభుత్వాలనైనా కొనివేయగల్గే తాహతు సంపాదించుకుంటున్నాయి. ఇటువంటి వాతావరణంలో ఒక ప్రక్క సెక్యులర్ భావాల వ్యాప్తి మరొక ప్రక్క కమ్యూనిస్టు దేశంగా రష్యా అవతరణ మతంపై రాజకీయాల ఆధిపత్యాన్ని నిరూపిస్తున్నాయి.

పైచేయి పొందిన రాజకీయ వ్యవస్థ

"మతం మత్తుమందు" అని కారల్ మార్క్స్ అన్నాడు. మత దృష్టిలోవున్న ప్రజలు దోపిడీని, అన్యాయాలను, అసమానతలను భరిస్తారేగాని తిరగబడరు. దేవుడు నన్ను ఇలాగే పుట్టించాడనో, నుదుటి వ్రాత అనో, ఎవడి ఖర్మ వాడు 'అనుభవించక తప్పదు' అనో లొంగి ఊరుకుంటున్నారు. వారిలో మార్పు రావాలంటే, విప్లవభావాలు పెరగాలంటే మతం మత్తునుంచి వారిని వదిలించాలి. అందుచేతనే సోషలిస్టు

విప్లవంలో మతానికి ఎక్కడా స్థానం లేకుండా చేశాడు మార్క్స్. దోపిడీ సాధనాలలో మతంకూడా ఒకటి అని పేర్కొన్నాడు.

మరోప్రక్క ప్రభుత్వాలు సెక్యులర్‌గా ఉండాలని ఉచ్యమాలు బయలుదేరాయి. దీనికి కారణం రాజు, మతగురువు కలిసి అధికారాన్ని చెలాయించిన రోజుల్లో, రాజుకూడా మతగురువువలె దైవప్రతినిధి అని భావించిన రోజుల్లో రాజుచర్యలపై మతంప్రభావమే ఎక్కువగా ఉండేది. ప్రయాణసాధనాలు పెరిగి పారిశ్రామిక విప్లవంద్వారా వర్తకవ్యాపారాలు అధికమౌతున్నప్పుడు ఒక దేశస్తుడు మరొక దేశంలోనికి వెళ్ళడం, ఒక మతస్తుడు మరొక మతం ప్రముఖంగావున్న ప్రదేశానికి వెళ్లడం తప్పని సరి అయింది. అప్పుడు తన మతాన్ని అంగీకరించనివారిని దైవద్రోహులుగా శిక్షిస్తామంటే అసంగతము, అసంబద్ధమూ అవుతుంది. కనుక మనుషులు స్వేచ్ఛగా కలువగలగాలంటే మతానికీ ప్రభుత్వానికి సంబంధం ఉండకూడదనే భావాలు ప్రాబల్యం పొందసాగాయి.

సంఘ నిర్మాణ ప్రారంభదశలో ఒకే వ్యక్తి జనగణంలో మత పెద్దగానూ, పరిపాలనా పెద్దగానూ రెండు బాధ్యతలూ నిర్వహించేవాడు. తర్వాత పరిపాలనా పెద్దగా మరొక వ్యక్తి వచ్చినా అతను పూర్తిగా మత పెద్దకు లోబడివుండేవాడు. ఆ తర్వాత రాజు, మతాధికారి దాదాపు సమానస్థాయిలో ఉండేవారు. రాజవ్యవస్థలో సైన్యానికి, న్యాయవ్యవస్థకు పన్నుల విధానానికి, ప్రజాభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత పెరుగుతున్నకొద్దీ రాజుది, రాజకీయానిది పైచేయి అవుతూ మొత్తానికి మతాధికారికి ప్రాముఖ్యత తగ్గడం ప్రారంభించింది. రాజరికపు వ్యవస్థలో రాజపురోహితుడు దాదాపు ప్రధానమంత్రి స్థానంలో వుండేవాడు. ఆ తర్వాత ప్రజాస్వామ్య వ్యవస్థ దేశదేశాలలో నెలకొన్నప్పటికీ మతానికి తగిన గుర్తింపు వుంటూవస్తోంది. బ్రిటిషు ప్రధానమంత్రి, ప్రభువుల సభలో కొంతమంది బిషప్పులను నియమించే ఆచారం ఉండేది. అలాగే చాలా ప్రజాప్రతినిధుల (శాసన) సభలలో సభాధ్యక్షుని ప్రక్కనే మతాధికారి కూడా కూర్చునేవాడు. శాసనసభ ఆమోదించినప్పటికి తీర్మానానికి

మతాధికారి ఆమోదం కూడా లభించవలసి వుండేది. ఇప్పటికీ అమెరికాలోని న్యూయార్క్ రాష్ట్ర శాసనసభలో స్పీకర్ ప్రక్కనే ఒక మత గురువుకూడా కూర్చుంటాడు. అంటే స్పీకర్‌తోపాటు మతగురువు కూడా శాసనసభకు అధ్యక్షత వహిస్తున్నాడన్నమాట.

ఫ్రెంచి విప్లవం

ప్రభుత్వము, మతము వేరువేరుగా వుండాలనే సెక్యులర్ భావాలు బాగా ప్రస్ఫుటమైనది "స్వాతంత్ర్యము, సమానత్వము, సౌభ్రాత్రము" అనే ఆశయంతో జరిగిన ఫ్రెంచి విప్లవంలో. ఫ్రెంచి విప్లవానికిముందు ఆర్థికంగా, సాంఘికంగా, రాజకీయంగా ఫ్రాన్స్ పరిస్థితి సామాన్య ప్రజలకు భరించరానిదిగా తయారైంది. రాజప్రతినిధులు, మతగురువులు కలిసి ప్రజలపై అధికంగా పన్నులు విధించి, ఆ డబ్బుతో తమ ఆడంబరాలలోనూ, భోగలాలసత్వంలోనూ మునిగి తేలుతూ ఉండేవారు. మత సంస్థల ఆస్తులపై ప్రభుత్వ పన్ను ఉండేదికాదు. కనుక రోజు రోజుకు మత సంస్థల ఆస్తులు విపరీతంగా పెరిగిపోయి ఫ్రాన్స్ దేశపు మొత్తం స్థిరాస్తుల్లోనూ, సంపదలోనూ ఐదవభాగం మతాధికారుల ఆధిపత్యంలో ఉండేది. ప్రజల నిత్యజీవితావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. జీవించడం దుర్భరమైంది. ప్రజల గోడు వినేవారు లేరు. హేతువాద ఆచార్యులైన రూసో ప్రబోధం అలావుంచినా, నిత్యజీవితంలో మతం కబంధ హస్తాల్లో నలిగిపోయిన ప్రజలకు, మతాధికారుల అడుగులకు మడుగులొత్తే రాజప్రతినిధుల నిరంకుశత్వాన్ని అనుభవించిన ప్రజలకు, ఇది ఏమిటి? అని ఆలోచించవలసిన అవసరం ఏర్పడింది. ఆలోచించినకొద్దీ ప్రజలకు రాజుపై ఎంత ఏవగింపు కలిగిందో మతంపై అంతకంటే ఎక్కువ ఏవగింపు కలిగింది. అందుచేతనే ఫ్రెంచి విప్లవం కేవలం రాజకీయ విప్లవం కాదు. రాజకీయ, మత నిరంకుశత్వాల నుంచి ఒక్కసారిగా ప్రజలు బయట పడడానికి చేసిన ప్రయత్నం. స్వేచ్ఛకు, సమానత్వానికి, సౌభ్రాత్రానికి రాజకీయ నిరంకుశత్వం ఎంత ఆటంకమో మతాధిపత్యంకూడా అంత అవరోధం. దీనిని ప్రత్యక్షంగా అనుభవించడం



కారల్ మార్క్సు



యం. యన్. రాయ్

ఈ విధంగా మనం ఎన్నైనా ఉదాహరణలు చెప్పుకోవచ్చు. ఇవంతా మతంపై రాజకీయ వ్యవస్థయొక్క ఆధిపత్యం. మతాన్ని పూర్తిగా వ్యక్తిగత విషయంచేసి రాజకీయ వ్యవస్థకు పూర్తి ప్రాధాన్యత వచ్చినప్పుడు పరలోకంతోనూ, స్వర్గనరకాలతోనూ ప్రమేయంలేకుండా ఇప్పుడే ఇక్కడే నీతికి ప్రోత్సాహం, అవినీతికి శిక్ష లభిస్తుంది. అప్పుడు నీతికి దైవవిశ్వాసానికి సంబంధం పూర్తిగా తొలగిపోయి నీతి సంఘ అవసరమౌతుంది.

ప్రజాస్వామ్య సెక్యులర్ వ్యవస్థ నెలకొనాలనే చైతన్యం ఒక ప్రక్క సమాజంలో పెరుగుతున్నా, అవినీతిపరులైన రాజకీయనాయకులు మత వ్యవస్థతోను, మతాధికారులతోను చేతులు కలిపి తమ స్వార్థాలను నిలుపుకోడానికి, ప్రజలను ప్రక్కదారి పట్టించడానికి ఇంకా మత మౌఢ్యాన్ని పెంచుతున్నారు. ఇది చాలా ప్రమాదకరం. అయినా ప్రజలలో రాజకీయ చైతన్యం పెరుగుతున్నకొద్దీ వీరి ఆటలు కొనసాగవు. సాంఘిక విప్లవాన్ని వనలిపెట్టిన పార్టీ ముఠా అధికార రాజకీయాలు మతాన్ని, మత మౌఢ్యాన్ని ప్రోత్సహించడంలో ఆశ్చర్యంలేదు. మతాన్ని ఆధారం చేసుకున్న రాజకీయపు వ్యవస్థ పతనమైనట్లే, మతమౌఢ్యాన్ని ఉపయోగించుకొనే పార్టీ ముఠా అధికార రాజక్రీయాలుకూడా అంతంకాక తప్పవు.

సామాజిక వ్యవస్థా నిర్మాణంలో మతంనుంచి రాజకీయానికి మానవుడు పురోగమిస్తున్నాడు. ఇందులో మతాన్ని పూర్తిగా వదిలిపెట్టి, రాజకీయాలు మతాన్ని పోషించుటకుకాక, ప్రజలకోసం రాజకీయాలు అనే భావం పెరుగుతున్నకొద్దీ సమాజంలో సౌఖ్యం పెరుగుతుంది, నీతి పెరుగుతుంది.

ఒకప్పుడు రాజకీయాలు మతానికి దాసీగా ఉండేవి. తర్వాత రాజకీయాలూ మతమూ సమాన స్థాయిలోకి వచ్చాయి. ఆ తర్వాత రానురాను మతం ప్రాధాన్యత తగ్గిపోతూ రాజకీయ వ్యవస్థ ప్రాధాన్యత పెరుగు

తోంది. ఇక ఇప్పుడు అసలు మతంతో ప్రమేయంలేని రాజకీయాలు కావాలి. మతరహిత రాజకీయ వ్యవస్థ కావాలి. సెక్యులరిజమంటే ఇదే.

కొంతమంది సెక్యులరిజమంటే సర్వమతసహనం అంటారు.అంటే ఏమతాన్నీ అంగీకరించని హేతువాదులకు, నాస్తికులకు అట్టి వ్యవస్థలో ఉండే స్థానం ఏమిటి? నాస్తికులకుకూడా సమానగౌరవం ఇస్తారా? ఇది ఎలా సాధ్యం. మతం కావాలనేవారికి మతం పనికిరావనేవారికి సమాన అవకాశం ఇవ్వడం రాజకీయ వ్యవస్థకు అసాధ్యం. అందుచేత మతాన్ని పూర్తిగా వ్యక్తిగత విషయంచేసి మత సంస్థలను, మత గురువులను ఇతర సంస్థల తోను, ఇతర పౌరులతోను సమానంగాచూసే సెక్యులర్ వ్యవస్థ కావాలి. సామాజిక జీవితంలో ప్రత్యక్ష నిర్ధారణకు నిలువని మత విశ్వాసాలకు స్థానంలేదు. అవి వ్యక్తిగత విషయాలు. వాటికి బహిరంగ ప్రచారం లభించడం సామాజిక ఆరోగ్యానికి, రాజకీయ వ్యవస్థ వికాసానికి హానికరం.

3

మహిమలు - మూఢనమ్మకాలు

పూర్వకాలంలో భయము, బానిసభావము మానవులను ఎక్కువగా ఆవహించి వుండేవి. తెలియనిదాని గురించి భయం. తనకు తెలియనిది ఇతరుల కెవరికైనా తెలిసివుంటే వారు తనకు అతీతులని అనుకునేవారు. తనకు అతీతులైనవారికి లొంపోయే భావం భయంతోపాటు వచ్చింది.

ఆదిమ మానవుని మతమంతా మహిమలతో నిండిపోయింది. ప్రకృతిని పరీక్షించడంలో చిన్నచిన్న రహస్యాలను వారు కనుగొన్నారు. పసుపులాంటి దుంపమీద అక్కడదొరికిన ఏసున్నపురాయో రాస్తే ఆ దుంప ఎర్రగా అయిపోయింది. దానిమీద మళ్ళీ నిమ్మ, నారింజ, దబ్బ మొదలైన పండురసం పిండితే అది మళ్ళా పసుపుపచ్చగా అయిపోయింది. పసుపుగావున్న దుంప అకస్మాత్తుగా ఎర్రగా మారిపోవడం. మళ్ళీ ఎర్రటి దుంప అకస్మాత్తుగా పసుపుపచ్చగా మారిపోవడం ఎంత ఆశ్చర్యం! దీనిలో ఏమిటి రహస్యం? ఆ వ్యక్తికే అర్థంకాలేదు. తనదగ్గర ఏదో మహిమ ఉందనుకున్నాడు. ఈ రంగుమార్పిడిని మహిమగా పేర్కొని తన గణంలో ఆధిక్యత సంపాదించుకున్నాడు. దీన్ని దైవవిశ్వాసానికి ముడిపెట్టేశాడు.

వేటకు వెళ్ళేటప్పుడు పిల్లి ఎదురైంది. ఆ రోజున అతనికి జంతువు దొరకలేదు. ఆలోచించే మానవుడు కొంచెం వెనక్కి ఆలోచించుకున్నాడు. తాను బయలుదేరినపుడు పిల్లి కన్పించింది. అందుకే తనకు

జంతువు దొరకలేదనుకున్నాడు. అంతకుముందు ఎన్నిసార్లో తనకు పిల్లి ఎదురై వుంటుంది. అయినా జంతువు దొరికింది కనక పిల్లిగురించి ఆలోచించలేదు. ఆరోజు జంతువు దొరకలేదుకనుక పిల్లి జ్ఞాపకమొచ్చింది. పిల్లిని చూస్తే జంతువు దొరకదేమోనని ఆలోచన పోయింది. అప్పటినుంచీ పిల్లినిచూస్తే జంతువు దొరుకదేమోనని వేటకువెళ్ళడంమానేశాడు.

భవిష్యత్తు తనకు తెలియదు కనుక భయం. అందుకే తెలియని విషయంమీద తెలిసినవారు ఎవరైనా చెబితే నమ్మకం కుదురుతుంది. ఇవాళ్ళ నీవు వేటకు వెళ్ళు, ఫరవాలేదు. నీకు జంతువు దొరుకుతుంది అని ధైర్యంగా ఎవరైనా చెబితే కొంచెం మనోనిబ్బరం ఉంటుంది. జంతువు దొరికేవరకు వేటాడుటకు ఓపిక, ఉత్సాహం, పట్టుదలా ఉంటాయి. చాలా సేపటివరకు జంతువు దొరకకపోయినా దొరుకుతుందని చెప్పారుగనుక ఆశతో దొరికేవరకూ వేచి ఉంటాడు. అలా వేచివుండగా ఏదో ఒక సమయంలో ఏదో ఒక జంతువు దొరక్కపోదు. ఒకడు వేటకు బయలుదేరినప్పుడు ఎవరైనా నీకివ్వాళ్ళ జంతువు దొరకదేమో అని అంటే వేటకు వెళ్లిన కొద్దిసేపటికే అపంత్యపై, అనుమానమూ ప్రారంభమౌతాయి. ఇవాళ జంతువు దొరకదనే అనుమానం ముందే వెలిబుచ్చారుగదా, ఇక నేను ఎంతసేపు వేచిఉంటేమాత్రం ఏమి ప్రయోజనం అని అనుకోవడం ప్రారంభిస్తాడు. కృషీ, పట్టుదలా సన్నగిల్లుతాయి. ఇక ఎక్కువ ప్రయత్నం చేయకుండా తిరిగి వెళ్లిపోతాడు.

ఆదిమ మానవునికి ఇటువంటి సంఘటనలను ఎలా అర్థం చేసుకోవాలో తెలియలేదు. ఇవి మహిమలనుకున్నాడు. భవిష్యద్వాణి అనుకున్నాడు. పసుపునకు ఒక లక్షణం ఉంటుందని, అలాగే సున్నానికీ నిమ్మరసానికి వేరువేరు లక్షణాలుంటాయని, అవి కలిసినప్పుడు, ఆయా లక్షణాల్లో మార్పు వస్తుందని అతడు అర్థంచేసుకోలేదు. ప్రపంచంలో ప్రతిదీ ఒక శక్తి అని, ఒక దేవత అని అనుకోవడం చేత పసుపురంగు ఎర్రగా మారడాన్ని ఆ ఎరుపు మళ్ళా పసుపుగా మారడాన్ని దైవ శక్తులకు ఆపాదించాడు.

పిల్లి కనబడితే తనకు పని జరగదేమో అని అనుమానం కలగడం చేత పిల్లి అపశకునం అనుకున్నాడు. తనకు ఇష్టమైన సందర్భం వేటకు వెళ్ళేముందు కనబడితే అది శుభశకునం అనుకున్నాడు. కుటుంబంగా యేర్పడిన మానవునికి తనకు ఆత్యంత యిష్టమైనవి భార్యపిల్లలు. అందు చేత ఏదైనా ఒక పనికి వెళ్ళేముందు భార్యనుగాని, పిల్లలనుగాని, ఎదురు వచ్చి కనబడమనేవారు. అప్పుడు సంతృప్తి, ఉత్సాహం, పట్టుదల మాన వునిలో పెరిగాయి.

మత పెద్దలు – మంత్ర విద్యలు

ఏదైనా ఒక పనిచేసేముందు దానికి సంబంధించి తనకు ఏమీ తెలియదుగనుక తెలియనిది తెలుసుకోవాలనే తాపత్రయం మానవునిలో యెక్కువగా వుంటుంది. దీనివల్ల తమ మతపెద్దని అడిగి తెలుసు కోడానికి ప్రయత్నించేవారు. అప్పటికే మతపెద్దని అందరూ పెద్దగా అంగీకరించడంచేత, దేవతలను గురించి మతపెద్దకు ఎక్కువ తెలుసునని అందరూ భావించడంచేత, మతపెద్దను దైవాంశ సంభూతుడుగా స్వీక రించటంచేత మతపెద్దను సంప్రదించటం అలవాటుగా మారింది. అలవాటు ఆచారమైంది. తనను అందరూ సంప్రదిస్తున్నారు గనుక వివిధవిషయాలు తెలుసుకొని వారికి చెప్పటం తనకర్తవ్యంగా భావించాడు. ప్రపంచమంతా శక్తులు నిండిఉన్నాయి గనుక అవి మానవులకు అతీతమైన శక్తులుగనుక అయాశక్తుడాల్వారా తాను సమాచారాలను సేకరించ గలుగుతున్నానని భావించాడు. అయాశక్తులను తనవశములోనికి తెచ్చుకొనుటకు కర్మ కాండను సృష్టించుకొన్నాడు. ఈ విధముగా దైవాంశ సంభూతులగు మతపెద్దలు మహిమలు జరుపగలరని, శక్తులను వశపరచుకోగలరని జనం నమ్మేవారు.

ఈ విధంగా ఆదిమమానవుల మతం శక్తులతోను, మహిమలతోనూ నిండింది. ఈ మహిమలు ఎవరు ఎన్ని ఎక్కువ చేయించి చూపగలిగితే వారు అంత గొప్ప మత పెద్దగా పరిగణింపబడ్డారు. ఈ శక్తులను ఆహ్వా

నించుటకు, తాము కృషిజరుపుతున్నట్లు ప్రజలకు తెలియుటకుగాను సాంకేతిక శబ్దాలు, పదజాల పఠనం అవసరమైంది. అవే మంత్రాలుగా ప్రసిద్ధి చెందాయి. ఈ సాంకేతిక పదజాలాన్ని అంతకంతకు అభివృద్ధి కూడా చేశారు. ఇవన్నీ నేర్చుకున్నవారిని చూచి ప్రజలు భయపడేవారు కూడా. ఆదిమ మానవ సమాజంలో, ఇప్పటికీ ఆఫ్రికా, దక్షిణ అమెరికా వంటి అడవి జాతులున్న ప్రాంతాల్లో యిటువంటి పరిస్థితులున్నాయి. మంత్రగాళ్ళూ, మంత్రకత్తెలూ ఆ యా సమాజాల మతంలో ప్రాముఖ్యత వహించారు. మంత్రగాళ్ళూ, మంత్రకత్తెలూ తమ విద్యలను వంశపారంపర్యంగా నేర్పి వీటిలో మరింతగా నిష్ణాతులుగాచేశారు. కనికట్టు, చేతబడి, భూతవైద్యం, అంజనం, చిల్లంగి మొదలైనవన్నీ మాంత్రిక విద్యలుగా వ్యాప్తిచెందాయి.

యదార్థానికి ఇవన్నీ హస్తలాఘవ విద్యలు మాత్రమే. చూపరుల కన్నుగప్పి గారడీవాడు మోసంచేసినట్లే వీరూచేస్తారు. కాని గారడీవిద్యను మానవుడు చేస్తున్న కళగా అర్థంచేసుకోవడంచేత, అందులో కుతూహలం ఆసక్తి వుంటాయిగాని మౌఢ్యం వుండదు. కాని కనికట్టు, అంజనము, చిల్లంగి, భూతవైద్యమూ మొదలైనవాటికి మానవాతీత శక్తులను ఆపాదించడంచేత అందులో కుతూహలముకంటే భయమూ, భక్తి, మౌఢ్యమూ యెక్కువ వుంటాయి. గారడీ చేసేవాడు తనవద్ద యేమీ అతీతశక్తులు లేవనీ తాను చేసేవన్నీ కేవలం మోసాలేనని, మ్యాజిక్ అంటే చూపరులను మోసగించే విద్యయని స్పష్టంగా చెబుతాడుగనుక గారడీవానిని చూచి మనం భయపడము. కానీ మహిమలు చేస్తున్నామనేవాడు తాము చేస్తున్నది మోసమని అంగీకరించరు. తమవద్ద మానవాతీతశక్తులు వున్నాయని వాటిద్వారా మానవమాత్రులకు సాధ్యంకాని మహిమలు తాము చేయగలుగుతున్నామని, తమ యీ శక్తులు దైవదత్తమని వారంటారు. అందుచేత సామాన్య ప్రజలు వీరిని కుతూహలంతోనూ, వినోదంతోనూ చూడటంగాక, భయంతోనూ, భక్తితోనూ చూస్తారు. తమ అతీతశక్తుల ద్వారా వారు తమ కష్టాలు తీర్చగలరని, వరాలు ప్రసాదించగలరని భావిస్తారు.

రోగము - వైద్యము - అతీతశక్తులు

పూర్వకాలంలో జబ్బులన్నీకూడా దుష్టశక్తులు ఆవహించడంవల్ల వచ్చినవని అనుకున్నారు. అందుచేత రోగము కుదర్చాలంటే మనిషి మీద ఆవహించిన దుష్టశక్తిని పారద్రోలాలని ప్రయత్నం చేసేవారు. ఈ విధంగా వైద్యంకూడా దైవవిశ్వాసానికి, మహిమలకు, మంత్రాలకు లోబడిపోయింది. ఆరోజుల్లో మతపెద్దే గురువు, వైద్యుడుకూడాను. కాని రానురాను పరిపాలనా పెద్ద ప్రత్యేకంగా తయారైనట్లే వైద్యుడుకూడా వేరే తయారయ్యాడు. కాని, ఈ వైద్యుడుకూడా మతపెద్దకు, మతవిశ్వాసాలకు లోబడిఉండేవాడు. మొదటిరోజుల్లో మందులనేవి లేవు. కేవలం తమను కనికరించమని, మనుషులను మామూలుగా చేయమని దేవతలను ప్రార్థించేవారు. శరీరంలో ఉండే రోగనిరోధకశక్తివల్ల చిన్నచిన్న జబ్బులు సహజంగానే మానిపోయేవి. పెద్దపెద్దజబ్బులకు మనుషులు చనిపోయేవారు. జబ్బు నయమైతే శక్తులు, దేవతలు కనికరించాయని, నయంకాక చనిపోతే అవి కనికరించలేదనుకుని సంతృప్తి పడేవారు. కాని రానురాను ప్రకృతిని పరిశీలిస్తున్నకొద్దీ కొన్నికొన్ని ఆకులు, పసర్లు, ప్రాళ్లు, కాయలు జబ్బులు నయంచేయడానికి తోడ్పడుతున్నాయని గమనించారు. అప్పుడు ఆయావస్తువులు ఆయా జబ్బులకు వాడడంప్రారంభించారు. అవే మందులైనాయి. ఈ మందులన్నీ తమకు దేవుడే ప్రసాదించాడని అనుకోవడంచేత మొక్కుబళ్లు, పూజలు, మంత్ర తంత్రాలు, భూతవైద్యం మొదలయినవన్నీ మందులతోపాటు ఉండేవి. మందువల్లనే జబ్బు తగ్గినా నయంకావడం అతీతశక్తుల మహిమలకే ఆపాదించుకొనేవారు.

ఈ విధంగా వైద్యాన్ని చేపట్టిన వారు దుష్టశక్తులను అరికట్టగలరని ప్రజలు అనుకున్నారు. దుష్టశక్తులను అరికట్టగలిగి, జబ్బులు నయం చేయగలిగిన వారు ఆ శక్తిని మనుషుల మీద ప్రయోగించి ఆరోగ్యం వున్న మనుషులకు జబ్బులు కూడ తెప్పించగలరని అనుమానము, భయమూ ప్రక్కప్రక్కనే పెరిగాయి. దీనివల్లనే చేతబడి చేశారని, మందు పెట్టారని భావించడం వచ్చింది. హత్యానేరాలను, ఆరోగ్యంగా ఉన్నవారు

ఆకస్మాత్తుగా ఆరోగ్యం కోల్పోవడాన్ని ప్రజలు ఈవిధంగా అర్థం చేసుకున్నారు. వైద్యులైన మంత్రకత్తెలు, మంత్రగాళ్లు తమ మంత్రవిద్య లను ఉపయోగించి మనుషులను చంపివేస్తారని, మనుషులకు రోగాలను తీసుకువస్తారని ప్రజలు భావించేవారు. ఒకప్పుడు ఈ భయం చాలా ఎక్కువగానే ఉండేది. యూరప్‌లో మధ్యయుగంలో మంత్రగాళ్లను చాలా మందిని వేటాడి జనం చంపివేశారు. అలాగే ఆఫ్రికాలో కూడా జనం మీద దుష్టశక్తులు ప్రయోగిస్తున్నారనే నెపంతో ఇప్పటికీ చాలామంది స్త్రీలను. పురుషులను చంపివేస్తున్నారు. ఇవంతా మౌఢ్యంవల్ల వస్తున్నదే. నిజంగా వీరికి ఆ శక్తులంటూ వుంటే తమను పట్టుకోవడానికి, చంపడానికి వచ్చేవారి మీద ఆ శక్తులను ప్రయోగించి తామెందుకు రక్షింపబడకూడదు? తమవద్ద నున్న శక్తుల ద్వారా తమకు ఏమిజరగబోతుందో ముందుగానే ఎందుకు తెలుసుకోలేకపోవాలి? ఇటువంటి ప్రశ్నలు ఆ రోజుల్లో వేసుకోలేదు.

ఈవిధంగా ఆదిమకాలంలో మతం అంతా గారడీ విద్యలతో నిండి ఉండేది. ప్రత్యక్షంగా చూపగలిగే మహిమలు హస్తలాఘవ విద్యతోను, గారడీ విద్యలతోనూ చేసేవారు. అవి నేర్చుకుంటే ఎవరైనా చేయవచ్చు. కాని వాటికి భూతవైద్య, మంత్ర తంత్రవిద్యలు అని పేరుపెట్టి అందరిని నేర్చుకోనివ్వలేదు. మతపెద్దలు, మంత్రగాళ్లు, మంత్రగత్తెలు, భూత వైద్యులు తప్ప ఇతరులు ఈ విద్యలను నేర్చుకుని ప్రయోగిస్తే వారికి కీడు తప్పనికూడా ప్రచారం జరిగింది. దీనితో సామాన్య ప్రజలు భయ పడి వీటికి దూరంగా ఉండిపోయేవారు. ఆ యా విద్యలు నేర్చినవారుకూడా వంశపారంపర్యంగానో, గురుశిక్షణద్వారానో నేర్వడంచేత తమకుటుంబాలు గాని, తాముగాని ప్రత్యేకంగా దైవశక్తులచేత ఈ విద్యల కొరకు పుట్టించ బడ్డామని అనుకోవడం చేత తాము విశిష్టులమని, ఈ శక్తి తమకే ఉన్నదని భావించారు. అందుచేత అమాయకత్వంతో కూడిన నిజాయితీవల్ల తాము మోసం చేస్తున్నామనివారు అనుకోలేదు. ఈ వ్యక్తులకు తమకులేని దైవ దత్తమైన శక్తులు ఉన్నట్లుగా సామాన్య ప్రజలు ఎంత నిజాయితీగా నమ్మారో అంతనిజాయితీగాను ఆ వ్యక్తులుకూడా తమకే ఆ శక్తులున్నా యని ఇతరులకు ఆ శక్తులు ప్రసాదింపబడలేదని నమ్మారు.

గొప్పతన నిరూపణకు మహిమలు అవసరమా?

సాధారణమైన మానవులకంటే అతీతమైన శక్తులు గలవారు, మహిమలు, అద్భుతాలు చేయగలిగినవారు గొప్పవారు అనేభావం ప్రజలలో వచ్చింది. అందుచేతనే దేశాన్ని రక్షించే సైన్యంకంటేకూడా మహిమలు గలవనేవారికి ఎక్కువ విలువ యివ్వడంజరిగింది. కనుక ఎవరినైనా గొప్పవారిని చేయాలంటే వారికి మహిమలను ఆపాదించడంకూడా అవసరమైంది. అందుచేతనే మనప్రాచీన సాహిత్యం మహిమలు, అద్భుతాలతో నిండిపోయివుంటుంది. శ్రీకృష్ణుడు గోవర్ధనగిరిపర్వతాన్ని ఒక్కవ్రేలుతో పైకి ఎత్తాడట. ఆంజనేయుడు ఒక్క గంతులో సముద్రాన్ని దాటాడట. అలాగే ఏసు పీటరును నీటిమీద నడిపించాడట. అయిదు రొట్టెలను, రెండు చేపలను అయిదువేలమందికి ఏసు పంచి ఇచ్చాడట. మహమ్మద్ ప్రవక్త కొన్ని మహాత్మ్యాలు జరిపినట్టు ఖురాన్‌లో కూడా వ్రాసివుంది. బద్ర్ యుద్ధం జరుగుతుండగా మక్కావాసులు అధిక సంఖ్యాకులుగా వుండి మహమ్మదు అనుయాయులు చాల తక్కువగా వున్నారట. అప్పుడు మహమ్మదు కొన్ని రాళ్ళను తీసికొని మక్కావాసులవైపు విసిరి, శత్రువుల ముఖములు చెదిరిపోవుగాక, అని అన్నాడట. అప్పుడు వెంటనే అల్లా ఒక పెనుగాలిని మహమ్మదు సైన్యం వైపునుంచి మక్కావాసులవైపు పంపినాడట. దాని ధాటికి తట్టుకోలేక మక్కావాసులు ఓడిపోయినారట. అప్పుడు మహమ్మదు సైన్యం విజయం సాధించింది అని ఖురాన్‌లో వ్రాసివుంది.

ఈ మహిమలను ఆపాదించేటప్పుడు ఔచిత్యాలనుకూడా మరిచిపోవడం కద్దు. తిరిగి తిరిగి ఆకలిగొన్న ఏసుక్రీస్తు ఒక అత్తిచెట్టువద్దకు వచ్చాడట. ఆ అత్తిచెట్టుకు పండ్లు లేవట. వెంటనే కోపంవచ్చి ఆ చెట్టును ఎండిపోవుగాక అని శపించాడట. వెంటనే చెట్టు ఎండిపోయిందట. ఏసు క్రీస్తు మహిమ, శక్తి ఈ విధంగా ఉందని మనస్సు నమ్మమంటారు బైబిల్ రచయితలు.

ఒక ప్రక్కన ఏసుక్రీస్తును ప్రేమస్వరూపుడుగా, శాంతిమూర్తిగా చిత్రించిన బైబిల్‌కారుడు ఈ విషయంలో ఏసుక్రీస్తును ద్వేషస్వభావుడుగాను, పగసాధింపు మనిషిగాను చూపించాడు.ప్రేమమూర్తియైన ఏసు ఒక చెట్టును ఎండిపోమని శపించడం ఎంతవరకు సబబు? ఒకవేళ నిజంగా అతని మాటకు అంత మహిమే ఉంటే, అతను అన్నంత మాత్రాన్నే ఆ చెట్టు ఎండిపోయేట్లయితే, చెట్టును ఎండిపోమని శపించేబిదులు చెట్టుకు పండ్లులేనప్పుడు "ఈ చెట్టు కాయలు కాయుగాక" యని ఎందుకు ఆజ్ఞాపించి ఉండకూడదు? అప్పుడు ఆ చెట్టూ బ్రతికిఉండి కాయలు కాసేది. క్రీస్తు, ఇతరులూ వాటిని తినగా ఆకలీ తీరేది.

ఈ విధంగా మనం ఔచిత్యాలను ప్రశ్నిస్తూపోతే చాలావిషయాలు పరస్పర విరుద్ధంగా ఉంటాయి. ఇందుకు కారణం మహిమలూ, మహాత్మ్యాలూ నిజంగా లేకపోవడమే. వాటిని కేవలం గొప్పతన నిరూపణకు అతిశయోక్తులుగా ప్రచారం చేయడం జరుగుతోంది. ఈ ప్రకృతిలో ఏది జరిగినా అది సహజమైనదే. ఒకరు చేయగలిగింది మరొకరు తప్పక చేయగలుగుతారు. మానవునికి, ప్రకృతికి అతీతంగా ఏవో శక్తులున్నాయని, వాటివల్ల తాము మహాత్మ్యాలు చేస్తున్నామని అనుకోవడం, అలా జరుగుతున్నాయని భావించడం ఆత్మవంచన; పరవంచన.

మహిమలు చూపేవారిలో నిజాయితీ లేదు

మానవులను గొప్ప మానవులుగా చూడలేనివారు ఈ మహిమలు ఆపాదించుటకు ప్రయత్నిస్తారు. ఈ మహిమలు ఎక్కడా జరగలేదు, జరగడంలేదు. ఇవి జరిగితే వాటివెనుక మ్యాజిక్కు, మోసము ఇమిడి ఉంది. మ్యాజిక్కుని, మోసాన్ని మహిమలుగా ప్రచారం చేయడం, ప్రజలలో లేనిపోని ఆశలు కల్పించడం మానవత్వము యెడల మహాపచారము, నేరమూను. నిర్ధారణకు వారు నిలువరు. అంతేకాక నిర్ధారణ చేస్తామనే నిజాయితీపరులను మహిమలు చేసేవారు, మహిమల్లో నమ్మేవారు వ్యతిరేకిస్తున్నారు.

నావల్ల ఒక మహిమ జరుగుతూ ఉంటే దానికి నేను అర్థం చెప్పలేకపోవచ్చు. ఇది ఎలా జరుగుతోంది, ఏపరిస్థితుల్లో జరుగుతోంది అని ఎవరైనా పరీక్షించదలచుకొంటే, నాలో నిజాయితీఉంటే, నేను సహకరించాలి. నేను సహకరించడంలేదంటే నాలో నిజాయితీలేదని అరం. నిజాయితీ లోపించినవారు మోసగాళ్లుగాక మరేమిటి?

మానవునియొక్క విజ్ఞానం, అవగాహన పెరుగుతున్నప్పుడు ప్రతీ విషయాన్ని శాస్త్రీయ దృష్టితో పరిశీలించవలసిన అవసరం ఉంది. ఎవరో చెప్పారనో, పుస్తకాల్లో వ్రాశారనో, బహుళప్రచారమై ఉందనో ఏ విషయాన్నైనా యదార్థంగా స్వీకరించవలసిన పనిలేదు. అనుమానంవస్తే పరీక్షించి చూడవలసిన అవసరం ఉంది. అలా పరీక్షించుకోవడమే శాస్త్రీయ దృష్టి. అలా పరీక్షించకుండా నమ్మడమే మూఢనమ్మకం. దైవ భావము, మతదృష్టి మూఢనమ్మకాలకు పుట్టినిల్లు.

రెండురకాల మూఢనమ్మకాలు

ఈ మూఢనమ్మకాలు రెండురకాలు. ఒకటి: భౌతికంగాఉన్న వస్తువులో ప్రత్యక్షంగా ఒక ప్రత్యేకత కనబడ్డం. ఆ ప్రత్యేకతే ఒక మహిమ అనుకొని మూఢంగా నమ్మి, దానికి ఏవేవో అతీత శక్తులు ఆపాదించి కొలుపులు జరపడం, పూజలుచేయడం. దీంట్లో చూడడానికి ఒక వస్తువు ఉంటుంది. కాని అది అసాధారణంగా ఉంటుంది. ఉదాహరణకు: రెండు తలల శిశువులు, నాల్గుకాళ్ళు కలసిపోయిన జంతువు పిల్లలు, తలలున్న తాటిచెట్టు, ఎండనుబట్టివంగే కొబ్బరిచెట్టు, పాముపడగవంటి గుమ్మడితీగ. ఇవి మనకు కనబడతాయి. ఇవి అరుదుగా కనబడే విషయాలు గనుక వీటిలో ఆశ్చర్యం ఉండవచ్చు. అవి ఏమిటి? ఎందుకలాగున్నాయని మనం పరిశీలించవచ్చు. వాటిని అర్థంచేసుకోడానికి ప్రయత్నం చేయవచ్చు. ఏదైనా లోపంవల్ల ఈ అసాధారణత ఏర్పడితే దానిని సరిదిద్దుటకు కూడా ప్రయత్నం చేయవచ్చు. కాని దానిని మహిమ అంటూ పేర్కొని, దానికి పూజలు, పునస్కారాలూ ప్రారంభించి, నెమ్మదిగా ఒక గుడికట్టి కొబ్బరి

కాయలు కొట్టడం, దానిని ఇష్టదేవతగా చేసుకొని వరాలు కోరుకోవడం అనాగరికుడైన, అజ్ఞానియైన, క్రొత్తను చూసి భయకంపితుడైన ఆదిమ మానవుని లక్షణం. ఇందులో మానవత్వమూ లేదు, విజ్ఞాతా లేదు, వివేకమూ లేదు.

రెండవరకం మూఢనమ్మకాలు చూడడానికేమీ కనబడవు. అచటి శక్తులు అదృశ్యమైనవి అంటారు. మానవాతీత శక్తులద్వారా ఆ పనులు జరుగుతున్నాయంటారు. అతీతశక్తుల ద్వారా ఏ పనులైతే జరుగుతున్నాయని చెబుతున్నారో వాటినే గారడీవారు, మెజీషియన్లు కూడా చేస్తున్నప్పుడు అవి అతీతశక్తుల ద్వారా జరుగుతున్నాయని ఎలా నమ్మడం? మెజీషియన్లవలెనే వారుకూడా గారడీవిద్యల ద్వారానే ఈ పనులుచేస్తూ, కేవలం తమను గొప్పవారుగా సమాజంముందు ప్రచారం చేసుకొనుటకు తమకు మహిమలు ఆపాదించుకుంటున్నారేమో? అందుచేతనే వారు పరీక్షించుటకు అంగీకరించడంలేదేమో, ఎక్కడెక్కడైతే పరీక్షించుటకు ప్రయత్నాలు జరిగాయో అక్కడ వాటిలోని మోసం బయటపడిపోయింది. అయినా ఇంకా మహిమలను, మహాత్మ్యాలను, అతీతశక్తులను జనం నమ్ముతున్నారంటే మన సామాజిక వ్యవస్థలో ఏదో లోపం ఉండి ఉండాలి.

మహిమల మనస్తత్వం

ఈ మహిమల మనస్తత్వం లాటరీ మనస్తత్వం వంటిది. ఒక రూపాయి పెట్టుబడిపెట్టి అయిదు లక్షలు సంపాదించుకోవాలనే ప్రయత్నము, దురాశ అది. అయిదు లక్షల మంది ప్రజల రూపాయలను తాను దోచుకుంటున్నాడు. మానవుని మానవుడు దోపిడీ చేయడంలో ఇది ఒక భాగం. దోపిడీ సొమ్ము వికేంద్రీకృతమై ఎక్కువమందిమీద విభజింపబడివుంది గనుక ఎవరికివారే తమకు పోయినది ఒక్క రూపాయే గదా అని ఊపకుంటారు. అదేవిధంగా ఈ మహిమల మనస్తత్వంలో కూడా ఎంతోమంది ప్రజల వివేకాన్ని దోచుకుంటున్నారు. దాన్ని మోసంగా కొద్దిమంది కూడబెట్టుకుంటున్నారు

మానవునిలో భవిష్యత్తు అంటే భయం, భవిష్యత్తు తెలుసుకోవాలనే కుతూహలం; చావు అంటే భయం, చావును వాయిదా వేసుకోవాలనే ప్రయత్నం; తన కృషిలేకుండా ఏవో అతీతశక్తులు తనకు కావలసినవి ప్రసాదించాలనే దురాశ; విపరీతమైన నైరాశ్యంలో పడినప్పుడు తన నిరాశకు కారణాలు తొలగాలనే ఆత్రత - ఈ మహిమలను నమ్మే మౌఢ్యం వెనుక వుంది. ఈ విధంగా ఈ మహిమలను నమ్మేవారంచరూ మోసగాళ్ళు, దురాశాపరులు, లేదా నిరాశాపరులై ఉంటారు. వారు నిత్య జీవితంలో నిజాయితీపరులైనా ఏ మూలో గూడుకట్టుకున్న నైరాశ్యాన్ని తొలగించుకొనుటకు అతీతశక్తులలోనూ, మహిమలలోనూ నమ్మకం ఒక సాధనంగా ఉపయోగించుకొంటున్నారు~ మోసాన్ని బయటపెట్టడానికైనా వీటిని పరీక్షించాలి. నిరాశాపరుల నిజాయితీ మౌఢ్యానికి బలికాకుండా ఉండాలన్నా ఈ మహిమలను, మాహాత్మ్యాలను పరీక్షించాలి.

దోపిడీదారుల కుట్ర

రాజకీయ నాయకులు ప్రజల అధికారాన్ని దోచుకుంటున్నారు. వర్తకులు, పెట్టుబడిదార్లు ప్రజల సంపదలను దోచుకుంటున్నారు. మహిమలు, మహాత్మ్యాలు కలవనేవారు ప్రజల వివేకాన్ని దోచుకుంటున్నారు. మతవ్యవస్థ, దైవనమ్మకం నిర్ధారణకు నిలువని ఊహలమీద ఆధారపడి ఉండడంచేత, వాటిని చిరకాలంగా మానవుడు నమ్మడంచేత ఈ మహిమల మనస్తత్వానికికూడా చోటు ఏర్పడింది. మత పెద్ద దైవాంశ సంభూతుడైనట్లే, రాజు దైవాంశ సంభూతుడైనట్లే, మహిమలపేర గారడీ చేసేవారుకూడా దైవాంశ సంభూతులుగా పరిగణింపబడుతున్నారు. మత పెద్దను, రాజును వ్యతిరేకించడం నేరమైనట్లే ఈ "మహిమల మనుషులను" వ్యతిరేకించడం కూడా సామాజిక నేరంగా ప్రచారం చేస్తున్నారు.

రాజును మతగురువు, మతగురువును రాజు పరస్పరం సమర్థించుకుని ప్రజలపై తమ ఆధిపత్యాన్ని నిలుపుకొనుటకు ప్రయత్నం చేసినట్లే, నేటు ధనికులు ఈ"మహిమల మనుషులు"పరస్పరం సమర్థించుకుని ప్రజలను శాశ్వతంగా అజ్ఞానంలో ఉంచి, వారిపై తమ

ఆధిపత్యం కొనసాగించుకోవాలనే ప్రయత్నం చేస్తున్నారు. దైవనమ్మకాన్ని, మహిమలను విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా ప్రజలలో మౌఢ్యాన్ని పోషించి అన్యాయాలు, అసమానతలపై తిరుగుబాటు రానివ్వకుండా చూస్తున్నారు. ప్రపంచ విప్లవంలో రాజ ప్రతినిధులపైన, మత ప్రతినిధులపైనా ఒక్కసారిగా ఏవగింపు కలిగినట్లే, ప్రజలలో మౌఢ్యాన్ని పోషించే రాజకీయ నాయకులపైన, మహిమల మనుషులపైన ఒక్కసారి తిరుగుబాటు త్వరలోవస్తే ఆశ్చర్యపడవలసిన పనిలేదు. ప్రజలను దోచుకోవడానికి వారిలోని మౌఢ్యం కాపాడ్డం మోసగాళ్లకు, దోపిడీదార్లకు పెట్టుబడిగా తయారైంది. క్రొత్త క్రొత్త దేవాలయాలు వెలుస్తున్నాయి అంటే ఇందులో నిజాయితీ డబ్బు ఎంత ఉంది? తిరుపతి దేవాలయంలో పెరుగుతున్న కానుకల డబ్బులో నల్లధనం ఎంతలేదు? పెరుగుతున్న దైవభక్తి తరుగుతున్న నీతికి నిదర్శనం కాదా? మహిమలపై నమ్మకం పెరగడం స్వశక్తిపై విశ్వాసం కోల్పోవడం కాదా? మోసానికి, నైరాశ్యానికి ఇవి చిహ్నాలుగా నిలవడం లేదా?

ఇలా మనం ప్రశ్నించుకున్నప్పుడు మనలో నిజాయితీ పెరుగుతుంది. మనలో స్వశక్తి విశ్వాసం అధికమౌతుంది. ఉత్సాహం,ఆశ చిగురిస్తాయి. మూఢనమ్మకాలు, మహిమల మనస్థత్వం మానవుని దివాలాకోరుతనానికి నిదర్శనం. ప్రతి ఒక్కరు ఈ మహిమలను పరీక్షిస్తామని పూనుకుంటే క్షణంలో మహిమలు మాయమైపోతాయి.

ఈ సందర్భంలో కొన్ని మూఢనమ్మకాలను పరిశీలించి చూద్దాం.



అమెరికన్ ఆజ్ఞేయవాది

రాబర్ట్ గ్రీన్ ఇంగర్సాల్

(1833—1899)



బ్రిటిష్ నాస్తికుడు

ఛార్లెస్ బ్రాడ్లా

(1833—1900)

50

పాము, అది నాగుపాముైనాసరే, ఏదైనా జంతువునుగాని, కదులుతున్న ఏ ఇతర వస్తువునైనాగానీ లేదా మరొక మనిషినిగాని కరిచి ఉంటే మొదటి కాటుకి విషము చాలా పోయి ఉంటుంది. రెండవకాటులో విషము ఉండదు. కాటుకి కాటుకి మధ్య పాము విషపు గ్రంధులలో విషము తయారగుటకు కొంత సమయం కావాలి. ఆ సమయం లోపల కరిసే మరణం సంభవించదు.

యదార్థాలు ఇలా ఉన్నా పాము అంటే గల భయం చేత విషం వల్ల కంటే భయంవల్ల చనిపోయేవారే ఎక్కువ. పాము మంత్రమనేది మానసికంగా ఈ భయాన్ని తొలగించుటకు ఉపయోగ పడుతుంది. విషం ఉన్నప్పుడు పాముకరిస్తే మంత్రం వేసినా మనిషి చనిపోతాడు. పాము మంత్రానికి ఇంత ప్రచారం రావడాని కారణం పాములన్నీ విషపు పాములు కాకపోవడం, విషపుపాముైనా గ్రంధిలో విషంలేనప్పుడు కరవడం, మంత్రానికి ముందు పాముకాటు విరుగుటకు మందుకూడా వేసి ఉండడం వల్లమనిషి చావడంలేదు. కాని వేసు మాత్రం మంత్రానికి మిగులుతుంది. మంత్రంవేసినప్పటికీ మనిషి చనిపోయినప్పుడు వాడికి మూకలు కరుపై నవి అనో, ఏళ్ళనిండాయనో, విధి వ్రాతను ఎవరు తప్పించగలరనో సరి పెట్టుకొంటున్నారు. విధివ్రాతను తప్పించలేనప్పుడు ఇక మంత్రం ప్రయోజనం ఏమిటి?

అలౌకిక శక్తులలోనూ మంత్రాలలోనూ ఉన్న నమ్మకంవల్ల మంత్రం అనేది మానసికంగా ధైరటనిస్తుందేకాని విషంమీద అదేమీ పని చేయడంలేదు. యదార్థ విషయాలు తెలుసుకున్నప్పుడు భయపడవలసిన అవసరంలేదు. అందుచేత పాము మంత్రంలో మహిమలేమి లేవు. విషయాలు తెలియని అమాయకులకు, అజ్ఞానులకు అజ్ఞానంలో ధైరటనిచ్చే సాధనమది. పాము మంత్రంలోని యదార్థం ఇది.

పామును గురించి ఒక పెద్ద మూఢనమ్మకం: పాముచెప్పులు అనే ప్రయోగం. కాని నిజానికి పాముకు చెప్పలంటూ లేవు. పాము శరీరమంతా

కూడా శబ్దగ్రాహక శక్తి కల్గింది. అయితే దాని మొత్తం శరీరం భూమికి గాని, మరిదేనికైనాగాని తగిలి ఉన్నప్పుడే అది శబ్దతరంగాలను స్వీకరించగల్గుతుంది. అలాగకాక తల పైకెత్తినప్పుడు దానికేమీ వినపడదు. కాని కదలికను బట్టి చూసి అది ఆడుతుంది. పాములవాడుఊదే నాగస్వరం శబ్దానికిగాక, ఆబూరను అటూ ఇటూ కదిలిస్తూ ఊగించడంవల్లనే పాము పడగనుకూడా అటూ, ఇటూ త్రిప్పుతుంది.

అలాగే పాము పగ అనే వాడుక కూడా ఉంది. ఇదికూడా కేవలం మూఢనమ్మకమే. మనం పామును కొట్టినప్పుడు దెబ్బ తగిలి అది తప్పించుకుపోతే పగపడుతుంచంటారు. ఇది యదార్థంకాదు. ఆ చుట్టుప్రక్కల ఉన్న మరోపాము రావచ్చు. లేదా దెబ్బతగిలినపామే అది ఆప్రాంతాల్లోనే తిరుగుతుంది గనుక మళ్ళీమళ్ళీ రావచ్చు. పగపట్టడానికి, దీనికీ ఏమీ సంబంధం లేదు. నా చేతుల్లోంచి ఎన్నో త్రాచుపాములు దెబ్బతిని తప్పించుకుపోయాయి, కాని ఇంతవరకూ ఏ పామూ పగపట్టలేదు. మనిషి తన పగపట్టే ద్వేష పనస్థత్వాన్ని తాను అత్యధికంగా భయపడే జంతువుకు ఆపాదిస్తున్నాడు.

మానవుడు యదార్థ విషయాలు తెలుసుకుంటున్నకొద్దీ, భయాన్ని వదలివేస్తున్నకొద్దీ ఈ మూఢ నమ్మకాలు తొలగిపోతాయి.

కొంత కొంతమంది పామువిషము తిన్నా తమకేమీ చెయ్యటం లేదు అంటారు. పాము విషం ఎక్కడైనా రక్తానికి తగిలితేనే అది మనిషిని చంపుతుంది. ఎక్కడా రక్తానికి తగులకుండా దాన్ని మింగివేస్తే అది మందులాగ పనిచేస్తుంది. నాలుకగానీ, గొంతుకగాని ఎక్కడా చీరుకు పోకుండా ఉన్నప్పుడు పాముపిషం మింగడంలో అది రక్తానికి తగలనంత వరకు దానికల్ల ప్రమాదం లేదు.

దయ్యాలు

దయ్యాల గురించిన మూఢనమ్మకాలు ప్రపంచ మంతా వ్యాపించి ఉన్నాయి. ఆదిమ సమాజంలో మానవుడు మరణానికి అర్థం చెప్పుకోవడంలో ఆత్మను ఊహించాడు. ప్రతి శరీరంలోనూ ఆత్మ ఉంటుందని అది శరీరాన్ని వదలి వెళ్ళిపోవడమే మరణమని అనుకొన్నాడు. మానవుడు జీవించి ఉన్నప్పుడు అతనికి ఎన్నో కోర్కెలుంటాయి. అతని జీవిత కాలంలో ఆ కోర్కెలన్నీ తీరవు. కనుక తీరని కోర్కెలు తీర్చుకొనుటకుగాను చనిపోయినవారి ఆత్మలు తపిస్తూ ఉంటాయని అవి మనుషులపై ఆవహిస్తాయని నమ్ముతారు. జీవించిన మనిషికి ఈ చనిపోయిన వారి ఆత్మ ఆవహించడాన్ని దయ్యం పట్టిందిగా పేర్కొంటారు. ఒక్కొక్కప్పుడు ఈ ఆత్మలు మనుషులపై ఆవహించకుండా ప్రకృతిలో సంచరిస్తూ ఉంటాయని, పరుగెత్తుకుపోతున్న జ్యోతిగానో, మంచుతున్న నిప్పుగానో, మనుగు వేసుకున్న మనిషిగానో కనబడతాయని చెబుతారు. ఈ చనిపోయినవారి ఆత్మలు అశరీరంగా ఉండి చప్పుళ్లు చేస్తాయని, రాళ్లు విసురుతాయని, పదుపులు, దిళ్ళు, గుడ్డలు తగులబెడతాయని కూడా చెబుతారు.

సాధారణంగా స్మశానాల దగ్గర ఈ ఆత్మలు దయ్యాలుగా సంచరిస్తూంటాయని అలాగే ఎవరైనా చనిపోతే ఆ ఇళ్లల్లో కూడా ఉంటాయని, పాడుపడిన ఇళ్ళల్లో ఉంటాయని నమ్ముతారు. కొన్ని కొన్ని ఇళ్ళకి "దయ్యాల కొంపలు" అని కూడా పేర్లుపెడతారు.

యదార్థానికి మనిషి చనిపోయినప్పుడు శరీరంలోనుంచి బయటికి పోయే ఆత్మ అంటూ ఏమీలేదు. నడుస్తున్న యంత్రంలోని ఏదేనా భాగం చెడిపోతే ఆ యంత్రం అకస్మాత్తుగా ఆగిపోతుంది. ఈ శరీర యంత్రం కూడా అంతే. కనుక శరీరంలోంచి బయటకుపోయే ఆత్మేలేనపుడు దయ్యాలుకూడా అబద్ధాలే. మానవుడు తన భయానికి ప్రతిరూపంగా ఏర్పరచుకొన్న భ్రమలు ఇవి.

శరీరంపై చయ్యాలు ఆవహించడమనేది పురుషుల కంటే స్త్రీలలోనే ఎక్కువ. ఇందుకు ముఖ్యకారణం సమాజంలో స్త్రీలు రకరకాలుగా అణచబడిఉండడమే. భర్త, అత్తమామలు, ఆడబిడ్డలు పెట్టే ఒత్తిళ్లకు భయపడి కోడళ్లు కొంత భిన్నమైన ప్రవర్తనలో ఉంటారు. లోపల బలమైన కాంక్షలు ఉండి అవి తీరుటకు అవకాశాలు లేనప్పుడు వాటిని అణచి పెట్టుకోవడం చేత స్త్రీలలో హిస్టీరియా వంటి మానసిక రుగ్మతలు రావడం సహజం. హిస్టీరియా వంటి రోగాలు వచ్చినప్పుడు కూడా స్త్రీల ప్రవర్తన కొంత భిన్నంగానే ఉంటుంది. ఈ భిన్నమైన ప్రవర్తనకు దయ్యం పట్టడంగా అర్థం చెప్పుకొంటున్నారు. ఈ మానసిక రోగాలకు తగు చికిత్సలు చేయించి వారికి బాధలు కలిగించే పరిస్థితులు మారిస్తే వీరి ప్రవర్తనలో మార్పు వస్తుంది. స్త్రీల మానసిక వ్యాధులను వ్యాధులుగా అర్థంచేసుకోక సాంప్రదాయంగా వచ్చే మూఢాచారాలను అనుసరించడంచేత స్త్రీల మానసిక జబ్బులను దయ్యం పట్టడంగా భావిస్తున్నారు. కనుక దయ్యం వదిలించుటకు భూతవైద్యం అనేది వచ్చింది.

ఈ భూతవైద్యం రెండు రకాలుగా కనిపిస్తోంది. కర్మకాండకొరకు రంగు రంగుల ముగ్గులు వేసి ఏవో మంత్రాల వంటివి చదివి అట్టహాసం చేసినా చివరకు దయ్యం పట్టిందన్నవారి మానసిక సమస్యలను అర్థం చేసుకొని అందుకు తగిన మార్పులను భౌతిక పరిస్థితులలోను, కుటుంబ సంబంధాలలోను సూచించడం జరుగుతోంది. "నీకు పట్టిన దయ్యం పోతుంది. నేను ఆ దయ్యాన్ని వదిలించేస్తున్నాను" అని హామీ ఇవ్వడం ద్వారా రోగికి మానసిక ఊరట కలిగిస్తున్నాడు భూతవైద్యుడు.

మరొక రకంలో దయ్యం పట్టిందన్న వ్యక్తిని విపరీతంగా కొట్టి హింసించడం ద్వారా మరొక క్రొత్త భయాన్ని సృష్టించి భీకర వాతావరణాన్ని కల్పిస్తున్నారు. ఈ భయంకర వాతావరణానికి తట్టుకోలేక వ్యక్తిలో అకస్మాత్తుగా మానసిక పరివర్తన వస్తోంది. తద్వారా సమాజంలో తిరిగి తాను సర్దుకొనుటకు ఒక అవకాశం ఏర్పడుతుంది. ఈ విధంగా భూతవైద్యులు విషయాలు తెలుసుకొని సర్దడంద్వారాను, శారీరక బాధలు

పెట్టి భయం సృష్టించడంద్వారానూ వయ్యం అని చెప్పబడే మానసికవ్యాధులను కుదుర్చుటకు ప్రయత్నిస్తున్నారు. భూతవైద్యపు మొరటు విధానంలో మానసికవ్యాధి మురవడం లేదా రోగి చనిపోవడంకూడా జరగవచ్చు. అలాంటివాటికి "ఎటువంటి పీడవయ్యమో! మనిషిని చంపిగానీ వదలలేదు" అనిగాని "ఈ వయ్యపుపీడ ఎప్పటికి వదిలేనో, ఎంతకీ వదలడంలేదు" అని అనుకొనో సంతృప్తిపడుతున్నాము. అంతేగాని హిస్టీరియాజబ్బు అని అనుకోవడంలేదు.

ఒకొక్కప్పుడు అత్త మామలను, భర్తనూ సాధించుటకు వయ్యం పట్టించని నటించే స్త్రీలు కూడా ఉన్నారు. ఈ విధంగా మనిషిమీద వయ్యం ఆవహించినట్లు హిస్టీరియావంటి మానసికవ్యాధులలో లేక పెంకితనమో తప్ప పేరుకాదు. మానసిక వ్యాధులకు సరియైన వైద్యం చేయించాలిగాని భూతవైద్యుల అట్టహాసాలు చికిత్సకాదు.

ముసుగు మనుషులుగా వయ్యాలు కనబడుతున్నాయని చెప్పినప్పుడు పనం తుపాకిపెట్టి ఆ ముసుగు మనిషిని కాల్చితే ఏమవుతుంది? ఏదైనా ఒక మనిషికే ముసుగువేసి దూరంగా నడిపించి అదే దయ్యమని చెప్పి మోసం చేయవచ్చునుగదా.

ఇక కొరివివయ్యాలనేవి గ్రామాల్లోని పొలాల్లో దూరంగా చెత్త తగులబెట్టుకుంటూంటే అదికూడా కొరివివయ్యంగానే కనబడుతుంది. ఒకొక్కప్పుడు భూమిలోంచి సహజవాయువులు బయటకు వచ్చినప్పుడు వాటికి ఏకాస్త నిప్పుతగిలినా అవి భూమిమీద మంటలు తరచు కనిపిస్తాయి.

శబ్దాలు వినబడడం, రాళ్లుపడడం, బట్టలు తగులబడడం మొదలైన వాటివెనుక మానవ హస్తమే ఉంటుంది. చెట్లమీద వెలుతురు వలనపడే నీడలను వయ్యాలుగా భ్రమించి భయపడేవారు చాలామంది ఉన్నారు. ఒకసారి ఒకచెట్టుమీద నుంచి వయ్యం శబ్దం చేస్తోందని చాలా ప్రచారం అయింది. ఆ చెట్టువద్దకి వెళ్ళటకు చాలామంది భయపడ్డారు. తీరా

అచెట్టు పైకెక్కి చూస్తే రెండు రేకుడబ్బాలు బియటకు కనిపించకుండా ఆకులమధ్యన కొమ్మలకు కట్టబడి ఉన్నాయి. గాలి వీచినప్పుడల్లా ఆ డబ్బాలు ఒకదాని కొకటి కొట్టుకొని శబ్దం అయ్యేది. ఈ శబ్దాన్నే దయ్యంగా ప్రచారం చేశారు. ఒకొక్కప్పుడు శతృత్వం ఉన్నవాళ్లు మనుషులద్వారా ఇళ్లమీద రాళ్లువేయించడం, భాస్వరం పెట్టించి బట్టలు తగుల బెట్టించడం మొదలైన పనులు చేయిస్తూ ఉంటారు. సత్యాన్వేషణా దృష్టి లేనివారు, దయ్యాల మూఢనమ్మకానికి లోబడినవారు వీటన్నింటిని దయ్యాలుగా తీసుకుంటారు. కాని చయ్యాలు అని చెప్పబడే దేన్నయినా సరే సూక్ష్మంగా పరిశీలించి, పరిశోధిస్తే ఏదీ పరీక్షకు నిలవదు. వాటిలో భ్రమగాని. మోసంగానీ ఇమిడి ఉంటుంది. స్మశానంలో చయ్యాలుంటా యనే నమ్మకానికి కారణం మృతదేహాలను అక్కడ పాతిపెట్టడమో తగులబెట్టడమో జరగడమే. ఫలానా స్థలం స్మశానము అని తెలిస్తేనే అక్కడ దయ్యాలున్నాయని భయంకలుగుతుంది. తెలియకపోతే ఆ భయం కలగదు. అందుకే "ఉన్నఊరువారికి కాటిభయం, పొరుగూరు వారికి ఏటి భయం" అనే వాడుక కూడా వచ్చింది. యదార్థానికి దయ్యాలంటూ ఏవీలేవు.

జ్యోతిష్యము, హస్తసాముద్రికము

జ్యోతిష్యము, హస్తసాముద్రికము, అంకెల అదృష్టము వంటివి పెద్ద మూఢనమ్మకాలు.

మానవుడికి సహజంగానే భవిష్యత్తులో ఏమి జరుగబోతోందో తెలుసుకోవాలనే కోర్కె ఉంది. దానిని ఆధారం చేసుకొని ముందు జరగ బోయే విషయాలు చెప్పడం ఒక 'కళ' గా ఒక "శాస్త్రం"గా రూపొందిం చారు. గ్రహాల గమనంగాని హస్తరేఖల నిర్మాణంగాని, వివిధ అంకెల పొందికగాని భవిష్యత్తుని లేదా మానవ ప్రవర్తనను నిర్ణయిస్తున్నాయను కోవడం దీనికి మూలం.

ఈ విధంగా మానవ ప్రవర్తన అంతా ముందుగానే నిర్ణయమై పోయి ఉందా? అనేది ప్రశ్న. అలా నిర్ణయమై ఉంటే మానవ కృషికి, పురుష ప్రయత్నానికి అర్థం లేదు. అప్పుడు ఒకవ్యక్తికి జబ్బు చేస్తే ఆ వ్యక్తి జబ్బునుంచి కోలుకుంటాడో, కోలుకోడో గ్రహాలబట్టి, హస్త రేఖలబట్టి, అతని జీవితానికి సంబంధించిన అంకెలబట్టి లేదా అతను జన్మించిన సమయం బట్టి నిర్ణయమైపోయి ఉంటే ఇక అతనికి వైద్యం చేయించడం అనవసరం. వైద్య విధానాలు ఆస్పత్రులు, వైద్యులుచేసేది ఏమీ లేదు. అలాగే ఏ వ్యక్తి గురించైనా అతని ప్రవర్తనంతా ముందుగా నిర్ణయమైపోయి ఉంటే ఇక మానవ ప్రయత్నం ఏమిటి?

ఒకవేళ వ్యక్తి జీవిత సంఘటనలన్నీ గ్రహగమనాలవల్ల, హస్త రేఖల వల్ల, అంకెల పొందిక వల్ల నిర్ణయింపబడి ఉన్నా ఆ నిర్ణయాలను తన పురుష ప్రయత్నంతో, సంఘటితకృషితో మానవుడు మార్చుకోగలడు అంటే మానవ ప్రయత్నానిదే ఆధిక్యత గాని, నిర్ణయింపబడి ఉండడానికి ప్రాధాన్యత లేదు. అప్పుడు భవిష్యత్తు ఏమి నిర్ణయింపబడి ఉన్నది అనే దాని కంటే సమాజోపయోగకరంగా వ్యక్తి ప్రవర్తనను ఎలా తీర్చి దిద్దుకోగలడు? అందుకు అతనికి అవసరమైన శక్తిని ఎలా అభివృద్ధి చేయగలం అనేదే ప్రాముఖ్యత వహించాలి. గ్రహాల యానం మానవ ప్రవర్తనను నిర్ణయిస్తాయనుకున్నా మానవ ప్రయత్న ప్రభావంవల్ల గ్రహాలు చేసిన నిర్ణయాలు మార్చివేయ వచ్చు. హస్త రేఖల బట్టి మానవుని నిత్యజీవితం నిర్ణయింపబడి ఉంచనుకున్నా మానవ ప్రయత్నం వల్ల హస్తరేఖల ప్రభావాన్ని వమ్ము చేయవచ్చు. అలాగే అంకెల పొందిక కనుక మనం ఎలా ప్రవర్తించాలో నిర్ధారించి ఉంటే మన చైతన్యయుత కృషివల్ల మనము కోరిన రీతిగా మన జీవితాలను మలచుకోవచ్చు.

ఈ విధంగా చూసినప్పుడు గ్రహాలయానం, హస్తరేఖలు, అంకెల పొందిక మానవ జీవితంమీద "ప్రభావం వేస్తున్నా" యనుకోవడం మానవుని అసమర్థతకు నిదర్శనం. సూర్యుని వెలుతురు మానవ జీవితా

నికి ఉపయోగంగా ఉండవచ్చు. అంత మాత్రాన మానవ ప్రవర్తన అంతా సూచ్యని వల్ల నిర్ణయమై పోయించనుకోవడం మౌఢ్యం తప్ప మరేమీ కాదు.

జ్యోతిష్యం బట్టి, హస్తరేఖల బట్టి, అంకెల పొందిక బట్టి భవిష్యత్తు చెబుతున్నామనే వారు నిజానికి వాటినిబట్టి చెప్పటం లేదు. సమాజంలోని ఆర్థిక, సాంఘిక రాజకీయ ఉచ్చమాలను, ప్రభావాలను పరిశీలించి వీటి పరస్పర పొందికలో భవిష్యత్తు ఇలాగ ఉండగలదు అని ఊహతో అంచనా వేస్తున్నారు. ఈ అంచనాలు ఒకొక్కప్పుడు యదార్థం కావచ్చు. మరొకప్పుడు తప్పుకావచ్చు. ఇవి అంచనాలేగాని మానవేతర ప్రభావాల చేత నిర్ణయింపబడిన విషయాలు కావు. అందుచేతనే ఎంత పేరుపొందిన జ్యోతిష్కుడు చెప్పినవైనా అతను చెప్పిన మొత్తం అన్ని విషయాలను పరిశీలిస్తే యదార్థమైనవి చాలా తక్కువ. తప్పు అయినవే ఎక్కువ. ముందునుంచి ఇవన్నీ నిర్ణయింప బడినవే అయితే ఇవి ఎందుకు తప్పి పోవాలి?

ఒక హస్తసాముద్రికుడు ఒకవ్యక్తి చేతి రేఖలుచూసి అతని భవిష్యత్తు ఎలా ఉండగలదో చెప్పాడట. కాని సంఘటనలన్ని అతను చెప్పిన దానికి విన్నంగా జరిగాయి. అప్పుడావ్యక్తి ఆ హస్తసాముద్రికుని దగ్గరకువెళ్లి ఇదేమిటి ఇలా జరిగాయి అని అడిగాడట. అప్పుడా హస్తసాముద్రికుడు ఇలా సమాధానం చెప్పాడట: నీ చేతి రేఖలబట్టి నేను చెప్పినట్లే జరిగి ఉండవల్సింది. కాని దైవనిర్ణయం వేరుగా జరిగింది. ఏం చేస్తాం? అని అన్నాడట. రేఖల బట్టే అంతా జరుగుతుందని అనుకున్నా దేవునిపై ఉన్న మూఢవిశ్వాసం బట్టి దైవనిర్ణయం అనగానే మాట్లాడకుండా ఊరుకున్నాడు. అంతేగాని హస్తరేఖలకి దైవనిర్ణయానికి ఘర్షణ ఉందా? హస్తరేఖలబట్టే భవిష్యత్తు నిర్ణయింప బడుతుంది అని అనుకున్నప్పుడు దైవనిర్ణయం వేరే ఉంటే హస్తరేఖల బట్టి ఏమీ నిర్ణయం జరగనట్లేగదా? ఇలాంటి ప్రశ్నలు వేసుకుంటే వీటి బండారం బయట పడుతుంది.

లగ్నాల గురించికూడా ఇలాగే ఉంటుంది. ఒకపురోహితుడు ఒక కుటుంబంలో వివాహానికి లగ్నం పెట్టాడు. ఆ లగ్నంప్రకారమే వివాహం జరిగింది. కాని త్వరలోనే ఆ వధువు విధవ అయింది. దానికి ఆ పురోహితుడు "నేను అతి జాగ్రత్తగా లగ్నంపెట్టాను. కాని విధివ్రాత ఎవరు తప్పించగలరు" అని అన్నాడు. దీన్నిబట్టి లగ్నానికి బలం ఉంటే వేరే విధివ్రాత యేమిటి? విధివ్రాతకే బలంఉంటే ఇక లగ్నానికి విలువ ఏమిటి? అనే ప్రశ్నలు వస్తాయి.

అందుచేత జ్యోతిష్యంగాని, హస్తసాముద్రికంగాని, అంకెల పొందికగాని, లగ్నాలు, ముహూర్తాలుగాని మానవుడు స్వీయ సంతృప్తికోసం ఊహించి ఏర్పరచుకున్నవేగాని వీటికి బలమూలేదు, అర్థమూలేదు. అందుచేతనే ఒకదానికీ, మరొకదానికీ పొంచిక కుదరడం లేదు. మానవ జీవితంలో విషయాలను ఎంచుకునే స్వేచ్ఛ అనునిత్యం ప్రత్యక్షంగా కనబడుతోందిగనుక ఇది ఇలా జరిగి తీరాలి అని ఏదీ నిర్ణయింపబడిలేదు. ఒకవేళ అలా నిర్ణయింపబడి ఉంది అనుకున్నా ఆ నిర్ణయాన్ని కాచని మరొకరకంగా పనులు చేయడంలో పురుష ప్రయత్నమూ, స్వేచ్ఛా, చొరవ, ఇంగిత జ్ఞానము కనబడుతున్నాయి. భవిష్యత్తుగురించి చెప్పేవన్నీ ఊహించి చెప్పేవేతప్ప యదార్థానికి ఏదీ మునుపు నుంచే నిర్ణయింపబడిలేదు. కనుక ఇవన్నీ అబద్ధాలు.

అయితే, మానవుడు పూర్వ సూచనలనుబట్టి సంఘటనలను, విషయాలను కలుపుకుంటాడు. ఎలాగంటే ఎవరైనా ఇవాళ నీకు పని అయ్యేట్లులేదు అని అంటే మనుష్యులో అదే పని చేస్తుంది. సంతృప్తి ఉండదు. పని అవడం లేదనీ పని అయ్యేట్లు లేదనీ ఆరాటపడతాడు. ఏ చిన్న అడ్డంకివచ్చినా, "ఇవాళ నాకు పనిఅవదని చెప్పేరుగదా అందుకే ఈ అడ్డంకులన్నీ వస్తున్నాయి" అనుకుంటాడు. అలాకాక "ఇవాళ నీ పని తప్పక అవుతుంది" అని చెబితే ఎన్ని అడ్డంకులు వచ్చినా "పని అవుతుందని చెప్పారు కనుక ముందు ఏ అడ్డంకులు వచ్చినా,

చివరకు పని అవుతుంది" అనుకుని ఉత్సాహంతో పని చేస్తాడు. ఇలా సూచనబట్టి విషయాలలో ఆ సూచనకు సరిపోయినవి మాత్రమే ఏరుకుని కలుపుకుంటాడు. మిగిలిన వాటిని వదిలి వేస్తాడు. ఎప్పటికప్పుడు సూచనబట్టి కావలసినవి తీసుకుని మిగిలినవి వదిలి పేయడంవల్ల సూచన ప్రకారమే అది జరిగినట్లు కనబడుతుంది. ఇంతకంటే ఇందులో ప్రత్యేకత ఏమీ లేదు.

నిప్పులోద నడక

దైవ నమ్మకానికి నిప్పులోన నడవటానికీ కూడా చాలా మతాల్లో ముడిపెట్టారు. ఇస్లాం మతంలో పీర్లపుచ్చుకొని నిప్పులోన నడుస్తారు. హిందూమతంలోకూడా అగ్నిపరీక్ష అనే ఆచారంఉంది. ఆదిమ జాతుల సాంప్రదాయాల్లోకూడా నిప్పులోనడక దైవశక్తితో ముడిపెట్టబడినది.

యదార్థానికి నిప్పులోన నడవడానికీ, దైవమహిమలకూ ఏమీ సంబంధంలేదు. నిప్పులోన ఎవరైనా నడవవచ్చు. ఒకటి, రెండు బిళ్ల కర్రలు రెండు, మూడడుగుల వెడల్పున, ఆరు, ఏడు అడుగుల పొడవునా రెండడుగులు లోతునా తీసిన గోతిలోపేసి నేలమట్టంవరకు వచ్చేట్లుగా చూసి చాలా కర్రను రెండు, మూడుగంటలు కాలనివ్వాలి. కర్రలు బాగా కాలి ఎర్రటి నిప్పుగా తయారవుతుంది. అలా కణకణ మండే ఎర్రటి నిప్పులోద మనిషి నడిస్తే ఏమీకాదు. నిప్పులోన మనిషి నిలబడకూడదు. అడుగుతీసి అడుగు వేసుకుంటూ నడిచి వెళ్ళిపోవాలి. అప్పుడు నిప్పు కాలదు.

దీనికి కారణం మన చర్మంలో ఎప్పుడూ కొంత నీరు ఉంటుంది. బాగా కాలిన నిప్పులోన అడుగువేయగానే చర్మంలోని నీరు ఒక్కసారి ఆవిరిపొరగా మారి క్రిందికి, నిప్పుకూపధ్య సన్నటి అడ్డుపొరగా పని చేస్తుంది. కర్రలు సరిగా కాలకపోతే కాళ్లు కాలతాయి. బొగ్గులు మళ్లా కొంతమంది నడిచిన తర్వాత మసి అయిపోయినా కాలు కాలుతుంది.

దైవం పేరిట నడిచేవాళ్లు కాళ్ళు కడుక్కోవడంకూడా చేస్తారు. ఆ తడివల్ల ఆవిరిపొర బాగా తయారౌతుంది. నిప్పులమీద ఎవరైనా నడవవచ్చు. నిప్పు మీద నడవడానికీ దైవమహిమకూ ఏమీ సంబంధంలేదు.

మంత్రాలు

మంత్రాలు, ఆశీర్వచనాలు, శాపనార్థాలు మొదలైనవన్నీ కూడా చిరకాలంగా వస్తూన్న మూఢనమ్మకాలు మాత్రమే.

మంత్రం అంటే అందులో ఏవేవో రహస్యశక్తులు ఇమిడి ఉన్నాయనీ ఆ శక్తులు పనిచేస్తాయనీ అర్థం. ఆశీర్వచనాలు, శాపనార్థాలుకూడా ఇంతే. మాటకు శక్తిఉంది. అర్థశక్తి, శబ్దశక్తి. మాటల అర్థాలద్వారా కొన్నికొన్ని భావనలు ఇతరులకు తెలియపరచి వారిని ఉత్తేజితులను జేసి కార్యోన్ముఖుల్ని చేయవచ్చు. మాటకుగల ఈ అర్థశక్తిలో అతీతమైనది ఏమీలేదు. అది ప్రత్యక్షంగా కనపడేదే. ఇక రెండవది శబ్దశక్తి, కొన్ని కొన్ని శబ్దాలు మధురంగా ఉండి ఆహ్లాదాన్ని కలుగజేస్తాయి. మరికొన్ని శబ్దాలు కర్కశంగా ఉండి మానవుణ్ణి చికాకు పరుస్తాయి. ఇంకొన్ని శబ్దాలు భీకరంగా ఉండి మానవుణ్ణి భయకంపితుణ్ణి చేస్తాయి. అయితే పూర్తి చెవిటివాడికి ఈ శబ్దశక్తితో ప్రమేయమేలేదు. ఏవ్యక్తి అయినా ఆ శబ్దాన్ని విని స్వీకరించగలిగినప్పుడే దానిప్రభావం ఉంటుంది. దీంట్లోకూడా అలౌకికమైనది, అతీతమైనది ఏమీలేదు. కనుక అర్థశక్తికి, శబ్దశక్తికి మించి మంత్రాలు, శాపనార్థాలు ఉండడానికి వీలులేదు. అవి ఏవయినా ఉంటే అర్థశక్తికి, శబ్దశక్తికి మించి నిర్ధారణకు నిలవాలి. అవి ఏవీ అలా నిర్ధారణకు నిలవడంలేదు. కనుక మంత్రాలు, ఆశీర్వాదాలు, శాపాలు వాటిని నమ్మినవారిని మానసికంగా ఉత్తేజ పరచడానికో, భయపెట్టడానికో తోడ్పడతాయితప్ప వాటిని నమ్మనివారికి అవి యదార్థ నిర్ధారణకు నిలవవు.

పునర్జన్మ

దయ్యాల వలెనే పునర్జన్మ అనే విశ్వాసంకూడా ఆత్మమీద ఆధార పడిఉంది. ఈ పునర్జన్మ అనే నమ్మకం కేవలం భారత దేశంలోనే ఉంది. భారత దేశంలో పుట్టిన హిందూ. జైన, బౌద్ధ మతాలలోనే ఉంది. క్రైస్తవ మతంలోగాని, ఇస్లాం మతంలోగాని. ప్రాచీన మానవుల మత విశ్వాసాలలోగాని పునర్జన్మ అనే విశ్వాసం లేదు. ఆయా మతాలలో కేవలం స్వర్గం నరకం అనే నమ్మకాలే ఉన్నాయి. చనిపోయిన వారి ఆత్మలపై దేవుడు తీర్పు ఇస్తాడని వారు చేసిన మంచి చెడ్డలను బట్టి స్వర్గానికో, నరకానికో పంపుతాడని వారు నమ్ముతారు. భారతదేశంలో జన్మించిన మతాలు జన్మ పరంపరలో నమ్ముతాయి. క్రింపటి జన్మలోని మంచి చెడ్డల బట్టి ఆ జన్మలోని మృత శరీరపు ఆత్మ ఈ జన్మలోని బాహ్య కాయంలో ప్రవేశించిందని, అలాగే ఈ జన్మలోని మంచి చెడ్డలను బట్టి వచ్చే జన్మ ఉంటుందని వీరు నమ్ముతారు. తిరిగి జన్మ ఎత్తకుండా జన్మ రాహిత్యం సాధించడం మోక్షమని, అలా జన్మరాహిత్యం సాధించిన జీవాత్మ పరమాత్మలో లీనమై పోతుందని వారి నమ్మకం.

అసలు ఆత్మ అనేదే అబద్ధమైనప్పుడు పునర్జన్మకు ఆస్కారమే లేదు. పూర్వకాలంలో ఇంత జనాభా లేనప్పుడు ఈ ఆత్మలన్నీ ఎక్కడ ఉండేవి? ఒకొక్క శరీరంలో ఒకొక్క ఆత్మ ఉండాలంటే ఈ ఆత్మలకు ప్రత్యేక ప్రతిపత్తి ఉండి దేనికది విడిగా ఉంటుందా లేక ఇవన్నీ ఏదైనా ఒక పెద్దదానిలో భాగంగా కలసిపోయి మళ్లా అందులోంచి చిన్న చిన్న ముక్కలుగా బయటికివచ్చి శరీరాలలో ప్రవేశిస్తాయా? ఒకవేళ ఈ ఆత్మలన్నీ విడివిడిగా ఉండేట్లయితే ఎప్పటికప్పుడు పెరిగే జన సంఖ్యను బట్టి పశుపక్ష్యాదుల సంఖ్యనుబట్టి మొట్ట మొదటిసారిగా బాహ్యశరీరంలో ప్రవేశించే ఆత్మలు కొన్ని ఉంటాయా లేక మృతి చెందిన శరీరానికి అంత్యక్రియలు జరపడంతో ఆ శరీరం నాశనమైపోగా ఈ ఆత్మలన్నీ పెద్ద తటాకంలోని నీళ్లు కలసిపోయినట్లు ఏదైనా ఒక దానిలో కలసిపోయి ఉండి

నట్లయితే ఆత్మల విడివిడి అస్తిత్వం పోతుందిగదా. అప్పుడు నీళ్లు కలిసి పోయినట్లుగా ఈ ఆత్మలన్నీ కలిసిపోయినప్పుడు వచరి పెట్టేవేసిన జన్మలో చేసిన మంచి చెడ్డలు అన్ని ఆత్మలవి కలగా పులగంగా కలిసి పోవా? అలా కలిసిపోయినప్పుడు ప్రత్యేక అస్తిత్వం ఎలా మిగులుతుంది? ప్రత్యేక అస్తిత్వం మిగలనప్పుడు పూర్వజన్మ కర్మనుబట్టి మళ్ళీ జన్మ రావడమనేది ఎలా సాధ్యం? ఇలా మనం ప్రశ్నించుకుంటే ఈ పునర్జన్మ సిద్ధాంతం యదార్థ పరిశీలనకు నిలవదు.


పునర్జన్మ కేసులు అని చెప్పబడే వాటిని లోతుగా పరిశీలిస్తే అవి ఏవీ నిర్ధారణకు నిలవడంలేదు. పునర్జన్మ గురించిన కథలు, ప్రచారాలు విన్నవాడు ఒక్కొక్కప్పుడు తమ "పూర్వజన్మ"గురించి ఊహించుకుంటూ ఏవేవో అల్లుకుంటాడు. ఈ అల్లుకోవడంలో కొన్ని చూసినవి కొన్ని విన్నవి ఆధారం చేసుకుంటాడు. పునర్జన్మ యదార్థమని నిజాయితీగా నమ్ముతూ ఉండటంచేత తాము ఊహించుకున్న ఊహలన్నీ వీటికి అంట గట్టేస్తాడు. మరికొన్ని సందర్భాలలో మోసం ఉంటుంది. వ్యక్తులకు బాగా శిక్షణయిచ్చి వాటిని పునర్జన్మ కేసులుగా సమాజంముందు పెట్టడానికి ప్రయత్నిస్తాడు. అయితే వీటిని నిశిత పరిశీలనకు లోను చేసేసరికి ఇవి ఏవీ నిలవడం లేదు. అయితే చిరకాలంగా ఇవన్నీ ప్రచారంలో ఉండటం చేతనో, విద్యాధికులుకూడా మౌఢ్య ప్రచారానికి బలియైపోవడం చేతనో వీటికి మరింత ప్రచారం లభిస్తోంది. అందుచేతనే యదార్థ నిరూపణకు రాకుండా వీటిని నమ్మితేనే ఉంటాయి, లేకపోతే లేదు అని ఎక్కువగా అంటున్నారు. ఏమాత్రం హేతు భావనతో ఆలోచించినా, యదార్థ పరిశీలనకు పూనుకున్నా పునర్జన్మ లేదని తేలిపోతుంది.

5

ప్రాచీన భారతదేశంలో నాస్తిక భావాలు

మానవుడు ఎంత పురాతనుడో నాస్తికత్వం కూడా అంత పురాతన మైనది. ప్రతీ సమాజంలోనూ, ప్రతి యుగంలోనూ మానవులను అణచి వేసే శక్తులపై, వ్యవస్థలపై నాస్తిక భావాలు తిరుగుబాటు చేశాయి. ఆయా భావాలవల్ల నాస్తికోద్యమం మూడడుగులు ముందుకు వేసినా, నాస్తికులను సమకాలీన సమాజం చిత్రహింసలకు గురిచేసింది. నాస్తికుల గ్రంధాలను తగులబెట్టారు. నాస్తిక భావాలకు ఏ కోశానా ప్రచారం రాకూడదని గట్టి ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ నాస్తిక పురోగమనం ఆగలేదు.

ప్రాచీన నాస్తికులు ఏమి చెప్పారో మనకు స్పష్టంగా తెలియదు. వారి పుస్తకాలు లేదా రచనలు మనకు మిగులలేదు. వారిని విమర్శించిన ఆస్తిక గ్రంధాలలోనే వారు చెప్పిన విషయాలు విమర్శకు గురియై మిగిలాయి. ఆ కొద్దిగా లభించిన ఆధారాలే నేడు ఎంతో శక్తివంత మైనవిగా కనిపిస్తున్నాయి. అక్కడక్కడ కనిపించేవాటిని మనం ఒక చోట చేర్చిచూస్తే వాటి ప్రతిభ కనబడుతోంది.



అమెరికన్ నాస్తికుడు
జోసెఫ్ లూయిస్
(1889—1968)



శ్రీలంక నాస్తికుడు,
హేతువాది
ఏ. టి. కోవూర్
(1898—)

ఈ విధంగా చార్వాకులు నిరీశ్వరవాములేకాక భౌతికవాదులుగాను, సాంఘిక విప్లవకారులుగాను మనకు కనబడతారు. వీరు లోక హితాన్ని మాత్రమే కాంక్షించారుగనుక వీరిని లోకాయతులు అనికూడా అంటూ ఉంటారు.

రాజరికము, పౌరోహిత్యవ్యవస్థా కలసి సమాజంలో బానిసత్వాన్ని పోషిస్తున్న ఆరోజుల్లో చార్వాకుల ప్రభావంవల్ల బానిసలు తిరగబడ సాగారు.

ఇన్ని విధాలుగా దైవభావాన్ని, మత వ్యవస్థను, వైదీక కర్మ కాండను, బానిస విధానాన్ని నిరాకరించిన చార్వాకులను అనాటి రాజకీయ సామాజిక వ్యవస్థలో చిత్రహింసలకు గురిచేసి, చారిని, వారి భావాలను నిశ్శేషం చేయుటకు ప్రయత్నం జరిగిందంటే ఆశ్చర్యంలేదు. భారతీయ సమాజంలో స్పష్టమైన నాస్తిక భావాలను ప్రకటించిన తొలి నాస్తికులు చార్వాకులు.

సాంఖ్యవాదం

వైదిక మతాన్ని, విషయాలను పూర్తిగా నిరాకరించకుండానే, అందులో భాగంగానే కొన్ని చర్చనాలు రూపొందాయి. ముఖ్యంగా సాంఖ్యవాదం ఒక ప్రత్యేకతను కలిగిఉంది. సాంఖ్యవాదానికి మూల పురుషుడు కపిలుడు. సాంఖ్యవాదం దైవభావాన్ని పూర్తిగా నిరాకరించింది. ప్రపంచాని కంతటికీ మూలం రెండు శక్తులని, ఒకటి ప్రకృతి, రెండు పురుషుడు అని సాంఖ్యం ప్రతిపాదించింది. ప్రకృతి పురుషుల కలయిక వల్ల ఏర్పడే పరిణామమే ఈ ప్రపంచమని వారంటారు. పురుషుడు చైతన్యమని, పురుషుని చైతన్యంవల్లనే ప్రకృతి కదలి, పరిణామం ప్రారంభమవుతుందని సాంఖ్యులు చెప్పారు. ప్రత్యక్ష ప్రమాణానికే హెచ్చు ప్రాధాన్యత ఇచ్చి, ఆ తర్వాత అనుమాన శబ్దప్రమాణాలను స్వీకరించారు. ప్రతి వస్తువుకు ఒక స్వభావం ఉన్నదనిన్నీ, అది పరిణామం చెందుతూ ఉంటుందని వీరు వివరించారు.

చార్వాకులవలెనే సాంఖ్యులుకూడా సమాజం కోపానికి గురి యైనట్లు కనబడుతూంది. చార్వాకులవలె సాంఖ్యులు వైదిక మతాన్ని పూర్తిగా నిరాకరించకపోయినా తమ జ్ఞానమార్గం ద్వారానూ, ప్రత్యక్ష ప్రమాణానికి ఎక్కువ విలువ ఇవ్వడం ద్వారాను దైవ భావాన్నిపూర్తిగా కొట్టివేశారు. ఏదో ఒక విధంగా మళ్లీ దైవ భావాన్ని తెచ్చి ప్రజలమీద రుద్దుటకుగాను సాంఖ్యవాదాన్ని ప్రచారంకాకుండా అడ్డు తగిలారు. కపిలుని సాంఖ్య నిరీశ్వరసాంఖ్య.కాని ఆతర్వాత కపిలుడు ప్రతిపాదించిన ప్రకృతి పురుషులపైన సృష్టికర్త, సర్వాంతర్యామి, అవాఙ్మానస గోచరుడు, అతీంద్రియశక్తి, ఆది మధ్యాంతరహితుడు ఉన్నాడని ఈశ్వరవాదాన్ని జొప్పించారు. దీనివల్ల సాంఖ్యవాద మౌలిక సిద్ధాంతాలే తారుమారు అయినాయి. ఈ విధంగా కపిలుడు ప్రతిపాదించిన సాంఖ్య నిరీశ్వర సాంఖ్యగాను, ఆ తర్వాత దానిని భ్రష్టంచేసి ఏదో ఒక విధంగా తిరిగి ఈశ్వరునికి ప్రాధాన్యత ఇచ్చిన సాంఖ్య సేశ్వర సాంఖ్యగాను గుర్తించ బడ్డాయి. తర్వాత తర్వాత సేశ్వర సాంఖ్యకే ప్రచారం లభించింది. కపిలుడు ప్రతిపాదించిన నిరీశ్వర సాంఖ్య అణచివేయబడింది.

వైశేషిక, న్యాయ దర్శనాలు

వైశేషిక సిద్ధాంతాన్ని కణాదుడు ప్రతిపాదించాడు. ఈ ప్రపంచాని కంతకూ అణువులు మూలమని, అణువులు అవిభాజ్యమని, అవి ఎవరి చేతా సృష్టింపబడలేవని, భూమి, నీరు, తేజస్సు గాలి - ఇవి మూల భూతాలని, ఈ మూల భూతాలు అణురూపంలో నిత్యము, శాశ్వతము అని వైశేషికులు చెప్పారు.

వైశేషికులు అణువుకు ఇచ్చిన ప్రాధాన్యత దృష్ట్యా వీరిని విమర్శ కులు "అణుభుక్కులు" (అంటే అణువులను తినేవారు) అని హేళన చేశారు. అణువాదం ఎడగ వైశేషికుల పట్టుదలను తెలిపే సంఘటన ఒకటి ప్రచారంలో ఉంది. ఒక వైశేషిక తత్వవేత్త మరణావస్థలోఉన్నా డట. చివరి క్షణాలలో ఉండడంచేత పోనీ ఇప్పుడైనా ఈశ్వరుని స్మరిం

చుకోమని కొంతమంది చెప్పారట. అందుకా వైశేషిక తత్వవేత్త ఎదురు తిరిగి ప్రపంచానికి మూలం అణువులే గనుక వాటినే తాను స్మరించగల నని చెప్పి "పీపీలికః పీపీలికః" (అంటే పరమాణువు) అని స్మరిస్తూ మరణించాడట.

వైశేషిక తత్వానికి అనుబంధంగా న్యాయవర్శనం వచ్చింది. ఈ న్యాయవర్శనాన్ని గౌతముడు అనే ఋషి ప్రతిపాదించాడు. న్యాయం ప్రధానంగా వైశేషిక సూత్రాలనే అంగీకరించినా, తర్కానికే ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చింది. న్యాయ సిద్ధాంతం కూడా ఎన్ని తార్కిక పద్ధతు లను ప్రవేశపెట్టినా చివరకు ప్రత్యక్ష ప్రమాణమే ఉత్తమ జ్ఞానసంపాదనా మార్గమని అంగీకరించింది.

వైశేషిక న్యాయ సాంఖ్యవలెనే హేతువాద నాస్తికభావాలను స్వీక రించడం అవ్వటి సమాజం సహించలేక పోయింది. అందుచేతనే సాంఖ్యంలో ప్రవేశపెట్టినట్లే వైశేషిక, న్యాయ వర్శనాలలోకూడా ఈశ్వర భావాన్ని ప్రవేశపెట్టి వాటి అసలు రూపాన్ని మార్చివేశారు.

బౌద్ధమతం

భారతదేశంలో బౌద్ధ, జైన మతాలనుకూడా నిరీశ్వరవాదంగా పరిగణిస్తారు. బౌద్ధ, జైన మతాలనాటికి భారతీయసమాజం వైదికమతపు గుప్పెట్లో, వైదిక సాంప్రదాయాల జంతుబలులతో కూడిన కర్మకాండ ఇనుప కొగిలిలో నలిగిపోతోంది. వర్ణవ్యవస్థ పని విభజనగా ప్రారంభ మైనా శూద్రులు, పంచములపై బ్రాహ్మణ, క్షత్రియుల నిరంకుశ అధికారం ఎక్కువ కాసాగింది. అటువంటి స్థితిలో సిద్ధార్థుడు తన త్యాగమయ జీవితం ద్వారా జ్ఞానాన్ని సంపాదించి బౌద్ధాన్ని ప్రతిష్ఠా పించాడు. జీవితమంతా దుఃఖమయమని, ఈ దుఃఖానికి కోర్కెలు కారణ మని, కోర్కెలను తగ్గించుకోవడం ద్వారా దుఃఖాన్ని నిరోధించవచ్చునని బుద్ధుడు చెప్పాడు. అంతేకాక నిత్యజీవితంలోని యదార్థ పరిస్థితుల

పరిష్కారానికి లోకాతీతశక్తులను ప్రార్థించడం, వాటి గురించి అంతంలేని చర్చలు చేయడం వ్యర్థమని బుద్ధుడు బోధించాడు. మానవుడు తన భవిష్యత్తుకి తానే అధినేత అని, స్వశక్తితో, స్వయంకృషితో తమ శక్తిని పెంచుకోవడం ద్వారా గొప్ప ఆచరణ సాధించగలడని కూడా బుద్ధుడు బోధించాడు. అందుచేత కనపడనివాటి గురించి, నిరూపించలేనివాటి గురించి వృధాచర్చలతో కాలయాపన చేయక తోటిమానవుల దుఃఖాన్ని తగ్గించుటకు కృషిచేయడం మానవుల కర్తవ్యమని బుద్ధుడు బోధించాడు.

అందుచేతనే ఒక ప్రక్క బౌద్ధులు జంతుబలులను వైదిక కర్మ, కాంచను వ్యతిరేకించారు. మరొకప్రక్క అన్ని కులాలవారిని సమానంగా చూశారు. బుద్ధునికాలంనాటికే అస్పృశ్యత పెరిగిపోయింది. అంటరానివారు బానిసలుగా చూడబడేవారు. వారి బానిసత్వ విముక్తికోసం కూడా బౌద్ధులు కృషిచేశారు. అంటరాని వారినికూడా తమ మతంలో సమానంగా చూశారు. (బహుశః ఇదే కారణం కావచ్చు ఆధునికకాలంలో డాక్టరు అంబేద్కర్ బౌద్ధం స్వీకరించుటకు.)

బౌద్ధం ప్రాయికంగా అనాత్మవాదం. కాని రానురాను హిందూ మతం బౌద్ధాన్నికూడా భ్రష్టం చేసింది. హీన, మహాయాన శాఖలుగా బౌద్ధం చీలిపోయింది. మహాయానశాఖ విగ్రహారాధనను ప్రవేశపెట్టింది. హీనయాన మతస్తులు బుద్ధుని వాస్తవికవాదాన్ని స్వీకరించగా మహాయాన మతస్తులు ఆ కాస్తకూడా త్రోసివేశారు. బుద్ధుని బోధలకు వ్యతిరేకంగా విగ్రహారాధన రావడమేగాక కర్మసిద్ధాంతానికి జన్మపరంపరల కర్మ శృంఖలగా అర్థం చెప్పి హిందూమతంలోని పునర్జన్మ వాదాన్ని కూడా బౌద్ధమతంలోనికి లాక్కొచ్చారు.

మధ్యలో బౌద్ధానికి రాజాదరణ లభించినా, రాజాదరణ సమయంలో బౌద్ధం దేశమంతటా విరివిగా వ్యాపించినా చివరకు శంకరుని అద్వైత వాదం ప్రాబల్యం సంపాదించి బౌద్ధాన్ని భారతదేశంలో లేకుండాచేసింది.

చార్వాక, సాంఖ్య, వైశేషిక, న్యాయ సిద్ధాంతాలకు ఏనాడూ రాజాదరణ లభించలేదు. అందుచేత అవి దేశంలో ప్రాచుర్యం పొందలేదు. కాని రాజాదరణ సంపాదించుకున్న బౌద్ధంకూడా నిలద్రొక్కుకోలేకపోయింది. హింసామయం దేశంలో వచ్చిన మార్పులను స్వీకరించలేకపోయినది. వాటిని నిరాకరించింది. తిరిగి వైదికమతాన్నే పునఃస్థాపించింది. బౌద్ధమతం నిలద్రొక్కుకోలేకపోవడం, తిరిగి వైదికమతం ప్రాబల్యం వహించడం భారతదేశ చరిత్రలో ఒక అంధకార పర్వం. బౌద్ధం కొనసాగిఉంటే కనీసం కులతత్వం, అస్పృశ్యత పోయివుండేవి. జంతుబలులు ఆగిపోయి వుండేవి. బౌద్ధం బలహీనపడగా తిరిగి తలఎత్తిన వైదికమతం వీటన్నిటిని పకడ్బందీగా ప్రవేశపెట్టింది. దీనివల్లనే నేటికి కూడా మనం కులతత్వంతోనూ, అస్పృశ్యతతోనూ కుతకుత ఉడికిపోతున్నాం. నరబలులు, జంతుబలులతో నేటికికూడా తలఎత్తుకోలేకపోతున్నాం.

భారతదేశం బౌద్ధమతాన్ని నిరాకరించినా, మిగిలిన ఆసియాఖండమంతా బౌద్ధాన్ని ఆహ్వానించింది. అభ్యుదయ పథంవైపు ప్రయోగమించింది.

జైనమతం

జైనమతం వర్ధమాన మహావీరుని ద్వారానే ప్రపంచానికి తెలిసింది. మహావీరుడు బుద్ధుని సమకాలికుడు. పోతే జైనమతం వర్ధమాన మహావీరునితోనే ప్రారంభంకాలేదని, మహావీరునికి ముందునుంచీ ఈ సిద్ధాంతం ఉందని, మొత్తం ఇరవైనలుగురు తీర్థంకరులలో వర్ధమాన మహావీరుడు చివరివాడని జైనుల వాదన.

బౌద్ధమతం వలెనే జైనమతం కూడా వర్ణవ్యవస్థను, యజ్ఞ యాగాదులను, వైదిక కర్మకాండలోని బలులు, హింసను తీవ్రంగా వ్యతిరేకించింది. జైనులు దేవుని నిరాకరించారు. కాని ఆత్మను అంగీకరించారు. తర్వాత తర్వాత దేవునితో సమానంగా వర్ధమాన మహావీరుణ్ణి ఇతర

తీర్థంకరులను పూజించారు. ఆత్మ మనుష్యులలో మాత్రమేగాక జంతువులు, చెట్లు, జడపదార్థాలలో సహితం ఉన్నదని వీరి వాదన. అంతేకాక ఆత్మను కర్మవాదంతోను, జన్మపరంపరతోనూ కూడా ముడి పెట్టేశారు.

జైనమతం అహింసను అతి చావస్తంగా అనుసరించ పూనుకుంది. రాత్రిపూట చీకట్లో భోజనం చేస్తే పురుగులు చనిపోతాయేమోనని సూర్యాస్తమయం కాకుండానే భోజనాది కార్యక్రమాలు ముగించుకుంటారు. వ్యవసాయం కొరకు భూమిని దున్ని పంటలు పండిస్తే భూమిలోని పురుగులు చనిపోవడానికి అవకాశం ఉంది గనుక వీరు వ్యవసాయాన్ని కూడా ప్రోత్సహించలేదు. బహుశా ఇదే కారణంకావచ్చు జైనమతస్థులందరూ మనకు వర్తక వ్యాపారల్లోనే కనిపిస్తారు.

జైనమతంలోని సహనమనే సిద్ధాంతంవల్ల స్పష్టమైన అభిప్రాయాల ఏర్పాటుకు తగినంత బలం లభించలేదు. వీరి సప్తభంగి న్యాయం పంచేంద్రియ గ్రహణం ద్వారా వచ్చే ప్రత్యక్ష భౌతిక జ్ఞానాన్ని కూడా శంకించడంతో అస్పష్టతకు, అనిశ్చితవాదానికి దోహదం చేసింది.

ఒకప్పుడు కొంత రాజావరణ జైనమతానికి లభించినా అహింస యెడల గల చావస్తం, తాత్వికంగా ఏర్పడిన అనిశ్చయవాదం దీని అభివృద్ధికి అంటకాలైనాయి.

భారత దేశంలో వైదికమతం లోతుగా పాతుకొని పోవడంతో వర్ణవ్యవస్థ, వైదిక కర్మకాండ వైదికమతానికి ప్రధాన ఆధారాలు కావడంతో వైదికమతాన్ని కాదన్న వారందరూ నాస్తికులుగా పరగణింపబడ్డారు. అందుచేతనే "నాస్తికో వేదనిందకః" అనే నానుడికూడా వచ్చింది.

సాంఖ్య, వైశేషిక, న్యాయ దర్శనాలు సృష్టికర్తను అంగీకరించలేదేగాని వైదిక మతాన్ని పూర్తిగా వ్యతిరేకించలేదు. అందుచేతనే అవి హిందూమతంలో భాగంగా నాస్తిక దర్శనాలైనాయి. ఈ నాస్తిక దర్శనాలు జ్ఞానమార్గాన్ని మాత్రమే స్వీకరించుటచేత ఆచరణ గురించి శ్రద్ధ

వహించలేదు. అందుచేత సాంఖ్య, వైశేషిక, న్యాయ చర్చనాలవల్ల వైదికమత నిత్య జీవితాచరణకు ఏమీ భంగం కలుగలేదు. వైదికమతం వీటిని సహించుటకు ఇది కూడా ఒక కారణం కావచ్చు.

బౌద్ధ, జైన మతాలు ఈశ్వరుణ్ణి సృష్టికర్తగా అంగీకరించకపోవటమేగాక వైదికమతానికి ముఖ్య ఆధారాలైన వర్ణవ్యవస్థను, వైదిక కర్మకాండను నిరాకరించాయి. అందుచేత ఇవి నాస్తికాలుగా పిలువబడ్డాయి. బౌద్ధ, జైనాలలో ముఖ్యంగా బౌద్ధమతం అన్ని రంగాలలోనూ వైదికమతాన్ని సవాలు చేసింది. సామాన్య ప్రజల నిత్య జీవితాలలోనికి చొచ్చుకొనిపోయింది. అందుకే బౌద్ధాన్ని మొదట్లో తిరుకున్నా తర్వాతతీవ్రంగా వ్యతిరేకించింది వైదికమతం. చివరి రోజుల్లో ప్రజలను బౌద్ధం నుంచి మళ్ళించుటకుగాను బౌద్ధమతస్తులను చిత్రహింసలకు గురిచేసి గానుగలలో వేసి ఆడించారు.

చార్వాకులు బౌద్ధంకంటే పూర్వంవారు. సాంఖ్య, న్యాయ, వైశేషిక చర్చనాలకంటే కూడా ముందు ఉన్నవారుగా కనపడతారు. వైదికమతంలో ఆచరణలో ఎలాగూ సహనం లేదు. సిద్ధాంతరీత్యా కూడా అప్పటికి సహనం ప్రారంభంకాలేదు. బౌద్ధ జైనాలు ఏదో ఒకరీతిలో ఆత్మను అంగీకరించి ఆపైన పునర్జన్మ సిద్ధాంతానికి దాసోహమన్నాయి. కాని చార్వాకులు అలాకాదు. వారు కేవలం ప్రత్యక్ష ప్రమాణాన్నే కోరారు. దేవుడు, జీవుడు, ఆత్మ, జన్మపరంపర-వీటిన్నింటినీ వారు నిరాకరించారు. వైదికమతంలోని ఏ భాగమూ కూడా వీరిని ఇముడ్చుకోలేకపోయింది. అందుచేత చార్వాకులు మొగ్గలోనే త్రుంచివేయబడ్డారు.

ఈ విధంగా ప్రాచీన భారత దేశంలో నాస్తిక భావాలు మొలకలెత్తాయి. ముందుకు సాగాయి. తీవ్రమైన అణిచివేతకు, అసహనానికి గురైనాయి.

6

పాశ్చాత్య దేశాల్లో నాస్తికభావాలు

పాశ్చాత్య దేశాల ప్రాచీనత గ్రీకు రోమన్ నాగరికతలలో ఇమిడి వుంది. క్రైస్తవ మతానికి ముందు కొంత జూడాయిజం, దానికి ముందు స్థానికంగా దైవదేవతలలో నమ్మకాలు ఎక్కువగా ఉండేవి. అటు వంటి సమాజంలో అప్పటి మొత్తం వ్యవస్థను వ్యతిరేకించి ఆలోచించమని కోరిన వారిలో సోక్రటిసు అగ్రగణ్యుడు క్రీస్తుకు 469 సంవత్సరాలకు పూర్వం జన్మించిన సోక్రటిసు ఏథెన్సు నగరంలో భావ విప్లవాన్ని ప్రోత్సాహించాడు. అందుకే విషమిచ్చి చంపివేయబడ్డాడు.

సోక్రటీసు తర్వాత సూమారు 400 సంవత్సరాలకు ఏసుక్రీస్తు తన సమకాలీన పురాతన మతనమ్మికలను వ్యతిరేకించాడు. దేవునిలో నమ్మడం కంటే తోటి మానవుని ప్రేమించడం ముఖ్యమని అప్పటి జూడా మత నమ్మికలను వ్యతిరేకించాడు. అందుకే శిలువవేయబడ్డాడు.

గ్నాస్టిక్స్

ఏసుక్రీస్తు త్యాగాన్ని ఉపయోగించుకున్న మత పెద్దలు ఆయన పేరుమీద ఒక పెద్ద మతాన్ని స్థాపించి ప్రపంచవ్యాప్తం చేశారు. క్రైస్తవమతానికి అధిపతిగా పోప్ తయారయ్యాడు. ఆ రోజుల్లో పోప్‌ను

కాచని మానవుడు బ్రతకలేకపోయాడు. మతం అమానుషంగా మానవుణ్ణి దోపిడీ చేయసాగింది. యూరప్లోని ఏ రాజుకూడా పోపుకు ఎదురు చెప్పలేకపోయారు. అటువంటి సమయంలో 11వ శతాబ్దంలో "గ్నాస్టిక్స్" అనే పేరుతో కొంతమంది క్రైస్తవ మతంమీద తిరుగుబాటు చేశారు. మానవ శరీరంలో క్రీస్తు దేవుని కుమారుడుగా వచ్చాడనే సిద్ధాంతాన్ని వారు పూర్తిగా నిరాకరించారు.

కెథారీలు

11, 12 వ శతాబ్దాలలో ఉత్తర ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ ప్రాంతాలలో "కెథారి"అనే పేరుతో కొంతమంది పోపు అధికారంపై తిరగబడ్డారు. వీరు ముఖ్యంగా ఉత్తర ఇటలీ ఫ్రాన్స్ జర్మనీలలో ప్రాబల్యం సంపాదించారు. "కెథారీ"అంటే గ్రీకుభాషలో "పరిశుద్ధమైన" అని అర్థం. పోప్ మతాన్ని అవినీతిమయంచేశాడని పరిశుద్ధమైన మతాన్ని స్థాపించుటకు తాము కంకణం కట్టుకున్నామని కెథారీలు చెప్పారు. పోప్ ఆధిపత్యాన్ని, పోప్ మతాధికారుల అవినీతి, మోసాలను కెథారీలు తీవ్రంగా వ్యతిరేకించారు.

కెథారీలు పరిశుద్ధులు, విశ్వాసపరులు అని రెండురకాలు. విశ్వాసపరులు సాధారణ కెథారీలు. డబ్బు సమకూర్చుకోనని, రక్తపాతం జరపబోనని, మాంసం, పాలు జున్ను, కోడిగుడ్డూ తిననని, బ్రహ్మచారి జీవితం గడుపుతానని చేయి ఎత్తి ప్రతిజ్ఞ చేయడం ద్వారా ఏ విశ్వాసపరుడైనా పరిశుద్ధుడుగా మారవచ్చు. ప్రతీ విశ్వాసపరుడు జీవితాంతంలోనైనా పరిశుద్ధుడుగా మారాలని కెథారీలు ఆశిస్తారు. పరిశుద్ధుడుగా మారిన అనంతరం తన జీవితాన్ని అంతం చేసుకోవచ్చునని కెథారీల విశ్వాసం అంగీకరిస్తుంది. ఈ విధంగా పరిశుద్ధుడుగా జీవితాన్ని గడపలేమని అనుమానం ఉన్నవారు పరిశుద్ధుడుగా ప్రతిజ్ఞ తీసుకుని తర్వాలోనే ఆత్మహత్య చేసుకోవడం కెథారీలలో కనబడుతుంది. జపానుకు చెందిన షింటో మతంలోని "హరకిరి" ని ఇది పోలి ఉంది. అత్యుత్తమ నైతికస్థాయిని నెలకొల్పడం ద్వారాను, మతాధికారుల దోపిడీ విధానాలపై తీవ్రమైన పోరా

టం సలపడం ద్వారాను కెథారిజం సామాన్య ప్రజలలో బాగా పలుకుబడి సంపాదించింది. దీనితో 12వ శతాబ్దం చివరలో కెథారీలపై పోప్ "యుద్ధం" ప్రకటించవలసి వచ్చింది. కెథారీలను పోప్ నిర్దాక్షిణ్యంగా అణచివేశాడు.

అల్‌బిగెన్‌షియన్స్

కెథారీలకు సమకాలికులైన "అల్‌బిగెన్‌షియన్స్" అనే పేరు పోపు సామ్రాజ్యానికి సింహస్వప్నమైపోయింది. పోపు అధికారాన్ని, పోపు మతాధికారుల అవినీతిని, ఆడంబరాన్ని అల్‌బిగెన్‌షియన్స్ చాలా తీవ్రంగా ఖండించారు. టౌలూసే ప్రాంతంలోని అల్బీ పట్టణంలో ఈ తిరుగుబాటు ప్రారంభం కావడంతో ఈ మొత్తం తిరుగుబాటుదార్లను అల్బీ పట్టణం పేరుమీదుగా అల్‌బిగెన్‌షియన్స్ అని పిలిచారు. మార్టిన్ లూథర్‌కు ముందు పోపు ఆధిపత్యాన్ని, పోప్‌ను నియమించే రాజుల అధికారాన్ని అల్‌బిగెన్‌షియన్స్ సవాలుచేసి గడగడలాడించారు. వీరు పాతనిబంధనలను, పునర్జీవమును అంగీకరించలేదు. దీనివల్ల ఏసుక్రీస్తు మానవశరీరంలో వచ్చి పునర్బోధ చేశాడనే విషయం కూడా వీరు నిరాకరించారు. దీని ప్రభావం యూరప్ అంతటా వ్యాపించింది. అయితే వీరి రచనలు ఏవీకూడా మనకు లభ్యం కావడంలేదు. భారతదేశంలో చార్వాక గ్రంథాలను నాశనం చేసినట్లే పోప్ అదేశాలపై అల్‌బిగెన్‌షియన్స్ రచనలను పూర్తిగా నామరూపాలు లేకుండా నాశనం చేశారు. అందుకే ఐరోపా చరిత్రలో అల్‌బిగెన్‌షియన్స్ గురించి అంతగా కనిపడదు. వీరి రచనలు నాశనం చేయడమేగాదు, వేలాది అల్‌బిగెన్‌షియన్స్‌ను స్త్రీలు, పిల్లలతో సహా పోపు మూడవ ఇన్నోసెంట్ చిత్రవధలుచేసి చంపివేశారు. పోపుచేత అతిదారుణంగా ఆణచివేయబడిన మత తిరుగుబాటుదార్లు అల్‌బిగెన్‌షియన్స్.

అల్‌బిగెన్‌షియన్స్ ఇంత దారుణంగా అణచివేయబడటకు కారణం ఉంది. కన్నెగర్భము, శిలువవేత, పునరుత్థానములను వీరు కట్టు

కథలుగా వర్ణించాడు. అంతేకాక ఆత్మలు ఒక శరీరం వదలి మరొక శరీరంలోనికి ప్రవేశించగలవని, ప్రస్తుత జీవితాంతమునగాని లేక తరువాత జన్మల అనంతరంగాని ప్రతీ ఆత్మ మోక్షం పొందుతుందని వీరు విశ్వసించారు. సాంబ్రాణి, గుగ్గిలపుల వాడకం, శిలువను ఉపయోగించుట, కొందరిని "సెయింట్స్" (పరిశుద్ధులు)గా పరిగణించుట, చిన్న పిల్లలకు బాప్తిస్మము ఇచ్చుట, సమూహ ప్రార్థన, రొట్టె, ద్రాక్షరసము పైకి మామూలుగా కనిపించినా అవి ఏసు శరీరముగాను, రక్తముగాను మారినవని భావించుట మొదలైనవాటిని ఆల్బిగెన్షియన్స్ పూర్తిగా నిరాకరించారు.

వాల్డెన్సియన్స్

పోప్‌పై తిరుగుబడిన మరొక మతవ్యతిరేకుల సమూహము వాల్డెన్సియన్స్. లోయన్స్‌కు చెందిన పీటర్ వాల్డో అనే అతను 1170లో దీనిని స్థాపించినా 13వ శతాబ్దంలో గానీ ఇది తగిన బలం పుంజుకోలేదు. వీరు పోప్ కంటే ప్రగంధాన్ని మాత్రమే స్వీకరించారు. లాటిన్ భాషకే గాక స్థానిక భాషల్లో కూడా మత గ్రంధము చెప్పడానికి ఆటంకము ఉండకూడదని వీరి నమ్మకము. పోప్ వద్ద స్వర్గానికి తాళం చెవులు ఉంటాయనే వాదాన్ని కూడా వీరు సవాలు చేశారు. మతాధికారులగుటకు సమర్థత, అర్హత ఉండాలిగాని పోప్ నియామకంతో సంబంధం ఉండరాదని వీరు ప్రకటించారు. ఈ విధంగా పోప్ అధికారాన్ని పూర్తిగా నిరాకరించి తాము స్వయంగా వాల్డోనీషియన్ చర్చిని స్థాపించుకున్నారు. చర్చిలో జరగవలసిన కర్మకాండను చాలా తగ్గించివేశారు. ఈ చర్చి ఫాదరీలు నిరాడంబరంగా ఉంటూ ఆదర్శమయ జీవితాన్ని గడపసాగారు. అందుచేత వేద ప్రజానీకంలోకి వాల్డోనీషియన్ చర్చి కొంతవరకు చొచ్చుకొని పోగలిగింది.

లొల్లార్డ్ ఉద్యమం, జాన్ హస్ బలిదానం

14వ శతాబ్దంలో వేక్లిఫ్ అనే ఇంగ్లండు దేశస్తుడు పోప్ ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఇంగ్లండులో పెద్ద ఉద్యమం ప్రారంభించాడు. ఇంగ్లీషు మాట్లాడే ప్రాంతంలో బైబిలును లాటిన్ భాషలో వాడటం అర్థంలేకని ఇంగ్లీషు భాషలోనికి అనువాదం చేశాడు. భారతదేశంలో సంస్కృతంలాగా యూరప్‌లో లాటిన్ భాష ప్రజలమీద రుద్దబడింది. పోప్ లాటిన్ భాషలోని బైబిలునే ఉపయోగించడంతో బైబిలు మరో భాషలోనికి అనువాదం కాకూడదని; జనానికి అర్థం అయినా, కాకపోయినా లాటిన్ భాషనే ఉపయోగించాలని పోప్ ఆదేశం. వేక్లిఫ్ వంటివారు, మతం సామాన్య ప్రజలకొరకుగాని కేవలం మతాధికార్ల కోసం కాదని; అందుచేత సామాన్య ప్రజలకు అర్థం అగుటకుగాను బైబిలును ప్రాంతీయ భాషల్లోకి అనువదించాలని పట్టుబట్టారు. ఇది పోప్ అనుయాయులకు గిట్టలేదు.

వేక్లిఫ్ నాయకత్వంలో ఆక్స్‌ఫర్డ్‌లోని కొంతమంది మేధావులు ఈ ఉద్యమానికి గట్టిపునాది వేశారు. ఇదే తర్వాత లొల్లార్డ్ ఉద్యమంగా యూరప్ అంతటా వ్యాపించింది. ఎర్రటి ముతకబట్టలు ధరించి అతి సాధారణ జీవితాన్ని గడిపే లొల్లార్డ్ సభ్యులు సామాన్యప్రజలకు సన్ని హితులయ్యారు. బైబిలుకు వీరు తమ స్వంతభాష్యాలు చెప్పారు. పోప్ ఇచ్చిన వ్యాఖ్యానాలను నిరాకరించారు. నెమ్మదిగా లొల్లార్డ్ ఉద్యమం బలం పుంజుకుంటూవుంటే పోప్ అనుయాయులలో కలవరం బయలుదేరింది. పోప్ ఏజెంట్లు లండన్ వీధులలో వేక్లిఫ్‌పై చాలాసార్లు అభాయిత్యాలకు పూనుకున్నారు. కాని లండన్ జనసమూహాలు ప్రతీ సారి పోప్ ఏజెంట్లను తరుమగొట్టి వేక్లిఫ్ ప్రాణాలు రక్షించారు. 14వ శతాబ్దం చివరికి లొల్లార్డ్ ఉద్యమాన్ని ఇంగ్లండ్‌లో సగం జనాభా స్వీకరించింది.

లొల్లార్డ్ ఉద్యమంతో ప్రభావితమై బొహీమియాకు చెందిన జాన్ హస్ అనే అతను ప్రేగు ప్రాంతానికి ఈ ఉద్యమాన్ని విస్తరింపచేశారు.

బోహీమియా అంతటా జాన్‌హస్ ప్రభావం చాలా విస్తరించడంతో మతాధికారులు మతవ్యతిరేకత ఆరోపణతో జాన్ హస్‌పై విచారణ జరిపి మరణదండన విధించారు. 1415లో జాన్ హస్‌ను ఇనుప స్థంబానికి కట్టి సజీవంగా దహనం చేశాడు. పోప్ మతాధికారుల క్రూరత్వానికి అతి దారుణంగా బలియైపోయిన తొలి తిరుగుబాటుదారులలో జాన్ హస్ ఒకరు. జాన్ హస్ బలిదానం యూరప్‌లోని మేధావులను కదలించి వేసింది.

ప్రొటెస్టాంటిజం

క్రైస్తవ మతంలో ఇంతవరకూ వచ్చిన వ్యతిరేక ఉద్యమాలు ఒక ఎత్తు. మార్టిన్‌లూథర్ 15వ శతాబ్దంలో తీసుకువచ్చిన విప్లవం మరొక ఎత్తు. గ్నాస్టిక్స్, కెథారీలు, ఆల్‌బిగెన్‌షియన్స్, వాల్డెన్సియన్స్ పోప్‌ను సవాలు చేయడం ద్వారా తమ త్యాగాల ద్వారా, ఆచరణమయమైన జీవితంద్వారా ఒక వాతావరణాన్ని సృష్టించారు. అందుచేత ఈ పుత వ్యతిరేకతను తన అధికార వ్యతిరేకతను ఎదుర్కొనుటకు గాను పోప్ అనుయాయులు పుత వ్యతిరేకులను విచారణ చేసి తప తప్పులను ఒప్పుకొని పశ్చాత్తాపపడితే క్షమించడము లేదా శిక్షించడము అనే పద్ధతి ప్రవేశ పెట్టారు. పుత కట్టుబాట్లు ఇంత తీవ్రమైనా ప్రజలలో పెరుగుతున్న ఆ నాటి క్రైస్తవమత వ్యతిరేకతను పూర్తిగా తుడిచి పెట్టలేకపోయారు. ఈ పోప్‌పై వ్యతిరేకత నివురుగప్పిన నిప్పులాగ లోపల లోపల రాజుకుంటోంది. అటువంటి సమయంలో మార్టిన్ లూథర్ పోప్‌పై విప్లవధ్వజం ఎత్తాడు. మార్టిన్‌లూథర్‌కి జర్మనీ, ఆస్ట్రియా ప్రాంతాల రాజుల సహకారం కూడా లభించింది. దానితో పోప్ అధికారానికి భిన్నంగా ప్రొటెస్టాంటిజం తల ఎత్తింది. ఆనాడు విప్లవభావాలు కలవానికి ప్రొంటెస్టాంటిజం సాధనమైంది.

పోప్ పెట్టిన సెన్సార్

ప్రొటెస్టాంటిజం ప్రభావంలో జీవితంలోని అన్ని రంగాలలోనూ నూతన చైతన్యం కలిగింది. విజ్ఞాన శాస్త్రంలో పరిశోధనలు ముందుకు

సాగాయి. క్రొత్త క్రొత్త సిద్ధాంతాలు, నూతన ఆలోచనలు రాసాగాయి. వీటిని గ్రంథస్థంచేయడం ప్రారంభించారు. పోప్ అధికారానికి, క్రైస్తవ మతానికి క్రొత్తగా వచ్చే గ్రంథాలు మరొక సవాలయినాయి. భూమి బల్లపరుపుగా ఉందనీ, భూమిచుట్టూ సూర్యుడు తిరుగుతున్నాడని బైబిలులో వ్రాసివుంది. ఖగోళ విజ్ఞానశాస్త్రం అభివృద్ధి చెందుతూవుంటే బైబిలు ప్రామాణ్యత శంకించవలసి వస్తుంది. ప్రత్యక్ష ప్రమాణంతో ముందుకుసాగుతున్న విజ్ఞానం బైబిలుకు పూర్తిగా వ్యతిరేకమైపోయింది. అటువంటి సమయంలో పోప్ నియమించిన మతాధికారులకు ముందుగా చూపి వారి అనుమతి పొందనిదే ఏ గ్రంథమూ ముద్రించకూడదనే నిబంధన వచ్చింది. ఈ విధంగా పోప్ సెన్సార్ నిబంధనలు ప్రవేశ పెట్టాడు. సెన్సార్‌కు వ్యతిరేకంగా కనిపించిన రచనలను నిషేధించుటను "ఇండెక్సింగ్" అన్నారు. ఇండెక్స్ చేయబడిన ఏ రచన అయినా ప్రచురింపబడుటకు వీలులేదు. దానిని ఎవరూ చదవడానికి కూడా వీలు లేదు. ఈ విధంగా 15వ శతాబ్దంనుంచి మతానికీ, విజ్ఞానానికీ ఘర్షణ ప్రారంభమైంది.

కోపర్నికస్

16వ శతాబ్దంలో కోపర్నికస్ తన పరిశోధనల ద్వారా భూమి చుట్టూ సూర్యుడు తిరగడంలేదనీ, సూర్యుని చుట్టూనే భూమి తిరుగుతుందనే సిద్ధాంతం ప్రతిపాదించాడు. తన పుస్తకం ఇండెక్స్‌కు ఎక్కడ గురి అవుతుందోనని భయపడి 20 సంవత్సరాల కాలం ఎవరికీ చూపించకుండా దాచివేశాడు. కాని అప్పటికీ, పోలెండ్‌లోని మతాధికారులు కోపర్నికస్ భావాలకు తీవ్ర వ్యతిరేకత వ్యక్తంచేశారు. అయితే పోప్ 3వ పాల్ రోజుల్లో మతవ్యవస్థ అవినీతిమయం కావడంతో ఏదో ఒక విధంగా దాన్ని ప్రచురించాలని ప్రయత్నించాడు. కోపర్నికస్ స్నేహితులు కోపర్నికస్ చెప్పింది కేవలం ఒక ఊహ మాత్రమేనని, అది సత్యమని అంగీకరించవలసిన పనిలేదని పోప్‌కు నచ్చచెప్పి ఆ



అమెరికన్ నాస్తికురాలు
మేడలిన్ ముర్రే ఓహైర్‌తో గొం

పుస్తకాన్ని అచ్చువేయించాడు. కానీ, తన గ్రంథాన్ని అచ్చులో చూడకుండానే కోపర్నికస్ మరణించాడు.

గెలీలియో

కోపర్నికస్ అనంతరం గెలీలియో మరింత కృషిచేసి సూర్యుని చుట్టూ భూమి తిరుగుతోందని నిరూపించాడు. దీనితో గెలీలియో రచనలు, సిద్ధాంతాలు మతాధికారుల కోపానికి గురైనాయి. గెలీలియోపై మత పరమైన విచారణ జరిగింది. గెలీలియోకు సన్నిహితమిత్రులు పోప్‌వద్ద ఉండడంచేత వారి కృషివల్లా, తాను చేసింది తప్పు అని క్షమాపణ కోరుకోవడంవల్లా గెలీలియో మరణశిక్షను తప్పించుకోగలిగాడు. అయితే చాలాకాలం జైళ్ళలో బ్రమగ్గవలసి వచ్చింది. గెలీలియో విచారణ సందర్భంలో కోపర్నికస్ పుస్తకం ఇండెక్స్‌లోకి ఎక్కి మూడువందల సంవత్సరాలపాటు వెలుగుచూడలేకపోయింది.

బ్రూనో బలిదానం

గెలీలియో సమకాలికుడు బ్రూనో. గియార్డానోబ్రూనో వ్యాటికన్ మతాధిపతి అభిప్రాయాలతో ఏకీభవించక వివిధ విషయాలపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తపరచాడు. అంతేకాక తన అభిప్రాయాలు తప్పు అని చెప్పుటకు నిరాకరించాడు. ఫలితంగా మత న్యాయస్థానం అతనిని సజీవంగా దహనంచేసి చంపమని శిక్ష విధించింది. రోమ్ నగరంలో 17 ఫిబ్రవరి, 1600 సంవత్సరంలో 52 సంవత్సరాల వయస్సుగల బ్రూనోను ఇనుప స్తంభానికి కట్టి దహనంచేసి చంపివేశారు. బ్రూనోపై విధించిన శిక్ష గెలీలియోను భయపెట్టియుండవచ్చు. అందుచేతనే పశ్చాత్తాపం ప్రకటించి ప్రాణాన్ని రక్షించుకున్నారు.

తిరుగుబాటు తత్వవేత్తలు

గెలీలియోకు సమకాలికుడు బ్రెంచి తత్వవేత్త డెకార్టే. భౌతిక వాదానికి ఎక్కువ విలువ ఇచ్చి డెకార్టే మానవుని ఉనికికి ప్రాధాన్యత

ఇచ్చాడు. మతం కోపానికి డెకార్టే గురియై ఫ్రాన్స్‌నుంచి హాలెండుకు వెళ్ళగొట్టబడ్డాడు. స్వీడన్‌కు చెందిన రాణి క్రిస్టినా సానుభూతినిపొంది చివరి రోజులు గడపవలసి వచ్చింది.

ఈ విధంగా ఒక ప్రక్కన విజ్ఞానశాస్త్రం రెండవ ప్రక్కన తత్వశాస్త్రం మతాన్ని సవాలుచేయడం ప్రారంభించాయి. దీనివల్ల యూరప్‌లో పారిశ్రామికవిప్లవం, సాంస్కృతిక విప్లవం సంయుక్తంగా కలిసివచ్చాయి. 17వ శతాబ్దంలో ప్రెంచి తత్వవేత్త వాల్టేర్, హాలెండుకు చెందిన స్పినోజా తాము నమ్మిన హేతుభావవృష్టిని యూరపులో వ్యాపింపజేశారు. వాల్టేర్ ఫ్రాన్స్‌నుంచి పితగురువులచేత చాలాచోట్లకు తరుమబడ్డాడు. స్పినోజాను సమకాలికులు "నాస్తికుడు" అని నిరసించారు. స్పినోజా కూడా మతాధికారులచేత చాలా బాధింపబడ్డాడు. అయినా వ్యతిరేకతలను లెక్కచేయకుండా తన భావాలను స్పష్టంగా చెప్పుకున్న స్పినోజా యూరప్‌ను ఎంతగానో ప్రభావితం చేశాడు.

18వ శతాబ్దం నాస్తికోద్యమానికి స్పష్టమైన పునాదులు వేసింది. థామస్ పెయిన్ వ్రాసిన "ది ఏజ్ ఆఫ్ రీజన్" నూతన ఆలోచనా ధోరణికి దారితీసింది. ఆంగ్ల మహాకవి షెల్లీ తాను నాస్తికుణ్ణి అని బాహాటంగా ప్రకటించుకొని "నాస్తికత్వావశ్యకత" అనే పుస్తకం వ్రాశాడు. ఇది వ్రాసినందుకు షెల్లీని యూనివర్సిటీనుంచి పంపించి వేశారు. మతాధికారులు ఆ పుస్తకాన్ని తగులబెట్టించారు.

"మహిమలపై ఆరు ఉపన్యాసాలు" అన్న పేరుతో థామస్ వూల్‌స్టన్ బైబిలులోని మహిమలను వ్యతిరేకిస్తూ పుస్తకం ప్రచురించినందుకు 1728లో ఆయనను జైలులో పెట్టారు. చనిపోయేవరకు ఆయన జైలులోనే ఉన్నాడు.

జర్మన్ తత్వవేత్త జోహన్ గాట్‌లబ్ ఫిచ్‌టే మతాన్ని ఖండిస్తూ మహాత్మ్యాలను నిరసిస్తూ వ్రాసినందుకు గాను ఆయనను ఉద్యోగంలోంచి తీసివేశారు.

18వ శతాబ్దం చివర భాగంలో వచ్చిన ఫ్రెంచివిప్లవం మత వ్యతిరేక విప్లవంగా చిత్రించబడినది. షెల్లీగానీ, థామస్ పెయిన్ గానీ తమ రచనలు 18వ శతాబ్దంలో చేసినా సుమారు 100 సంవత్సరాలు మత ప్రభావం వల్ల అవి అణచివేయబడ్డాయి. 20వ శతాబ్దం ప్రారంభంలో మాత్రమే వీటికి ప్రచారం లభించింది.

డార్విన్, మార్క్స్

19వ శతాబ్దంలో ఒక ప్రక్కన డార్విన్ పరిణామవాదాన్ని ప్రతిపాదించి జీవశాస్త్రంలో పెద్ద విప్లవాన్ని సాధించాడు. డార్విన్ పరిణామవాదం బైబిలు ప్రతిపాదించిన సృష్టి సిద్ధాంతానికి పూర్తిగా వ్యతిరేకం. డార్విన్ తనను తాను స్వయంగా "అజ్ఞేయవాది" అని చెప్పుకున్నాడు.

పరోప్రక్క కారల్ మార్క్స్ కమ్యూనిష్టు సిద్ధాంతాన్ని ప్రతిపాదించి ఆర్థిక రంగంలో విప్లవాత్మకమైన మార్పును ప్రతిపాదించాడు. ఆయన అవనపు విలువ సిద్ధాంతంద్వారా దోపిడి అంతం కావడానికి వ్యక్తిగత ఆస్తి పోవాలని, ఆస్తి అంతా సమాజపరం కావాలని సూచించాడు. తన భావాలకు మార్క్స్ చాలా బాధ పడవలసివచ్చింది. ఆయన మతాన్ని "మత్తు మందుగా" పోల్చాడు. మార్క్స్ సిద్ధాంతం పూర్తిగా మతరహిత సిద్ధాంతం. ఆయన గతితార్కిక భౌతిక వాదాన్ని ప్రతిపాదించి అంతకూ పదార్థమే మూలం అని చెప్పడంతో దేవునికిగానీ, మతానికిగానీ ఎక్కడా అస్కారం లేకుండా పోయింది.

19 శతాబ్దంలోనే జర్మన్ తత్వవేత్త నిజ్షే మతాన్ని దుయ్యబట్టాడు. ఆయన "దేవుడు చనిపోయాడు" అనే వాచం తీసుకువచ్చి ఒక నూతన చైతన్యం కల్గించుటకు ప్రయత్నించాడు.

బ్రాడ్లా కృషి

19వ శతాబ్దం చివరలో ఇంగ్లండులో చార్లెస్‌బ్రాడ్లా, అమెరికాలో రాబర్ట్ గ్రీన్ ఇంగర్‌సాల్ నాస్తిక భావాలవ్యాప్తికి కంకణం కట్టుకొని

రంగంలోనికి దిగారు. తమ భావాలలో రాజీపడకుండా ఇద్దరూ రాజకీయ రంగంలోకూడా కృషి చేశారు. చార్లెస్‌బ్రాడ్లా "నేషనల్ రిఫార్మర్" అనే పత్రిక ద్వారాను, "నేషనల్ సెక్యులర్ సొసైటీ" అనే సంస్థ ద్వారాను నాస్తిక భావాలను వ్యాప్తి చేశారు. "అవిశ్వాసం నుంచి మానవాళికి కలిగిన మహోపకారము" అని దైవవిశ్వాసాన్ని వ్యతిరేకిస్తూ బ్రాడ్లా వ్రాసిన పుస్తకం ప్రసిద్ధి చెందింది. బ్రిటనులో పార్లమెంటుసెంబరుగా ఎన్నికై దేవునిపై ప్రమాణం తీసుకొనుటకు నిరాకరించినందుకుగాని ఆయన ఎన్నిక రద్దు చేయబడింది. అంతేగాదు, దైవద్రోహం రాజద్రోహం అనే నెపంమీద బ్రిటిషు ప్రభుత్వం బ్రాడ్లాకు జైలుశిక్షకూడా విధించింది. అయితే తన నియోజకవర్గంనుంచి రెండవసారికూడా అత్యధిక మెజారిటీతో ఎన్నిక కావడంతో బ్రిటిషుపార్లమెంటు ప్రమాణాలుచేసే పద్ధతిని మార్చవలసి వచ్చింది. దేవునితో ప్రమేయం లేకుండా ప్రమాణం చేసే పద్ధతిని చార్లెస్ బ్రాడ్లా ప్రవేశపెట్టి పైకి తీసుకునివచ్చారు. ఈ విధంగా చార్లెస్‌బ్రాడ్లా చేసిన కృషి, ఆయన సలిపిన సమరం నాస్తికోద్యమ చరిత్రలో ఒక ప్రధాన ఘట్టం.

బ్రాడ్లా సమకాలికుడు థామస్ హక్స్‌లీ ప్రముఖ శాస్త్రవేత్త. డార్విన్ ప్రతిపాదించిన పరిణామాన్ని హక్స్‌లీ మానవ జాతికి వర్తింప జేశాడు. మతంనుంచి హక్స్‌లీ చాలా వ్యత్యిరేకతలను ఎదుర్కొవలసి వచ్చింది.

ఈ విధంగా 20వ శతాబ్దం వచ్చేసరికి పాశ్చాత్య దేశాలలో విజ్ఞాన శాస్త్రము, తత్వశాస్త్రమూ కూడా ఆస్తిక నమ్మకాలను పూర్తిగా వ్యతిరేకించాయి. మానవాభివృద్ధికి దైవభావంతోగాని, మతసంస్థలతోగాని ప్రమేయం అవసరంలేదని నిరూపించాయి. మరొక ప్రక్క పారిశ్రామిక విప్లవం నిత్య జీవితాన్ని పూర్తిగా మార్చివేసింది. హ్యూమనిస్టు, రేషనలిస్టు భావాలు సర్వసామాన్యులలోనికి ప్రవేశించాయి. 20వ శతాబ్దంలో ఎక్కడికక్కడ హేతువాద, మానవతావాద, నాస్తిక సంఘాలు ఏర్పడడానికి అవకాశం కలిగింది.

7

ఆధునిక కాలంలో నాస్తికభావాలు

20వ శతాబ్ది ప్రారంభంనాటికి ఇంగ్లండులో రేషనలిస్టు ప్రెస్ అసోసియేషన్ స్థాపించబడింది. బ్రాడ్లాతో కలిసి పనిచేసిన హోల్యోకు, చార్లెస్ వాట్స్ దీనికి ముఖ్యులు. రేషనలిస్టు ప్రెస్ అసోసియేషన్ ప్రీథింకర్స్ లైబ్రరీ అనే పేరుమీద ప్రజలలో హేతువాద నాస్తిక భావాలను ప్రచారం చేసే పుస్తకాలు కరపత్రాలు వెలువరించడం ప్రారంభించారు. రేషనలిస్టు ప్రెస్ అసోసియేషన్‌లో ఉన్నవారు చాలామంది నాస్తికులే అయినప్పటికీ "నాస్తికత్వం" అనే పదానికి సమాజంలో ఉన్న వ్యతిరేకతకు తట్టుకోలేక రేషనలిజం, ఫ్రీథాట్ అనే పదాలు ఉపయోగించ నారంభించారు. రేషనలిస్టు ప్రెస్ అసోసియేషన్ హేతువాద, నాస్తిక భావాల వ్యాప్తికి ఎనలేని సేవ చేసింది.

ఒక ప్రక్కన రేషనలిస్టు ప్రెస్ అసోసియేషన్ పని చేస్తూండగానే 1890లో ప్రారంభించబడ్డ "ఎథికల్ యూనియన్" కూడా మరొక స్థాయిలో పని చేస్తోంది. 1963లో ఈ రెండు సంస్థలూ ఏకమై "బ్రిటిష్ హ్యూమనిస్టు అసోసియేషన్"గా రూపొందాయి. ప్రస్తుతం న్యూ హ్యూమనిస్టు, ఫ్రీథింకర్ అను రెండు పత్రికలుమాత్రం ఇంగ్లండు నుంచి ప్రచురింపబడుతున్నాయి.

అమెరికాలో ఎథికల్ కల్చర్

అమెరికాలో 1876లో ఎథికల్ కల్చర్ మూవ్‌మెంట్ అనేది స్థాపించబడినది. ఎక్కువగా నిత్యజీవితంలో సెక్యులర్ భావాలు తీసుకొని ఈ ఉద్యమం సాంఘిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత నిచ్చింది. క్రైస్తవ మతం ప్రధానంగా ఆదివారం చర్చిలో అందరూ కలుసుకోగలిగే ఒక సాధనంగానూ, వివాహాలు, మరణాలు సంభవించినప్పుడు కర్మకాండ జరిపే వ్యవస్థగాను మాత్రమే మిగిలిపోవడంతో ఈ మత వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా ఆదివారపు అవసరాలను సెక్యులర్‌గా తీర్చుటకు ఈ ఎథికల్ కల్చరల్ మూవ్‌మెంట్ ముందుకు వచ్చింది.

1927లో చికాగో యూనివర్సిటీలో కొంతమంది విద్యార్థులు, ఉపాధ్యాయులుకలిసి ఒకచిన్న హ్యూమనిస్టు సంఘాన్ని ప్రారంభించారు. అది పెరిగి పెద్దదై అమెరికా అంతటా శాఖోపశాఖలుగా విస్తరించిం అమెరికన్ హ్యూమనిస్టు అసోసియేషన్ ఒక బలమైన హ్యూమనిస్టు ఉద్యమంగా రూపొందింది.

అమెరికాలో నాస్తిక సంస్థలు

న్యూయార్క్ పట్టణంలో "అమెరికన్ అసోసియేషన్ ఫర్ది ఎడ్వాన్స్‌మెంట్ ఆఫ్ ఎథీజం" అనే ఒక సంస్థ స్థాపించ బడింది. వీరు ట్రూత్ సీకర్ అనే ఒక పత్రికను కూడా వెలువరించారు. నెలకొకసారి సమావేశమై నాస్తికదృష్టితో వివిధ విషయాలు చర్చిస్తూండేవారు. నాస్తి కత్వమనే పదానికి ఉన్న వ్యతిరేకతవల్ల వీరు సమాజంలో తిరస్కృతులుగా చూడబడ్డారు. వ్యతిరేకతలను తట్టుకోలేక 1960నాటికి ఈ సంస్థ సభ్యులు ఊరుకోవడమో లేక చనిపోవడమో జరిగింది. కాని ఒక దశాబ్దంతర్వాత అమెరికా పశ్చిమతీరంలో ఉన్న శాంటియాగోలో తిరిగి ఈ సంస్థను పునరుద్ధరించారు. "ది ఎథీస్ట్" అనే ఒక చిన్న త్రైమాస పత్రికను వీరు నడుపుతున్నారు. జోసఫ్‌లూయీస్ అనే ఒక చిన్న వ్యాపారస్తుడు థామస్ పెయిన్‌వల్ల అత్యధికంగా ప్రభావితుడై

ఫ్రీథింకర్స్ ఆఫ్ అమెరికా అనే సంస్థను స్థాపించాడు. "ది ఏజ్ ఆఫ్ రీజన్" అనే పత్రికను పెట్టారు. తనను తాను స్వయంగా నాస్తికుణ్ణి అని చెప్పుకున్నాడు. నాస్తికత్వంపై అనేక ఉపన్యాసాలిచ్చారు. వీటిని గ్రంథ రూపంలో కూడా తీసుకొచ్చారు. "ఎథీస్టు మానిఫెస్టో" అనే పుస్తకాన్ని రచించాడు. తనయావదాస్తిని నాస్తిక ప్రచారానికే వినియోగించాడు. 1967లో ఆయన మరణంవల్ల ఈ సంస్థ కార్యకలాపాలు సన్నగిలిపోయాయి.

శ్రీమతి మ్యాడలిన్ మురే ఓహేర్ అమెరికాలో నాస్తికురాలుగా పేరు సంపాదించారు. మత ఆస్తులపై పన్ను విధించాలని, విద్యాసంస్థలలో బైబిలు బోధించరాదని, ప్రభుత్వానికి మతానికి సంబంధం ఉండరాదని ఈమె ప్రధానంగా పోరాటం జరిపారు. మేరీలాండ్ విద్యా సంస్థలపై బైబిలు బోధకు వ్యతిరేకంగా ఈమె కేసువేసి నెగ్గడంతో అమెరికా అంతటా ఈమె ప్రసిద్ధి చెందినది. టెక్సాస్ రాష్ట్రంలోని ఆస్టిన్‌లో సొసైటీ ఆఫ్ సపరేటిస్ట్స్ అనే సంస్థను ప్రారంభించారు. దీని ద్వారా నాస్తిక ప్రచారం చేస్తున్నారు. 1970లో గోరాగారు అమెరికా వెళ్ళినప్పుడు శ్రీమతి ఓహేర్‌ను కలిశారు. దాని ఫలితంగా ఆమె అమెరికన్ ఎథీస్టు అసోసియేషన్ ప్రారంభించారు. "అమెరికన్ ఎథీస్ట్" అనే ఒక పత్రికను కూడా ఈ సంస్థ తరఫున నిర్వహిస్తున్నారు.

గ్యారీ డీ యంగ్ అనే ఆయన నాస్తిక భావాల ప్రచారానికిగాను మిన్నిసోటా రాష్ట్రంలో "మిన్నిసోటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిలాసఫీ" ప్రారంభించారు. నాస్తిక భావాలు ప్రచారం చేస్తున్నందుకుగాను ఈయన చాలాసార్లు ఉద్యోగాలు కోల్పోయారు. తన కుటుంబం మొత్తాన్ని నాస్తికులుగా మార్చి, తనకున్నకొద్ది వనరులతో నాస్తిక ప్రచారం చేస్తున్నారు.

అమెరికాలో అమెరికన్ రేషనలిస్టు అసోసియేషన్, సెక్యులరిస్ట్స్ ఆఫ్ అమెరికా, అనార్కిస్టులుకూడా నాస్తిక భావాలు ప్రచారంచేస్తూ పత్రికలు నడుపుతున్నారు.

పాశ్చాత్య రేషనలిస్టు ఉద్యమాల ప్రభావం

ఇంగ్లండు, అమెరికాలలో వ్యాపించిన నాస్తిక భావాల ప్రభావం మొత్తం ప్రపంచం మీద వ్యాపించాయి. ఈ 20వ శతాబ్దంలో బెట్రాండ్ రస్సెల్, జూలియన్ హక్స్లీల ప్రభావం ప్రపంచం మొత్తంమీద అధికంగా పడింది. వీరిద్దరు సాంప్రదాయక రూఢివాదాన్ని ఛేదించి వివిధ రంగాలలో విప్లవాత్మక శాస్త్రీయఆలోచనా ధోరణులను కల్గించారు. దీనితో ఆస్ట్రేలియా న్యూజిలాండు యూరప్లోని వివిధ దేశాలలో హేతువాద, మానవతావాద భావాలు పటిష్టమైనాయి. ఆసియా, ఆఫ్రికా ఖండాలకు చెందినవారు యూరప్ దేశ సామ్రాజ్యవాద పాలనలో ఉండుటచేత తమ ఉన్నత చదువులకోసం, ముఖ్యంగా ఇంగ్లండు, ఫ్రాన్సు వెళ్లేవారు. అక్కడ ఈ క్రొత్తగా బలం పుంజుకుంటున్న ప్రగతిశీల భావాలతో ప్రభావితమై తమ తమ దేశాలకు తిరిగి వెళ్లిన తర్వాత ఆయా దేశాలలో వీటిని ప్రచారం చేశారు. ఈ దేశాలలో వచ్చిన స్వాతంత్ర్య ఉద్యమాలు కూడా మతంతో రాజీలు పడినా మొత్తం మీద తిరుగుబాటు భావాన్ని, నూతన ఆలోచనా ధోరణిని, స్వాతంత్ర్య పిపాసను అధికం చేశాయి. అలాంటి సమయంలో ఈ హేతువాద మానవతావాద భావాలతో ప్రభావితులై యూరపు వెళ్ళివచ్చిన వారు ఒక విశిష్టమైన పాత్రను నిర్వహించారు. మన దేశంలో మహాత్మాగాంధీ నాయకత్వంలో సాగిన స్వాతంత్ర్యోద్యమంలో జవహర్లాల్ నెహ్రూ పాత్ర ఇటువంటిదే.

సోవియట్ విప్లవ ప్రభావం

మరొకప్రక్క మార్క్స్ సిద్ధాంతాల అధ్యయనం సెక్యులర్ భావాల వ్యాప్తికి బాగా తోడ్పడింది. రష్యాలో లెనిన్ నాయకత్వంలో వచ్చిన సోషలిస్టు విప్లవం మతప్రమేయం లేకుండా విప్లవాన్ని సాధించవచ్చు ననే భావాన్ని ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికాలలో అణగదొక్కబడినటి దేశాలలో కలుగజేసింది. ఈ దేశాలలో ప్రారంభమైన కమ్యూనిస్టు పార్టీలు భౌతిక వాద ప్రచార సంచర్యంలో మత మౌఢ్యాన్ని దోపిడీతో కూడుకున్న మత

వ్యవస్థను తీవ్రంగా వ్యతిరేకించవలసివచ్చింది. ఈ మత వ్యతిరేక భావాల లోనుంచి హేతువాద, నాస్తిక భావాలకు ప్రాధాన్యత లభించింది.

సోవియట్ యూనియన్‌లో మత ఆరాధనా స్వేచ్ఛ ఉన్నప్పటికీ మత వ్యవస్థకి ప్రోత్సాహంలేదు. అంతేకాక ప్రజలలో నాస్తిక భావాలు వ్యాపింపజేయుటకు ప్రత్యేకంగా "జ్ఞానియే" అనే సంస్థ కృషి చేస్తోంది. దీని శాఖలు ప్రతీచోట వ్యాపించి ఉన్నాయి. మతవ్యవస్థ మౌఢ్యాన్ని ఎలాగ ప్రోత్సహిస్తుందో, మౌఢ్యంలో పడకుండా ఉండవలసిన అవసరం ఏమిటో, దైవవిశ్వాసం, మతప్రమేయం లేకుండా మానవుడు ప్రతీ సమస్యనూ ఎలా పరిష్కరించుకోగలదో ఈ సంస్థ విచమర్చి చెబుతూంది. 18 సంవత్సరాల లోపువారికి మతబోధలు చేయకూడదని సోవియట్ ప్రభుత్వం నిషేధించింది. ప్రతీ దేశంలోనూ ఇలాంటి సంస్థలను గనుక ఏర్పరచినట్లయితే మతప్రభావం తగ్గి సెక్యులర్ భావం పెరుగుతుంది. తమని సెక్యులర్ దేశాలు అని చెప్పుకుంటున్న దేశాలు సోవియట్ యూనియన్‌నుండి ఈ విషయం అనుకరిస్తే బాగుంటుంది.

భారతదేశం

రెండవ ప్రపంచ యుద్ధానంతరం అనేక దేశాలలో హేతువాద, మానవతావాద సంఘాలు ప్రారంభించ బడ్డాయి.

భారత దేశంలో హేతువాద భావాలు సాంఘిక సంస్కరణలతో ముడిపడి వచ్చాయి. ఆర్యసమాజం కులతత్వానికి వ్యతిరేకంగా పోరాడింది. అలాగే బ్రహ్మసమాజం విగ్రహారాధనకు వ్యతిరేకంగా పోరాటం సలిపింది. కమ్యూనిస్టు ప్రపంచంలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించి లెనిన్‌తో కలిసి పనిచేసిన యం. ఎన్. రాయ్ నవ్యమానవవాదం విద్యాధికులను ఆకర్షించింది. మరొక ప్రక్కకేరళలో సంఘ సంస్కరణ భావాల్లోంచి హేతువాద సంఘాలు బయలుదేరాయి.

తమిళనాడులో పెరియార్ ఇ. వి. రామస్వామినాయకర్ నాయకత్వంలో పటిష్టంగా రూపొందిన ద్రవిడ కజకం బ్రాహ్మణ పౌరోహిత్య

వ్యవస్థను, ఆర్య సంస్కృతిని, ఆర్య పురాణాలను నిరసిస్తూ సామాన్య ప్రజలలో ఒక పెద్ద సాంస్కృతిక విప్లవాన్ని తీసుకుని వచ్చింది. ఇదే విధంగా ఆంధ్రదేశంలో శ్రీ త్రిపురనేని రామస్వామిచౌదరిగారి సాహిత్యం, భావాలు హేతుభావ ప్రచారానికి దోహదంచేశాయి. 1949 లో శ్రీ ఎస్. రామనాధన్‌చే మద్రాసులో స్థాపించబడిన ఇండియన్ రేషనలిస్టు అసోసియేషన్ హేతుభావన వ్యాప్తికి చాలా కృషిచేస్తోంది. శ్రీ గోరా ఈ సంఘం సంస్థాపక సభ్యులలో ఒకరు, 1970-72 మధ్య అధ్యక్షులుగా కూడా ఉన్నారు. 1972 లో విశాఖపట్నంలో నెలకొల్పబడిన భారత నాస్తిక సమాజం కూడా నాస్తికభావాల ప్రచారానికి తోడ్పడుతోంది. శ్రీలంక హేతువాద సంఘాధ్యక్షులు డా. ఎ. టి. కోవూర్ శ్రీలంకలోనూ, భారతదేశంలోనూ హేతువాద, నాస్తిక భావ వ్యాప్తికి చాలా కృషిచేశారు.

గోరా పాత్ర

ఆధునిక నాస్తికోద్యమంలో గోరాపాత్ర ప్రముఖమైనది. నాస్తికత్వము, హేతువాదము మొదలైనవి కేవలం ఆలోచించేవారికి, విద్యాధికులకు మాత్రమేనని, సామాన్యులకు ఇవేమీ అర్థంకావని ఏర్పడిన భావాన్ని తొలగించుటకు ఆయన అతి సామాన్యులలోనికి నాస్తికత్వాన్ని ఒక జీవిత విధానంగా ప్రవేశపెట్టుటకు కృషిచేశాడు. ఒకప్రక్క స్వాతంత్ర్యోద్యమంలోనూ మరొక ప్రక్క సంఘ సంస్కరణలోనూ ప్రముఖ పాత్రవహిస్తూ నాస్తికత్వాన్ని రాజీలేకుండా ప్రచారం చేయడంవల్ల కార్యక్రమాలు, ప్రచారాలు కలిసి వెళ్లాయి. మహాత్మాగాంధీతో నాస్తికత్వంపై గోరా జరిపిన సంభాషణలు "యాన్ ఎథీస్ట్ విత్ గాంధీ" అనే పుస్తకరూపంలో వెలువడడంతో, ప్రపంచమంతటా గాంధీ సాహిత్యంలో భాగంగా ఇదికూడా చదవబడి నాస్తికత్వం యెడల జిజ్ఞాసను, సానుభూతిని అధికంచేసింది.

గోరాగారు ఒక ప్రక్కన నాస్తికత్వమంటే మానవుని స్వేచ్ఛా ప్రవృత్తి వికాసమని; జ్ఞాన సంపాదనకుగాని, ఆచరణకుగాని మానవుడే

కేంద్రమని; మానవుడిలోని బానిస భావం తొలగితే కేవలం దైవభావానికేగాక సాంఘిక రాజకీయ ఆర్థిక వ్యవస్థలకు బానిసగాలొంగి ఉండుటకు కూడా నిరాకరిస్తాడని, అందుకు నాస్తికత్వం ఆచరణయుక్తమైన జీవిత విధానంగా రూపొందాలని చెప్పి, జీవితాంతం ఈదృష్టితోనే కృషి చేశారు.

అంతర్జాతీయ మానవతావాదుల సంఘం

రెండవ ప్రపంచ యుద్ధానంతరం వివిధ దేశాలలో ఏర్పడిన మానవతావాద, హేతువాద, నాస్తిక సంఘాలమధ్య ఉద్యమాల మధ్య అంతర్జాతీయ స్థాయిలో సహకారం, పరస్పర అవగాహన అవసరమని గుర్తించబడింది. ఇందుకుగాను 1952 ఆగస్టులో హాలెండు రాజధాని ఆంస్టర్‌డాంలో జూలియన్ హక్స్‌లీ అధ్యక్షతను వివిధసంఘాల ప్రతినిధులు సమావేశమై "ఇంటర్నేషనల్ హ్యూమనిస్టు అండ్ ఎథికల్ యూనియన్" అనే సంస్థను స్థాపించారు. దీని సంస్థాపక సమావేశంలో భారతదేశం తరపున శ్రీ యం. ఎన్ రాయ్ పాల్గొన్నారు. నాలుగు సంవత్సరాల కొకసారి ఈ సంఘం మహాసభలు జరుగుతాయి. 1970 అమెరికాలోని బోస్టన్ పట్టణంలో జరిగిన అంతర్జాతీయ హ్యూమనిస్టు మహాసభలలో గోరాగారు పాల్గొనడం, అ సమయంలో యూరప్, అమెరికా, ఆస్ట్రేలియా, ఆసియా ఖండాలలోని వివిధ ప్రాంతాలలో గోరా పర్యటించడం నాస్తికోద్యమ వ్యాప్తికి తోడ్పడింది.

ప్రథమ ప్రపంచ నాస్తిక మహాసభలు

ఈ పర్యటన సమయంలో కొన్ని యూరపు దేశాలలోను, ఆస్ట్రేలియాలోను నాస్తిక సంఘాలు స్థాపించబడ్డాయి. ఆస్ట్రేలియాలో శ్రీ ఆలెన్ రికార్డు అధ్వర్యంలో ఎథీస్ట్ సొసైటీ అఫ్ ఆస్ట్రేలియా స్థాపించబడింది. "ఎథీస్ట్ జర్నల్" అనే పత్రిక నడుపుతున్నారు. ఈ పర్యటన ఫలితంగా 1972 డిశంబరులో ప్రథమ ప్రపంచ నాస్తిక మహాసభలు విజయవాడ నాస్తిక కేంద్రంలో జరిగాయి. 1974 లో మళ్లా గోరా అంతర్జాతీయ హ్యూమనిస్టు మహాసభలో పాల్గొన

డానికి ఆంస్టర్ డాం వెళ్ళినప్పుడు సోవియట్ యూనియన్ తో సహా అనేక యూరపు దేశాలు పర్యటించి నాస్తిక సౌభ్రాతం పటిష్టం చేయుటకు తోడ్పడ్డారు. గోరా ప్రారంభించిన ఆంగ్లమాస పత్రిక "ది ఎథీస్టు" ఆసియా, యూరపు, ఆఫ్రికా, అమెరికా, ఆస్ట్రేలియా-అన్ని ఖండాలలో 30కిపైగా దేశాలలో చదవబడుతూ ప్రపంచ నాస్తిక సచవగాహనకు తోడ్పడుతోంది. "ది ఎథీస్టు" చదివి ఆఫ్రికాలోని గాంబియాలో ఫాలా ఫాల్ అనే యువకుడు నాస్తిక సంఘాన్ని స్థాపించి నాస్తికభావాల ప్రచారానికి పూనుకున్నారు.

ఈ విధంగా ఆధునిక కాలంలో మానవతావాద, హేతువాద, లౌకికవాద, నాస్తికభావాలు నిలద్రొక్కుకొని జీవిత విధానంగా రూపొందుతున్నాయి.

8

నాస్తికత్వం జీవిత విధానం

మొదట్లో మత వ్యతిరేకతే నాస్తికత్వం అనుకున్నారు. అలాగే దేవుడు లేడనటమూ, మత గ్రంధాలు, పురాణాలను ప్రమాణంగా అంగీకరించకపోవటము, మూఢనమ్మకాలను వ్యతిరేకించడం నాస్తికత్వం అనుకున్నారు. అందుచేత నాస్తికత్వాన్ని వ్యతిరేకార్థంగాను, నెగెటివ్‌గాను చిత్రించారు.

మానవుణ్ణి బానిసగా చేసే భావాలను గాని, సాంప్రదాయాలను గాని, వ్యవస్థలనుగాని వ్యతిరేకించడం నాస్తికత్వంలో ఒక ప్రధానభాగం. అయితే ఈ వ్యతిరేకతే నాస్తికత్వం కాదు. దేవుడు లేడనుకుంటే, మత గ్రంథాలను, పురాణాలను ప్రామాణికాలుగా తీసుకోకపోతే, మూఢ విశ్వాసాలను, మతకర్మకాండను అంగీకరించకపోతే మానవ జీవితం ఎలా ఉంటుంది? అతని ప్రవర్తన ఎలా ఉంటుంది? ఈ జీవితాచరణ రూపొందించి నిరూపించుటే నాస్తికత్వము. దైవభావాన్ని, మత గ్రంథాలను, మూఢనమ్మకాలను, మత కర్మకాండను వ్యతిరేకించిన నాస్తికత్వం "నెగెటివ్" నాస్తికత్వ మైతే మానవ జీవితాచరణను రూపొందించే నాస్తికత్వం "పాజిటివ్" నాస్తికత్వం.

సంఘవ్యవస్థతో ముడిపడిన దైవభావం

మానవ సమాజనిర్మాణ ప్రారంభదశలో తనచుట్టూఉన్న పరిసరాలను అర్థం చేసుకొనే ప్రయత్నంలో ఊహించబడిన దైవభావం రాను

రాను కుటుంబ నిర్మాణంతోనూ, సమాజ నిర్మాణంతోనూ మతవ్యవస్థగా ముడిపడింది. మత వ్యవస్థలోంచి వచ్చిన నియమాలు, కట్టుబాట్లు. సాంప్రదాయాలు మానవుని సాంఘిక జీవితానికి ఆధారాలైనాయి. సమాజ నిర్మాణం సాగుతున్నకొద్దీ మానవ జీవితంతో ఇవి పెనవేసుకొని ఉంటాయి. శిశువు జన్మించినా, ఎవరైనా చనిపోయినా, వివాహం చేసుకోవాలన్నా, పనిలో ప్రవేశించాలన్నా, విత్తనాటాలన్నా, పంటకోయాలన్నా వైరాలు మానుకొని స్నేహం నెలకొల్పాలన్నా, ఒక వ్యక్తి మరొక వ్యక్తితో సంబంధం నెలకొల్పుకోవాలన్నా – ప్రతీదీ దైవ విశ్వాసంవల్ల ఏర్పడిన మత వ్యవస్థతో ముడిపడిపోయింది.

రానురాను రాజకీయ వ్యవస్థ వికసించినా; వ్యవసాయము, వర్తక వ్యాపారాలు, పరిశ్రమలద్వారా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిచెందినా; సాంఘిక కట్టుబాట్లు, నీతి సూత్రాలు వల్ల నైతిక వ్యవస్థ పటిష్టమై, సంగీత, నృత్య, నాట్య, స్థాపత్య, చిత్రలేఖన, సాహిత్యాలద్వారా లలిత కళలు అభివృద్ధి చెందినా; పరిసరాలను అర్థం చేసుకొనుటలో తత్వశాస్త్రం రూపొందినా; వివిధ వస్తువుల గుణాల సంయోగాలవల్ల నూతన విషయాలను, సాధనాలను తయారు చేయగలుగుటలో విజ్ఞాన శాస్త్రం వికసించినా మానవుడు ప్రారంభ దశలలో ఊహించిన దైవభావానికి, మత వ్యవస్థకు లోబడే చేస్తూవచ్చాడు. అందుచేత వీటన్నింటిలో ఆస్తికప్రభావమే మనకు కనబడుతుంది.

బానిసభావం ఆస్తికత్వం

దైవం తనకంటే అతీతమైనదని, తనకు అర్థం కానిదని, తన జీవితాన్ని నిర్దేశిస్తున్నదని, దైవము, దైవ సంబంధ వ్యవస్థను కాదంటే తనకు కీడు కలగవచ్చునని భయపడిన మానవుడు దైవ భావానికి, దాని చుట్టూ అల్లుకున్న ఆత్మ, పరమాత్మ, కర్మ, పునర్జన్మ, స్వర్గం, నరకం అనే భావాలకు లొంగిపోయాడు. ఈ లొంగుబాటు తత్వం బానిస ప్రవృత్తి. ఈ విధంగా ఆస్తిక వ్యవస్థ-సామాజిక రాజకీయ, ఆర్థిక

నైతిక, తాత్విక, వైజ్ఞానిక రంగాలన్నీ ఎంతగా వికసించినా బానిస ప్రవృత్తిని కేంద్రం చేసుకొని వికసించాయి. వ్యక్తి అల్పుడు, వ్యవస్థ లన్నీ వ్యక్తికిమించినవి. ఈ వ్యవస్థలన్నింటిలో వ్యక్తి ఒక భాగం, అతిసన్న భాగం, అనే భావనతో వ్యక్తి ఈ వ్యవస్థలకు లొంగిపోయాడు. ఈ వ్యవస్థలలో ప్రధాన భూమిక నిర్వహించేవాడు నిరంకుశులైనారు. సామాన్యులు నిరంకుశుల స్వార్థపరత్వానికి, వాడు చేసే దోపిడికి క్రూర త్వానికి బలి అయిపోతున్నాడు. ఇలా అణచబడేవారు కొందరూ అధిక్యత లను అనుభవిస్తూ అణిచేవాడు కొందరూ ఏయారైనారు. అణగబడిన వారిలో కూడా దోపిడి తత్వం ప్రవేశించింది. ప్రతీవ్యక్తి మరో వ్యక్తిని అణచి ఉంచాలని, తానే అధికుడుగా ఉండాలని పోటీపడసాగాడు. ఈ పోటీలో ప్రతీవ్యక్తి ఒకరి చేత అణచబడుతున్నాడు, మరొకరిని అణచి ఉంచుతున్నాడు. ఈ పరస్పర దోపిడీలో తనకంటే అధిక్యత గలవారి వద్ద వ్యక్తి బానిసైపోతున్నాడు, తనకంటే అవకాశాలు తక్కువగా గల వారి వద్ద వ్యక్తి నిరంకుశుడౌతున్నాడు. ఈ విధంగా బానిస భావము, నిరంకుశత్వము ఆస్తిక వ్యవస్థలో బొమ్మా-బొరుసుగా తయారయ్యాయి. జీవితం లోని అన్ని రంగాలలో ఒకప్రక్క లొంగుబాటు భావం, మరొక ప్రక్క నిరంకుశత్వం మనకు ప్రతీచోటా కనిపిస్తుంది. అందుకే ఆస్తిక నాగరికత అసమానతలకు పట్టినిల్లు. ఈ అసమానతలను దైవ నిర్ణయం పేర సమర్థించినా, విధిఘాత, కర్మఫేర సమర్థించినా, సంఘ కట్టుబాట్లు, ప్రభుత్వ శాసనాలు, పరిస్థితులపేర సమర్థించినా వ్యక్తిలోని లొంగుబాటు భావానికి, బానిస భావానికి విలువ ఇవ్వడమే జరుగుతుంది. దానిని ప్రోత్సహించడమే జరుగుతుంది.

బానిస వ్యవస్థపై తిరుగుబాటు

ఇందుకు భిన్నంగా మానవుడు తన కృషితో వ్యక్తిత్వాన్ని నిలుపు కోగలడని, బానిసగా మరొకరికి లొంగి ఉండవలసిన అవసరంలేదని, అందరి మానవులతో తానూ సమానమేనని, సమానత్వానికి వ్యతిరేకంగా ఉండే ఊహలను తాను వదులుకోవాలని, సంఘ కట్టు బాట్లను ప్రభుత్వ

శాసనాలను, భౌతిక పరిస్థితులను మార్చుటకు నిరంతరం కృషిచేయాలని నాస్తికత్వం చెబుతుంది. మనిషిని లొంగి ఉంచాలనే ప్రతీ భావనపై, ప్రతీ వ్యవస్థపై నాస్తికత్వం తిరుగుబాటు చేస్తుంది. అందుచేతనే భావ దాస్యంపై, సాంఘిక, ఆర్థిక లొంగుబాటుపై, ఆర్థికదోపిడీపై; ఈ లొంగు బాటును, దోపిడీని, దాస్యాన్ని సమర్థించే గ్రంథాలపై, వ్యవస్థలపై, విధానాలపై, తిరుగుబాటు చేసిన వారినల్లా సమకాలికులు నాస్తికులన్నారు. స్వేచ్ఛనుకోరినప్రతివాని మతవ్యతిరేకి అనో, నాస్తికుడనో అన్నారు. దీనిబట్టి నాస్తికత్వం అంటే దానిసభావానికీ, అసమానతలకీ వ్యతిరేకం అని అర్థం.

దానిస భావాన్ని, అసమానతలను పోషించుటకు అసత్యము, హింస అవసరమౌతాయి. దైవభావము అబద్ధము. అది నిర్ధారణకు నిలవడంలేదు. దానిననుసరించి ఊహించిన ఆత్మ, పరమాత్మ, పునర్జన్మ స్వర్గ, నరకాలు ఇవేవీకూడా నిర్ధారణకు నిలవడంలేదు. ఇవన్నీ కేవలం మానవుని ఊహలు. ఒక ఆబద్ధాన్ని సమర్థించుటకు మరిన్ని అబద్ధాలు ఊహించవలసి వచ్చింది. అబద్ధాలపై ఆధార పడిన సమాజ నిర్మాణంలో రూపొందిన రాజకీయాలు, ప్రభుత్వ వ్యవస్థ కూడా ఈ అబద్ధాలను సమర్థింప చూసింది. అబద్ధాన్ని అబద్ధం అన్నవారిని శిక్షించడం ప్రారంభించింది. ఇందుకు అతి క్రూరమైన హింసాకాండ జరిపింది. కనుక అసత్యము అసమానతలు వాటిని పోషించుటకు హింస ఒకదానినొకటి సమర్థించుకుంటూ నాస్తికత్వాన్ని అణచివేయుటకు ప్రయత్నించాయి. ఆస్తిక జీవిత విధానంలో అసత్యము, అసమానతలు, హింస ప్రధాన సాధనాలు.

నాస్తికత్వాన్ని జీవిత విధానంగా తీసుకోగానే ఆస్తిక విధానానికి ప్రత్యామ్నాయంగా నాస్తిక జీవిత విధానాన్ని రూపొందించవలసి ఉంది. నాస్తిక జీవిత విధానంలో అసత్యానికీ, అసమానతలకు, హింసకు తావు ఉండకూడదు. సమానత్వము, సత్యము, సహకారము నాస్తిక జీవిత విధానానికి మూలస్థంభాలు.



పెరియార్ ఇ. వి. రామస్వామి – గోరా



గోరా – సరస్వతి

968

ప్రత్యక్షజ్ఞానం, అప్రత్యక్షజ్ఞానము, నిర్ధారణ

దీనినే వాస్తవికత, సంఘసృష్టి, వ్యక్తిత్వము (వాసవ్య) అని గోరా పేర్కొన్నారు. మానవ జ్ఞానంలో అధిక భాగం అప్రత్యక్షజ్ఞానం. సాపృశ్యాన్ని బట్టో, ఆప్తవాక్యాన్ని బట్టో, కార్యకారణ సంబంధాన్ని బట్టో చాలా విషయాలు స్వీకరిస్తాము. అలా స్వీకరించినవన్నీ సత్యమా, కావా అనే అనుమానం వచ్చినప్పుడు ప్రత్యక్ష ప్రమాణానికి లోబర చాలి.ప్రత్యక్ష ప్రమాణానికి నిలిచినదే సత్యము. ప్రత్యక్ష ప్రమాణంలో పూర్తిగా అబద్ధమని తేలిపోయింది అసత్యము. ప్రత్యక్ష ప్రమాణముతో చూసిన తర్వాత సత్యము, అసత్యము మీద అభిప్రాయభేదాలు ఉండుటకు ఆస్కారం ఉండదు.

చాలా విషయాలు ప్రత్యక్ష ప్రమాణంమీద చూచుటకు నిలబడవు. ఇలాగ నిలబడని విషయాలు ఊహలు, సిద్ధాంతములు లేక ప్రతిపాదనలు. ఈ ఊహలు, సిద్ధాంతములు, ప్రతిపాదనలు సత్యాన్వేషణకు సహాయ కారి కాగలవే కాని, అవే సత్యములని ప్రత్యక్ష ప్రమాణమునకు నిలువ నంత వరకు అంగీకరించలేము.

మానవుడు ఆలోచించగలిగే జీవి కనుక, పంచేంద్రియ ప్రత్యక్ష ప్రమాణమును దాటి చాలా ఊహించగలడు. ఈ ఊహలన్నీ సత్యాలను కుంటే వాటిపై సమాజ సంబంధాలు వీర్పర్చుకుంటే, నిరూపించలేని విష యాలను ప్రత్యక్ష జీవితానికి పునాది చేసుకుంటే కష్టాలకు గురౌతాము. అసమానతలకు,హింసకు ప్రోత్సాహం లభిస్తుంది.

వాస్తవిక దృష్టితో చూసినప్పుడు మానవుడు ప్రత్యక్ష ప్రమాణానికి కూపలసిన సాధనాలను, పరోక్షంగా జ్ఞానాన్ని సంపాదించగల ఊహను కలిగిన వ్యక్తి. ఈ విధంగా మానవునికి ఉనికి ఉంది. ఊహించినా వ్యక్తే ఊహిస్తున్నాడు, నిర్ధారణ చేసుకున్నా వ్యక్తే నిర్ధారణ చేసుకుంటున్నాడు, ఆచరించినా వ్యక్తే ఆచరిస్తున్నాడు, ఇతరులతో సహకరించినా వ్యక్తే సహకరిస్తున్నాడు. తన చుట్టూ ఎన్నో వస్తువులున్నాయి, ఎన్నో విష

యాలున్నాయి. వాటిని తాను అర్థం చేసుకుంటున్నాడు. తన ఊహలను. తనవద్ద ఉన్న ప్రమాణాలను, తనవద్ద ఉన్న సాధనాలను ఉపయోగించుకొని మానవుడు తన పరిసరాలను అర్థం చేసుకుంటున్నాడు. ఈ విధంగా మానవుని జ్ఞానమంతా మానవుడు కేంద్రంగాగల జ్ఞానం. జ్ఞానంగాని, అవగాహనగాని, ఆలోచనగాని, ఆచరణగాని మొత్తం మానవ కార్యకలాపాలన్నింటికి మానవుడే కేంద్రం. జ్ఞానానికి గాని, మానవుని ప్రవర్తనకుగాని మానవేతరమైన దేనిని కేంద్రంచేసిన మానవుడు వ్యక్తిత్వం కోల్పోయి, మానవేతర కేంద్రం చుట్టూ పరిభ్రమించే ఉపగ్రహమైపోతాడు. ఆస్తిక సమాజంలో దేవుడు, కర్మ, విధిరాత, జన్మపరంపర, ఆత్మ, పరమాత్మ మొదలైన వాటిని కేంద్రం చేశారు. అందుచేత మానవుని ఊహలు ప్రవర్తన వాటిని ఆధారపడి ఉన్నాయని మానవుడనుకున్నాడు. కాని నిజానికి వీటిని ఊహించింది మానవుడు.

మానవకేంద్ర "విశ్వము"

అలాగే తన చుట్టూఉండే పరిసరాలకు "విశ్వము" అనే పేరు పెట్టి, విశ్వమును కేంద్ర బిందువుచేసి, మానవ ప్రవర్తనకు ఊహలకు విశ్వమును ఆధారం చేస్తే మళ్లీ మానవుడు తన అస్తిత్వాన్ని కోల్పోతున్నాడు. ప్రత్యక్ష నిర్ధారణకు నిలవని దైవభావాన్ని కేంద్రం చేసినా, ప్రత్యక్షంగా కనిపించేవాటిని కేంద్రం చేసినా, మానవుడు మాత్రం కేంద్రంకాకుండా పోతున్నాడు. మానవునిస్వేచ్ఛకి, మానవుని బాధ్యతలకు విఘాతం కలుగుతుంది. కనుక నాస్తికత్వం మానవుణ్ణి కేంద్ర బిందువుగా స్వీకరిస్తుంది. దేవుని ఊహించినా మానవుడే ఊహించాడు. విశ్వంలో నియమాలు ఉన్నాయనుకొని వాటిని అంగీకరించినా మానవుడే అంగీకరించాడు. పరిస్థితులకు ప్రాధాన్యత ఇచ్చినా మానవుడే ఇచ్చాడు. సాంఘిక కట్టుబాట్లను, రాజకీయ వ్యవస్థలను, ఆర్థిక విధానాలను మానవుడే ఏర్పర్చుకున్నాడు. ఈ విధంగా మానవుడు కేంద్రం. ఆ కేంద్ర బిందువునుండి తన ఆలోచనలచేతా, తన ఆచరణద్వారా,

అనుభవాల ద్వారా, సాధనాలద్వారా ఎంత దూరమైతే మనిషి విస్తరించ గలడో అంతవరకు అతని పరిధి ఏర్పడుతుంది. ఆలోచన, ఆచరణ, అనుభవము, సాధనాలు పెరుగుతున్నకొద్దీ మానవుని పరిధి పెరుగుతూ ఉంది. ఆ పరిధి నిరంతరం పెరగడానికి అవకాశం ఉంది. కనుక మాన వుడు కేంద్రబిందువు. విశ్వము, ప్రకృతి ఆ పరిధి.

ఇలా ఆలోచించినప్పుడు దైవముగానీ, పదార్థముగానీ కేంద్రమైతే ఆర్థిక, సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక, వైజ్ఞానిక, నైతిక రంగాలు ఆ కేంద్రంచుట్టూ తిరిగినప్పుడు మానవేతర విషయాలను ఆలంబన చేసు కుంటాయి. అప్పుడు మానవ కృషికి విలువ, ఆధిక్యత ఉండదు. మానవుడు కేంద్రమైనప్పుడు మానవకృషికి విలువ, ఆధిక్యతా ఏర్పడ తాయి. మానవుడు కేంద్రమైన వ్యవస్థలో ఆర్థిక, సాంఘిక, రాజకీయ, నైతిక, వైజ్ఞానిక, సాంస్కృతిక రంగాలు ఒక్కమాటలో మానవజీవితం ప్రధానంగా మానవ కృషిమీదనే ఆధారపడుతుంది. ఇతర శక్తులు ఎన్ని ఉన్నా వాటితో సంఘర్షణకైనా, సహన్యాయానికైనా మానవుడే కేంద్ర బిందువవుతాడు.

సమానత్వపు సాగాలి.

మానవులందరూ ఆకలిదప్పులలోనూ, శక్తిసామర్థ్యాలలోనూ దరిదాపు సమానులు గనుక సమాన గౌరవం, సమాన స్వేచ్ఛ, సమాన బాధ్యత, సమాన అవకాశాలు, సమాన సంతృప్తి కావాలి. వీటిని సాధించ డమే నాస్తికత్వపు రాజకీయ, సాంఘిక, ఆర్థిక, నైతిక, వైజ్ఞానిక, సాంస్కృతిక కార్యక్రమాలు.

ప్రభుత్వ వ్యవస్థ ప్రజలకోసంగాని, ప్రజలు ప్రభుత్వంకోసం కాదు. అందుచేత ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య దోపిడీచేసే వర్గాలేవీ ఉండకూడదు. నేటి పార్టీ, మతాస్వార్థాలు, రాజరికాలు, నియంతృత్వాలు ప్రజలకూ, ప్రభుత్వానికీ మధ్య అడ్డంగా ఉంటున్నాయి గనుక నాస్తిక రాజకీయాలు ప్రభుత్వానికీ, ప్రజలకీ మధ్య నిరంతర సాన్నిహిత్యాన్ని

పెంచుతాయి. విశాల జనసముదాయంలో స్వేచ్ఛను, గౌరవాన్ని కలిగిన పౌరుడు తమయొక్క కార్యకలాపాలు, ఇచ్చి పుచ్చుకోవడాలు సాఫీగా సాగుటకుగాను ప్రభుత్వవ్యవస్థను ఏర్పరచుకున్నారు. ప్రభుత్వ వ్యవస్థకు ప్రజలే యజమానులు. ప్రజలు తమ యాజమాన్యాన్ని సంరక్షించుకుంటూ విశాల సముదాయపు పనులు జరిగేటట్లు చూసుకునే రీతిలో నాస్తిక రాజకీయాలు అభివృద్ధి చెందుతాయి.

మానవులందరికీ ఆకలిదప్పులు సమానం గనుక, నిత్యజీవితావసరాలు సమానం గనుక వీటిని తీర్చే ఉత్పత్తిగాని, ఉత్పత్తి సాధనాలు గాని కొద్దిమంది గుత్తకావడానికి వీలులేదు. అవి అందరికీ సమానంగా చెందాలి. ప్రభుత్వాలుకూడా వాటిని తమ గుప్పిటిలో పెట్టుకుని ప్రజలను పీడించడానికి వీలులేదు. ఆర్థిక వ్యవస్థ ఉత్పత్తికి, జరిగిన ఉత్పత్తి సమాన పంపిణీకి సంబంధించినది కనుక ప్రజల పరస్పర సహకారంతో ఒకరిని మరొకరు దోపిడి చేయుటకు వీలులేని విధంగా రూపొందాలి. ఇందుకు ఉత్పత్తి సాధనాలు అందరికీ అందుబాటులో ఉండాలి. అవి వ్యక్తుల గుత్తగాగాని, సమూహాల గుత్తగాగాని ఉండడానికి వీలులేదు. కొందరిని మినహాయించి మరికొందరికి వాటిపై యాజమాన్యం ఉండడానికి వీలులేదు. ఈ విధంగా నాస్తిక ఆర్థిక విధానం ఉత్పత్తి సాధనాలపై వ్యక్తుల యాజమాన్యాన్ని, ఉత్పత్తిపై గుత్తాధిపత్యాన్ని తొలగించి సహకారకృషిని పెంపొందిస్తుంది.

సాంఘికంగా కులాలు, మతాలు, రంగుభేదాలు, దేశాలు మానవుడు ఏర్పరచుకున్నవే. మానవులందరూ సమానులే కనుక సమాన సాంఘిక గౌరవానికి అడ్డుతగిలే ప్రతీ వ్యవస్థా పోవలసిందే. ఓవరకు జాతీయతా భావంకూడా మనిషికీ, మనిషికీ మధ్య అడ్డుగోడగా నిలుచుంటోంది గనుక నెమ్మదిగానైనా ప్రపంచ ప్రభుత్వం ఫెడరల్ వ్యవస్థగా రూపొందాలి. ఆహార స్వేచ్ఛ, జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛ ప్రతీ ఒక్కరికి పుట్టుక స్వేచ్ఛలు.

నీతి సంఘావసరం. మానవుల మధ్య పరస్పర సంబంధాలలో పరస్పర విశ్వాసము, పరస్పర సహకారమే నీతికి మూలం కావాలిగాని, మానవేతర శక్తులు లేదా భావనలు నీతికి మూలం కారాదు.

ఇంతవరకూ మానవ విజ్ఞానం పూర్తిగా మానవ సౌఖ్యానికి ఉపయోగపడడం లేదు. సాంఘిక అసమానతలను, ఆర్థిక దోపిడీని, రాజకీయ ఆధిపత్యాన్ని నిలుపుటకు విజ్ఞానశాస్త్రం తన సాధనాలద్వారా సహకరిస్తోంది. ఇకనుంచి విజ్ఞానశాస్త్రం మానవులను ఉత్సాహపరిచేదిగాను, ప్రశాంతంగా జీవించేందుకు హామీనిచ్చేదిగానూ అభివృద్ధి చెందాలి.

సాంస్కృతిక రంగంలో లలిత కళలు మానవాతీత శక్తుల గుణగానానికి సాధనాలై నేటి అసమానతలమధ్య ఆధిక్యతలను అనుభవిస్తున్న వారికి వినోద సాధనాలుగానూ, వారికి వినోదం కలిగించేవారికి జీవికార్జన సాధనంగానూ తయారైనాయి. ఇలాకాక అందరికీ వినోదమిచ్చి, సమిష్టి ప్రయోజనాన్ని సమకూర్చేరీతిలో లలిత కళలు అభివృద్ధి చెందాలి.

ఈ విధంగా మానవులు సహకారంతో తమ వ్యవస్థలను నిర్మించుకుంటారు. ఈ వ్యవస్థలకు ఆధారం సత్యము, సమానత, సహకారము. అసత్యముగాని, అసమానతలుగాని, నిరంకుశత్వముగాని ఏ వ్యవస్థలో తలఎత్తినా వాటిపై నిరంతరం తిరుగుబాటు చేస్తారు.

ఈ విధంగా నాస్తిక జీవిత విధానం మానవునికి స్వేచ్ఛను, బాధ్యతను కలిగించి కృషిని, సహకారాన్ని పెంచి ఎప్పటి కప్పుడు మరింత సంతృప్తికరంగా, మరింత సంతోషదాయకంగా ఉండేట్లు పురోగమింపజేస్తుంది.

*

(0)

నాస్తికత్వం

[లేక దేవుడు లేడు]

నాస్తికత్వంపై భారత దేశంలో మొట్టమొదటగా సమగ్రంగా రచింప బడిన పుస్తకం. 1940లో శ్రీ గోరా రచించగా, ఆనాడు తెలుగు ప్రాంత మంతటినీ భావవిప్లవంలో ముంచెత్తిన పుస్తకం. ఇందులో ఆస్తికత్వము, నాస్తికత్వము, మానవ జీవితము, నాగరికత, సత్యము, సంఘము, సంతోషము, దేవుడు, జీవుడు, పరలోకము, నాస్తికత్వము - రాజకీయాలు మొదలైన విషయాలు చర్చించబడ్డాయి. వెల: రు 6-00

✿

దేవుని పుట్టుపూర్వోత్తరాలు

దైవభావం మానవ జీవితంతో చిరకాలంగా పెనవేసుకుని ఉన్నా, దానికే అర్థం చెప్పినా అది నిర్ధారణకు నిలవని ఊహ మాత్రమే. అయినా ఈ భావం సమాజానికి ఒకప్పుడు బాగా ఉపయోగపడింది. ఇంకా మనం దాన్ని యదార్థమనుకుంటే అనర్థాలే కలుగుతున్నాయి. దైవభావం ఎలా వచ్చింది? దాన్ని బుజువు చేసుకోబోతే కనపడే లోపాలు ఏవి? దాని వల్ల కలిగిన ఉపయోగాలేమిటి? దైవభావం తీసేస్తే సమాజం ఎలా ఉంటుంది? మొదలైన విషయాలు క్లుప్తంగా, సరళంగా, స్పష్టంగా ఇందు గోరా వివరించారు. వెల: రు. 1-25

జీవితం నేర్పిన పాఠాలు

జీవితంలో జరిగే ప్రతీ సంఘటన అదిఎంత చిన్నదయినా, మనకు పాఠం నేర్పగలుగుతుంది. అందుకు అవసరమైన పరిశీలనా దృష్టి, ఉదార హృదయం ఉండాలి. అలా గోరాగారు ఎన్నో సామాజిక సమస్యలను తరచి చూసి, జీవితానుభవాలను వడపోసి రేడియోలో చేసిన ప్రసంగాలు, మరికొన్ని వ్యాసాలు కలిపి ఈ "జీవితం నేర్పిన పాఠాలు" అయింది, ప్రతి ఒక్కరూ చదవవలసిన పుస్తకం. వెల: రు 3-00

సృష్టి రహస్యం

ప్రతీవాళ్ళని వేధించే ప్రశ్న ఈ సృష్టి అంతా ఏమిటి? ఏదో మూలశక్తో, దైవమో లేకపోతే ఇవంతా ఎలా సృష్టింపబడింది? పోనీ దైవసృష్టి కాకపోతే పరిణామక్రమంలో ఇవంతా వస్తే అదెలా జరిగింది? అందులోమాత్రం అనుమానాలు రావా? వస్తే వాటినెలా అర్థం చేసుకోవాలి? సృష్టిమొత్తం మానవుని అవగాహన ఎలా ఉండాలి? ఖగోళ శాస్త్రాన్ని, జీవ శాస్త్రాన్ని, పరిణామ వాదాన్నీ అందరికీ అర్థమయ్యే తేలిక భాషలో గోరా ఇందు వివరించారు. నాస్తిక జిజ్ఞాసాపరులకేగాక, విద్యార్థులకు కూడా ఈ పుస్తకం విజ్ఞానదాయకంగా ఉంటుంది. ఈ పుస్తకానికి లవణం వ్రాసిన పరిచయం మొదటకు మేత. వెల; 2-50

మూఢనమ్మకాలు - నాస్తిక దృష్టి

ఆదిమ మానవులు అజ్ఞానంవల్ల ఏర్పడిన భయంలో ప్రతిదానినీ దైవీ దేవతలుగానో లేక దయ్యాలుగానో ఊహించుకుని మూఢంగా అర్థాలు చెప్పుకున్నారు. సహజంగా జరిగేదేదీ అలౌకికంకాదు. అందులో తప్పక మోసం ఇమిడి ఉండాలి. మూఢ నమ్మకాలవల్ల అజ్ఞానానికి పాదుకట్టి నీళ్లుపోస్తున్నాం, మోసానికి పందిరివేసి పాకిస్తున్నాం. నాస్తిక దృష్టితో వీటిని పరిశీలిస్తే విజ్ఞానం వికసిస్తుంది, మోసం బయటపడుతుంది. గోరాగారు నాస్తిక దృక్పథంతో దయ్యాలు, పూనకాలు, మంత్రాలు, మహాత్మ్యాలు, నిప్పుమీదనడవడం, బాబాలు, బాలయోగులు అతీంద్రియ జ్ఞానం, తలలున్న తాటిచెట్లు, నాగుపాములాంటి గుమ్మడితీగ మొదలైన ఎన్నో విషయాలను పరిశీలించి, పరీక్షించి వివరించిన విషయాలే ఈ "మూఢ నమ్మకాలు - నాస్తిక దృష్టి" పుస్తకం.

శ్రీ లవణం వ్రాసిన దీర్ఘమైన "పరిచయం"లో మూఢనమ్మకాల వెనుక ఉన్న మనస్తత్వాన్ని, సామాజిక వాతావరణాన్నీ చక్కగా చిత్రించారు.

హేతువాద పరిశీలనాదృష్టి పెంపొందించుకొనుటకు ప్రతి ఒక్కరూ తప్పక చదవవలసిన పుస్తకం.

వెల : రు. 3-0(

నాస్తికమార్గం

నాస్తికత్వానికి సంబంధించిన సమగ్ర మాసపత్రిక

సంపాదకులు :

మైత్రి, హేమలతాలవణం

సంవత్సర చందా రు. 12/-

నాస్తికమార్గం

పటమట, విజయవాడ - 520 006.

మువసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనావర్తిక

పుస్తకం సంఖ్య	PJSA118B184
పుస్తకం పేరు	వాస్తైకత్వం అభవృద్ధి చరిత్ర
తారీఖు	27 March 2025
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	113
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	96B, ,2,8,34,50,66,80B
లేవి పేజీలు	NO
తయారు చేసినది	Pujallika Rajveer
పేజీలు విడదీసినది	Sharmila
స్కాన్ చేసినది	THASIN
పరీక్ష చేసినది	
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good